
భర్తృహరి నీతి శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


డీలిమిటేషన్ ప్రక్రియ నుంచి మరో ప్రమాదం
జమ్మూ-కశ్మీర్, అసోం నుంచి గుణపాఠాలు

కుల నిర్మూలనకు కారల్ మార్క్స్, అంబేద్కర్ దృక్పథం కావాలి


లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 112 | శనివారం | 22-03-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


బిఆర్‌ఎస్ ప్రభుత్వ అప్పులతో

# భవిష్యత్ తరాలకు అన్యాయం



- రూ.7 లక్షల కోట్ల అప్పులతో ఏ వర్గానికీ మేలు జరగలేదు
- పేదల అభ్యున్నతికి గుదిబండగా మార్చి వెళ్లింది
- ప్రస్తుత ప్రభుత్వం అప్పులవైపు చూడకుండా ఆదాయ వనరులు సృష్టించుకొని ముందుకు నడవాలి
- సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు ఆందోళన

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. అర్హులైన వారికి జిఓ 58 కింద ఉచితంగా క్రమబద్ధీకరించాలి. మిగిలిన వారికి జిఓ 59 ద్వారా క్రమబద్ధీకరించడంతో ఆదాయం సమాకూరుతుంది.
– సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని

ప్రజాపక్షం/హైదరాబాద్

అభివృద్ధి పేరుతో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులతో ఏ ఒక్క వర్గానికీ మేలు జరగకపోగా, రానున్న మూడు తరాలకు కూడా అన్యాయం చేసిన వారి మయ్యామని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. శాసనసభలో శుక్రవారం 2025–26 వార్షిక ఆర్థిక బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటికి రూ.70 వేల కోట్లుగా ఉన్న అప్పులు కేవలం 11 ఏళ్ల కాలంలో గత పాలకులు రాష్ట్రాన్ని రూ.7 లక్షల కోట్ల అప్పుల ఊబిలో నెట్టి పేదల అభ్యున్నతికి గుదిబండగా మార్చి వెళ్లారని విమర్శించారు. ప్రస్తుత 2025–26 బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్‌కు సంబంధించి కీలకమైనదని, ఈ ప్రభుత్వమైనా సాధ్యమైనంత వరకు అప్పుల వైపు చూడకుండా ఆదాయ వనరులను సృష్టించుకుని పాలనను ముందుకు నడపాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో బడ్జెట్ రూ.లక్ష కోట్లు అంటేనే అశ్చర్య పోయేవారమని, కానీ కేవలం తెలంగాణ రాష్ట్ర బడ్జెట్టే రూ.3లక్షల కోట్లకు చేరడం గమనార్హమన్నారు. బడ్జెట్ రూ.3లక్షల కోట్లైతే, అప్పులు మాత్రం రూ.7 లక్షల కోట్లు అని, మరి ఇది ఏ అభివృద్ధికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేయవద్దనడం లేదని, అప్పు చేయకుంటే అప్పును తీర్చలేమని, అందుకే అప్పు అనివార్యమన్నారు. ప్రస్తుతం ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితికి మించి అప్పు


తరువాయి 2లో


రూ.16.70 లక్షల కోట్ల ఖర్చుతో

# ఏం సాధించారు?

- ప్రాజెక్టులు కట్టారా?
- ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మించారా?
- ప్రభుత్వరంగ సంస్థలు తీసుకొచ్చారా?
- ఒక్క కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యింది
- విద్యాసంస్థలను ధ్వంసం చేసి, ఆర్థిక అరాచకత్వం సృష్టించారు
- గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం
- బడ్జెట్‌పై జరిగిన చర్చలో సభ్యులు ప్రస్తావించిన అంశాలకు సమాధానం



ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ. 16,70,711 కోట్లను ఖర్చు చేసి రాష్ట్రంలో ఏం సాధించారని డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ఈ నిధులతో నాగార్జున సాగర్, ఎస్‌ఆర్‌ఎస్‌పి, శ్రీపాదరావు ఎల్లంపల్లి , కడెం ప్రాజెక్టలను నిర్మించారా?, లేదా అవుట్ రింగ్‌రోడ్‌ను నిర్మించారా? లేదా బిడిఎల్, ఇసిఐఎల్, లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను తీసుకొచ్చారా? అని నిలదీశారు. కేవలం ఒకే ఒక కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మిస్తే ఏమైందో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్ర వ్యవస్థలను విధ్వంసం చేసి, ఆర్థిక అరచకత్వాన్ని సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారు తమను బుద్ధిమాంధ్యం అని మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ తరహా కాకుండా ఆదాయం, ఖర్చులను దృష్టిలో పెట్టుకుని ప్రజా ప్రభుత్వం వాస్తవిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని, కేవలం 4.7 శాతం పెంపుదలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని సభలో వివరించారు. బిఆర్‌ఎస్ తరహా తాము గాలిలో మేడలు కట్టబోమని, ఆశలపల్లకిలో తీసుకెళ్లబోమని స్పష్టం చేశారు. శాసనసభలో సాధారణ బడ్జెట్‌పై శుక్రవారం జరిగిన చర్చలో సభ్యులు ప్రస్తావించిన అంశాలకు భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. గత పదేళ్ల బడ్జెట్ ప్రతిపాదనలను పరిశీలిస్తే ,కనీసం 20 శాతం పెంపుదలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని వివరించారు. గత ప్రభుత్వం తరహాలోనే తాము 20 శాతం బడ్జెట్ ను పెంచాల్సి వస్తే, ప్రస్తుత బడ్జెట్ రూ. 4,18,170 కోట్లకు అంచనాలు పెరిగేవని భట్టి తెలిపారు. తాము అస్తవ్యస్థమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతామని, ఆ బాధ్యతను తాము తీసుకుంటామని భరోసానిచ్చారు. ప్రతి రూపాయి దుబారాకాకుండా జాగ్రత్తగా కాపాడుతున్నామన్నారు. శాసనసభ ఆమోదం లేకుండా రూ.2,89,150 కోట్లు ఖర్చు చేశారని కాగ్ నివేదికలో పొందుపర్చిన విషయాన్ని భట్టి వివరించారు. డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణం, మూడు ఎకరాల భూమి, ప్రతి శాసనసభ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు నీటిని అందిస్తామని, కెజి నుంచి పిజి వరకు విద్యా వ్యవస్థలు, ప్రతి ఇంటికి ఉద్యోగం ఇలా పదేళ్లు చెప్పి, చెప్పి, ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం చివరి


తరువాయి 2లో


ఎంపిల సంఖ్యతో పాటు

# రాష్ట్ర హక్కులకు భంగం

- లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు సిఎం స్టాలిన్ ఆందోళన

నేడు చెన్నైలో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం



**చెన్నై :** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రంలోని బిజెపికి, పలు రాష్ట్రాల ప్రభుత్వాలకు మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో దీనిపై చర్చించేందుకు పలు రాష్ట్రాల నాయకులతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఈ నెల 22న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి ముందు స్టాలిన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో జనాభా


తరువాయి 12లో


# నేటి నుంచే ఐపిఎల్




కోల్‌కతాలోని చారిత్రక ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్ శనివారం నుంచి ప్రారంభం కానుంది. డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ తొలి మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరును ఢీ కొంటుంది. స్టార్ స్పోర్ట్స్ చానెల్స్‌లో ఐపిఎల్ ప్రత్యక్ష ప్రసారాలను చూడవచ్చు. జియో చాలెన్ నామమాత్రపు టారిఫ్‌తో మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

బిఆర్‌ఎస్‌పై కోపంతో

# లెక్కలెక్కువ చూపొద్దు



- రాష్ట్రం దివాళా తీసిందని పదేపదే చెప్పొద్దు
- కాంగ్రెస్ ప్రభుత్వానిది అవాస్తవిక గాలిమేడల బడ్జెట్
- కృష్ణానదీ జలాలపై ఈబడ్జెట్‌లోనే చర్చ పెట్టాలి
- మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–26 వార్షిక బడ్జెట్ అవాస్తవిక బడ్జెట్ అని, గాలి మేడల బడ్జెట్ అని రాష్ట్ర మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏ తీవ్రంగా విమర్శించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన మొత్తం అప్పు రూ.4.22 లక్షల కోట్లు అని, బిఆర్‌ఎస్‌పై కోపంతో అప్పుల లెక్క ఎక్కువ చేసి చూపొద్దని, రాష్ట్రం దివాళా తీసిందని పదే పదే చెప్పవద్దని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. 'కృష్ణా నదీ జలాలపై ఈ బడ్జెట్లోనే చర్చ పెట్టాలి. కాంగ్రెస్ నిర్వాకం వల్ల ఈ ఏడాది 34 శాతం వాడాల్సిన నీళ్లలో 24 శాతమే ఉపయోగించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంటలు ఎండుతున్నాయి. నీటిని రాబట్టడంలో ప్రభుత్వం ఎలా విఫలమైందో చర్చించాలి. తెలంగాణకు వరంగా


తరువాయి 2లో


గ్రామీణ రోడ్లకు

# టోల్ విధించం



- రాష్ట్ర రహదారులకూ అమలు చేసే ఆలోచన లేదు
- కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన 40 శాతం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది
- ప్రతి గ్రామం నుంచి మండలానికి డబుల్‌రోడ్డు వేయిస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ
- రోడ్లపై మాజీమంత్రి హరీశ్‌రావుకు సవాల్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర రహదారులకు, గ్రామీణ రోడ్లకు టోల్ విధించే ఆలోచన లేదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన 40 శాతం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని, వారికి మూడు నెలలకు లేదా ఆరు నెలలకు చెల్లిస్తామని మంత్రి చెప్పారు. ప్రతి గ్రామం నుంచి మండలానికి డబుల్ రోడ్లు వేయిస్తామన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌కే రోడ్లు వేశారని, ఆ మూడు రోడ్లకు చివరికి సింగరేణి నిధులను సైతం ఉపయోగించుకున్నారని మంత్రి విమర్శించారు. రోడ్ల విషయంలో ఛాలెంజ్ చేస్తున్నా రాష్ట్రమంతా తిరిగి చూద్దామా అని హరీశ్‌రావుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సవాల్ విసిరారు. కమీషన్లు రావనే తమ జిల్లాలకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం రోడ్లు వేయలేదని మంత్రి అన్నారు. ఇందుకు బిఆర్‌ఎస్ సభ్యులు హరీశ్‌రావు స్పందిస్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. బిఆర్‌ఎస్ హయాంలో ఆర్‌అండ్‌బి పనుల గురించి లెక్కలు తీద్దామని అన్నారు. రోడ్ల గురించి ఒక రోజు ప్రత్యేకంగా చర్చిద్దామని, శాసనసభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్


తరువాయి 2లో




18 మంది బిజెపి

# ఎమ్మెల్యేలు సస్పెన్షన్

- ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తూ కర్నాటక అసెంబ్లీ తీర్మానం
- సభా కార్యక్రమాలను అడ్డుకున్నందుకు, అధ్యక్ష స్థానాన్ని కించపరిచినందుకు చర్యలు
- 'హనీ ట్రాప్' వ్యవహారంపై దద్దరిల్లిన శాసనసభ

**బెంగళూరు :** కర్ణాటకలో మంత్రులు సహా అనేక మంది ముఖ్యనేతలే లక్ష్యంగా కొనసాగుతోన్న 'హనీ ట్రాప్' వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. జాతీయ స్థాయి నేతలు సహా 48 మంది రాజకీయ నాయకులు ఇందులో బాధితులుగా ఉన్నారంటూ ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. దీనిపై శుక్రవారం కర్ణాటక అసెంబ్లీ దద్దరిల్లింది. సమావేశాల వేళ ప్రతిపక్ష


తరువాయి 12లో


రాజ్యాంగ పరిరక్షణకు

# కంకణబద్ధులవ్వాలి

- మతోన్మాద బిజెపి ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి
- దక్షిణాదికి అన్యాయం చేసే కుట్ర
- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి



దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బిజెపి ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. పార్లమెంటు స్థాయిలో జనాభా ప్రాతిపదికన నియోజకవర్గ పునర్విభజన చేయకుండా (డిలిమిటేషన్) జమిలీ ఎన్నికలను తెరపైకి తెచ్చి దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే కుట్ర జరుగుతోందన్నారు. కరీంనగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డీలిమిటేషన్ లేకుండా జమిలీ ఎన్నికలను తెరపైకి తెచ్చి ఉత్తరాదిలో ఎక్కువ సీట్లు దక్షిణాదిలో తక్కువ సీట్లు ఉండేలా కుట్రలు చేస్తోందన్నారు. తద్వారా ప్రతిపక్షాలను అణగదొక్కాలనే ప్రయత్నం చేస్తోందన్నారు. దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని గండి కొట్టే విధంగా రాజ్యాంగాన్ని మార్చేలా లౌకిక వ్యవస్థకు భిన్నంగా వ్యవహరిస్తున్న బిజెపికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిపిఐ నిర్ణయం తీసుకుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కంకణ బద్ధులు


తరువాయి 12లో


# ట్రంప్ మరో వివాదాస్పద నిర్ణయం

విద్యాశాఖ మూసివేత ఉత్తర్వుపై సంతకం



**వాషింగ్టన్:** భారత్‌తోపాటు వివిధ దేశాలకు చెందిన విద్యార్థులను వెనక్కు పంపడమేగాక, పలు ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలను కుదిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా మరో వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారు. చైనా, భారత్, మెక్సికో, కెనడాసహా వివిధ దేశాల నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై సుంకాలను భారీగా పెంచుతూ ఉత్తర్వులపై ఇది వరకే సంతకాలు చేసిన ఆయన, ఇప్పుడు అమెరికా విద్యాశాఖ మూసివేత ఉత్తర్వులపై సంతకం చేశారు. అమెరికా అధ్యక్షుడి అధికార నివాసం వైట్ హౌస్‌లోని ఈస్ట్ రూమ్‌లో


తరువాయి 12లో


అకస్మాత్తుగా

# రాళ్ల వాన





- మెదక్‌లో ఓ ఇంటిపై పిడుగుపాటు
- పలుచోట్ల నేలవాలిన వరి
- రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు వర్షాలు
- భారీ నుంచి అతిభారీగా కురిసే అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులతో కురుస్తున్న వానకు మామిడికాయలు రాలిపడ్డాయి. మెదక్ పట్టణం జంబికుంట వీధిలో ఓ ఇంటిపై పిడుగుపాటు పడటంతో సిద్ధయ్య అనే వ్యక్తి ఇంట్లో సామగ్రి ధ్వంసం


తరువాయి 12లో


# ఆస్తిపన్ను మొండి బకాయిలు వసూలు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ



నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ పరిధిలో ఆస్తి పన్ను మొండి బకాయిలను శుక్రవారం అధికారులు చేపట్టారు. సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ పన్ను వసూళ్లలో ప్రత్యక్షంగా పాల్గొని ఒక పెట్రోల్‌బంక్, ఒక ఫంక్షన్‌హాల్, 7 ఇండ్లు, దుకాణాలను సీజ్ చేశారు. పట్టణంలోని జొన్నలగడ్డ జానారెడ్డి కాంప్లెక్స్ రూ.9లక్షలు బకాయిలు ఉండగా సీజ్ చేశారు. సయ్యద్ ఖాజా రూ.2.16లక్షలు ఉండగా సీజ్ చేశారు. ఫ్లైఓవర్ సమీపంలో హెచ్‌పీ పెట్రోల్‌బంక్ రూ.80వేలు బకాయిలు ఉండగా సీలు వేసిన అనంతరం


తరువాయి 12లో

# తాజాగా మరో క్షిపణి ప్రయోగం

ప్రకటించిన ఉత్తర కొరియా

అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాలే కారణమని స్పష్టీకరణ







**సియోల్ :** తాజాగా యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ క్షిపణులను పరీక్షించినట్టు ఉత్తర కొరియా ప్రకటించింది. అమెరికా, దక్షిణ కొరియా సంయుక్తంగా నిర్వహిస్తున్న సంయుక్త సైనిక విన్యాసాల కారణంగానే తమ ఆయుధ బలాన్ని పరీక్షించుకుంటున్నామని స్పష్టం చేసింది. ఉత్తర కొరియా సుప్రీం లీడర్ కిమ్ జాంగ్ ఉన్ స్వయంగా ఈ పరీక్షలను పరిశీలించారని, ఆ దేశ అధికారిక వార్తా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ తెలిపింది. కాగా, అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత దక్షిణ కొరియాతో కలిసి అమెరికా మొదటిసారి సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించింది. 11 రోజులు సాగిన ఈ విన్యాసాల్లో ఇరు దేశాల సైనికులు పలు విన్యాసాలను ప్రదర్శించారు. 'ఫ్రీడం షీల్డ్' పేరుతో ప్రతి సంవత్సరం ఈ రెండు దేశాలు సైనిక విన్యాసాలు జరుపుతునే ఉన్నాయి. కాగా, తమ భూభాగానికి సమీపంలో జరుగుతున్న ఈ తతంగంపై ఉత్తర కొరియా చాలాకాలంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తునే ఉంది. ముందు జాగ్రత్తగా తాము కూడా అన్ని విధాలా సిద్ధమవుతామని కూడా పలు సందర్భాల్లో స్పష్టం చేసింది. ఈ ఏడాది ఆరు పర్యాయాలు క్షిపణులను పరీక్షించి, సైనిక పాటవాన్ని పెంచుకుంది. పిటిఐ సమాచారం మేరకు, తాజాగా అమెరికా, దక్షిణ కొరియా 'ఫ్రీడం షీల్డ్' సైనిక విన్యాసాలు ఈనెల 10వ తేదీన ముగియగా, అదే రోజున ఉత్తర కొరియా యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ మిసైల్‌ను పరీక్షించింది. తమ భూభాగాన్ని రక్షించుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పింది. తమ అణ్వాయుధాలను ధ్వంసం చేయడానికి అమెరికా, దక్షిణ కొరియా ప్రయత్నిస్తున్నాయని ఆరోపిస్తూ, అలాంటి చర్యలను తిప్పికొడతామని పేర్కొంది.

**ఉత్తర కొరియాకు రష్యా అధికారి :** రష్యా సైనిక ఉన్నతాధికారి శుక్రవారం ఉత్తర కొరియా చేరుకున్నారు. ఆయన రాకకు గల ప్రధాన ఉద్దేశం ఏమిటనేది కొరియన్ సెంట్రల్ న్యూస్ తన ప్రకటనలో వివరించలేదు. అయితే, ఉక్రేన్‌తో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో, సైనిక బలగాలను పంపాల్సిందిగా కోరేందుకే రష్యా భద్రతామండలి కార్యదర్శి సెర్గీ షోయ్‌గు ఉత్తర కొరియా రాజధాని పయాంగ్యాంగ్ చేరుకున్నారని సమాచారం. ఉత్తర కొరియా చీఫ్ కిమ్ జాంగ్ ఉన్‌తో జరిగే భేటీలో ఆయన ఈ ప్రస్తావన తీసుకురావచ్చు.

ప్రపంచం

# బీజింగ్‌కు అమెరికా సెనేటర్ డెయిన్స్



**బీజింగ్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడు, సెనేటర్ స్టీవ్ డెయిన్స్ మూడు రోజుల పర్యటన నిమిత్తం బీజింగ్ చేరుకున్నారు. ఈ పర్యటన వివరాలను అమెరికా అధికారికంగా ప్రకటించనప్పటికీ, పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక ఉన్నతాధికారి ఇచ్చిన సమాచారాన్ని ఉటంకిస్తూ పిటిఐ సమాచారాన్ని అనుసరించి, ఫెంటానిల్ అక్రమ రవాణాపై చైనా అధికారులతో డెయిన్స్ చర్చించే అవకాశాలు ఉన్నాయి. మాదకద్రవ్యంగా పేర్కొనే ఫెంటానిల్ ఎగుమతులను నిరోధించడానికి చైనా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని కొంతకాలంగా అమెరికా ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. చైనా ఉత్పత్తులపై సుంకాన్ని అమెరికా 20 శాతం పెంచడం, అందుకు ప్రతిస్పందనగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై 15 శాతం పన్నులు విధించడం, ఇరుదేశాల మధ్య వాణిజ్య యుద్ధానికి తెరతీసింది. అంతర్జాతీయ ఒప్పందాలకు విరుద్ధంగా, టారిఫ్‌లను పెంచిన ట్రంప్ ప్రభుత్వం, ఆ తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఫెంటానిల్ ఔషధాన్ని పంపుతున్నామంటూ తమపై ఆరోపణలు చేస్తున్నదని చైనా అంటున్నది. అమెరికాలో వేలాది మరణాలకు కారణమైన ఫెంటానిల్ ఎగుమతులను తక్షణమే నిలిపివేయాలని చైనాను అమెరికా కోరుతుండగా, ఇందులో ఎంతమాత్రం నిజం లేదని చైనా స్పష్టం చేస్తున్నది. మొత్తం మీద రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం ప్రారంభమై, ఆరోపణలు... ప్రత్యారోపణలు తీవ్రస్థాయికి చేరుకున్న సమయంలో డెయిన్స్ చైనా పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇలావుంటే, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ త్వరలోనే ప్రత్యక్షంగా లేదా టెలిఫోన్ ద్వారా చర్చిస్తారని తెలుస్తోంది. వైట్‌హౌస్ నుంచి మాత్రం ఎలాంటి సమాచారం లేదు.



# ముంచుకొస్తున్న గడువు

## పాకిస్తాన్ నుంచి భారీగా అఫ్ఘాన్ల తరలింపు

**పెషావర్ :** తమ దేశంలో అక్రమంగా ఉంటున్న లక్షలాది మంది అఫ్ఘానిస్థాన్ పౌరులు తిరిగి తమ స్వదేశానికి వెళ్లేందుకు పాకిస్తాన్ విధించిన గడువు దగ్గరపడుతున్నది. ఈ క్రమంలోనే భారీగా తరలింపులు ప్రారంభమయ్యాయి. ఈనెల 31వ తేదీ లోగా అక్రమ వలసదారులు స్వదేశానికి వెళ్లాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని పాకిస్తాన్ ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ఈనెల 20వ తేదీ నాటికి 8,74,282 మందిని వెనక్కు పంపామని, వారికి మార్గమధ్యంలో అవసరమైన ఆహారం, మందులు, ఇతర సౌకర్యాలను కల్పించినట్టు ఒక ప్రకటనలో తెలిపింది. మిగతా వారు కూడా ఈనెలాఖరు లోగా వెళ్లిపోవాలని పేర్కొంది. పెరుగుతున్న ఉగ్రవాద దాడుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించిన పాకిస్తాన్ సర్కారు, తగిన గుర్తింపు పత్రాలతో అధికారికంగా ఉంటున్న అఫ్ఘాన్లకు ఈ ఉత్తర్వులు వర్తించవని స్పష్టం చేసింది. ఇలావుంటే, తరలింపు ప్రక్రియను దశలవారీగా చేపట్టాలని అఫ్ఘానిస్తాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకి పాకిస్తాన్‌తోసహా ప్రపంచ దేశాలను కోరారు. వివిధ దేశాల్లో ఉన్న అఫ్ఘాన్ పౌరులు తిరిగి స్వదేశం చేరుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# రిపబ్లికన్ ప్యాలెస్ తిరిగి స్వాధీనం

ప్రకటించిన సూడాన్ సైన్యం



**కైరో :** తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉన్న చిట్టచివరి భవనం 'రిపబ్లికన్ ప్యాలెస్'ను తిరిగి స్వాధీనం చేసుకున్నట్టు సిరియా సైన్యం ప్రకటించింది. ఖర్టౌమ్‌లోని ఈ ప్యాలెస్‌ను రంజాన్ మాసం 21వ రోజు, శుక్రవారం తమ ఆధీనంలోకి తెచ్చుకున్నట్టు పేర్కొంది. ఈ భవనాన్ని సూడాన్ ప్రభుత్వం అత్యంత కీలకంగా భావిస్తుంది. అక్కడి బ్యాంక్ నోట్లు, పోస్టేజీ స్టాంప్స్‌పై ఈ ప్యాలెస్ కనిపిస్తుంది. నైల్ నదికి ఆనుకొని ఉన్న రిపబ్లికన్ ప్యాలెస్‌ను తిరిగి సంపాదించుకోవడంతో, తిరుగుబాటుదారులపై సైన్యం ఆధిపత్యాన్ని సాధించింది.

2023 ఏప్రిల్‌లో మొదలైన అంతర్యుద్ధం తీవ్రరూపం దాల్చింది. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాలు తిరుగుబాటుదారుల చేతికి చిక్కాయి. అయితే, ఇటీవల ఆర్మీ చీఫ్ జనరల్ అబ్దెల్ ఫతా బుర్హాన్ నేతృత్వంలో సూడాన్ సైన్యం ముందంజ వేస్తూ, ఒక్కో ప్రాంతాన్ని మళ్లీ స్వాధీనం చేసుకుంటూ వస్తున్నది. ఈ క్రమంలో చివరి మజిలీగా ఖర్టౌమ్‌ను పేర్కోవచ్చు. అక్కడి రిపబ్లికన్ ప్యాలెస్‌ను సైన్యం ఆక్రమించుకోవడంతో, తిరుగుబాటు 'ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్'కు నాయకత్వం వహిస్తున్న జనరల్ మహమ్మద్ హమ్దాన్ డగాలో అక్కడి నుంచి అజ్ఞాతానికి వెళ్లడం ఖాయంగా కనిపిస్తున్నది.

# భారతీయ విద్యార్థిని వెనక్కు పంపొద్దు

ట్రంప్ సర్కారుకు ఫెడరల్ కోర్టు ఆదేశం



**అలెగ్జాండ్రియా (వర్జీనియా/అమెరికా):** హమాస్ సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నాడన్న కారణంగా అరెస్టయిన భారతీయ విద్యార్థిని స్వదేశానికి పంపడానికి వీల్లేదని అమెరికా ప్రభుత్వాన్ని ఫెడరల్ కోర్టు ఆదేశించింది. జార్జిటౌన్ విశ్వవిద్యాలయంలో ఫెల్లోషిప్ చేస్తున్న డాక్టర్ బదార్‌ఖాన్ సూరిని ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. సోషల్ మీడియా వేదికగా అతను హమాస్ వాదనను బలపరుస్తూ, ప్రచారం చేస్తున్నాడని పోలీసుల ఆరోపణ. అమెరికా సార్వభౌమాధికారానికి విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తూ, ఒక వర్గాన్ని రెచ్చగొడుతున్నాడని అతనిపై పోలీసులు అభియోగం మోపారు. అయితే, తన క్లయింట్‌కు నేర చరిత్ర లేదని సూరి తరఫు లాయర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులపై సూరి తన అభిప్రాయాలను వెల్లడించాడని పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సూరి వ్యవహరించాడని నిరూపించే ఏ ఒక్క ఆధారాన్ని కూడా ప్రాసిక్యూషన్ కోర్టుకు సమర్పించలేదని తెలిపారు. సూరిని అరెస్టు చేయడం అతని భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమేనని వ్యాఖ్యానించారు. కాగా, సూరికి విద్యార్థి వీసా ఉందని, అతని భార్య అమెరికా పౌరురాలని తెలిపాడు.

కాగా, హమాస్‌ను సమర్థించడం క్షంతవ్యం కాదని ప్రాసిక్యూషన్ తన చార్జిషీట్‌లో పేర్కొంది. ఇరు వర్గాల వాదనలు విన్న తర్వాత, సూరిని భారత్‌కు తిరిగి పంపే ప్రయత్నాలు చేయవద్దని అలెగ్జాండ్రియాలోని యుఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి పాట్రిసియా తొలివెర్ గిల్స్ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు వెలువరించే వరకూ సూరిని దేశం నుంచి పంపవద్దని ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు.

# ఖైబర్ ఫఖ్తూన్‌ఖ్వాలో ఎదురుకాల్పులు

పది మంది ఉగ్రవాదులు.. ఒక ఆర్మీ కెప్టెన్ మృతి

**పెషావర్ :** పాకిస్తాన్ సైన్యం, ఉగ్రవాదుల మధ్య ఖైబర్ ఫఖ్తూన్‌ఖ్వాలో జరిగిన ఎదురుకాల్పుల్లో 11 మంది మృతి చెందారు. వీరిలో పది మంది ఉగ్రవాదులుకాగా, ఒకరు ఆర్మీ కెప్టెన్. నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు ఉగ్రవాదుల ఏరివేత కార్యక్రమాన్ని ఆర్మీ చేపట్టింది. ఈ క్రమంలోనే ఎదురుకాల్పులు జరిగినట్టు తెలుస్తోంది. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో కెప్టెన్ హస్నైన్ అఖ్తర్ వీరమరణం పొందాడని ఖైబర్ ఫఖ్తూన్‌ఖ్వా ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) అధికారి డేరా ఇస్మాయిల్ ఖాన్ ప్రకటించారు. అఫ్ఘాన్‌లో తాలిబన్లు 2021లో తిరిగి అధికారంలోకి రావడంతో, సరిహద్దులోని పాకిస్తాన్‌లోనూ తాలిబన్ ప్రభావం కనిపిస్తోంది. బలోచిస్తాన్, ఖైబర్ ఫఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లపై పాకిస్తాన్ తాలిబన్లు పట్టు బిగిస్తున్నారు. తరచు ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే, ఉగ్రవాదుల ఏరివేతను పాక్ ప్రభుత్వం చేపట్టింది.

# చెన్నైలో జరిగే జెఎసి సమావేశానికి సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చెన్నైలో శనివారం తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జరగనున్న అఖిలపక్ష సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొననున్నారు. ఇందు కోసం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం చెన్నైకి వెళ్లారు. సిఎం వెంట డిసిసి అధ్యక్షులు డాక్టర్ రోహిన్‌రెడ్డి తదితరులు వెళ్లారు.

# ఏం సాధించారు?

(మొదటి పేజీ తరువాయి)

జిఎస్‌డిపి 8.3 శాతం ఉంటే, తమ ప్రభుత్వంలో జిఎస్‌డిపి 12.3 శాతం ఉన్నదని, గత సంవత్సరంతో పోలిస్తే 3.8 శాతం పెరిగిందని వివరించారు.

**అన్ని మాఫియాలను కట్టడి చేస్తాం ...**

ఇసుక సరఫరాను నియంత్రించినందుకు గత ప్రభుత్వ హయాంలో ప్రతి రోజూ రూ.30వేల టన్నుల ఇసుక సరఫరా అవుతే, ప్రస్తుతం 70వేల టన్నులకు పెరిగిందని, తద్వారా రోజుకూ కోటిన్నర ఆదాయం నుంచి ప్రస్తుతం రూ.మూడు కోట్లకు పెరిగిందని భట్టి విక్రమార్క తెలిపారు. పదేళ్ల కాలంలో ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఇసుక ఆదాయం, వేర్వేరు చేతుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. ఒక ఏడాదిలోనే గతంలో రూ.600కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని, పదేళ్లలో ప్రభుత్వానికి రావాల్సిన రూ.6వేల కోట్ల ఇసుక ఆదాయం, వేర్వేరు చేతుల్లోకి వెళ్లిందని తెలిపారు. తాము ఇసుక మాఫియాను పూర్తిగా కట్టడి చేశామని, అన్ని మాఫియాలను కూడా కట్టడి చేసి, రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతామని తెలిపారు. ఖనిజాలు ఇలా సహజ వనరుల నుంచి రావాల్సిన ఆదాయం మొత్తం ప్రభుత్వ ఖజానాకు రావాల్సిందేనని తెలిపారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని, యువతను గాలికి వదిలిపెట్టారని, తాము అలా గాలికి వదిలిపెట్టబోమని తెలిపారు. రాష్ట్ర యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని, రాష్ట్ర యువతను ఖాళీగా ఉండనివ్వమని, వారిని జిడిపిలో భాగస్వామిగా చేస్తామని వెల్లడించారు.

**పదేళ్లలో నిర్బంధాలు..నిరంకుశ పాలన చూశాం**

నిర్బంధాలు, నిరంకుశత్వం, స్వేచ్ఛ గురించి బిఆర్‌ఎస్ మాట్లాడితే ఎలా? అని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల కాలంలో తాను ఎల్‌ఓపిగా, సిఎల్‌పి నేతగా శాసన సభలో కూర్చున్నానని, తాము ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించామని, ఎన్ని అవమానాలు ఎదురైనా తాము భరించామని అన్నారు. అన్నింటినీ తలవంచుకుని, పరిస్థితులకు సహకరించామన్నారు. తాము శాసనసభలో ఎప్పుడు కూడా ప్రభుత్వాన్ని, స్పీకర్‌ను, సభాపతి పట్ల నోరు జారలేదని గుర్తుచేశారు. రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారని, తాము అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, ఈప్రాజెక్ట్‌ను సందర్శించేందుకు వెళ్తే, తమను అరెస్ట్ చేసి, రాయలసీమ ప్రాజెక్ట్ నిర్మాణం నిమిత్తం ఎపి ప్రభుత్వానికి సహకరించారని తెలిపారు. కృష్ణ, గోదావరి నీటి వాటాలను గాలికివదిలిపెట్టారని ఆరోపించారు.

**పదేళ్లలో సంక్షేమానికి :** పదేళ్ల కాలంలో సంక్షేమ రంగానికి రూ. 1,81,877 కోట్లను కేటాయిస్తే ఇందులో రూ.77,475 కోట్లను (38.07 శాతం) ఖర్చు చేయలేదని భట్టి విక్రమార్క వివరించారు. దళిత బంధు స్కీములో ఒక్క రూపాయి ఇచ్చారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితున్ని సిఎం చేస్తామని ప్రజలను ఆకర్శించి, ఆ తర్వాత చేయలేదని, ఆ మాట నుంచి తప్పుకునేందుకే దళితున్ని ఉపముఖ్యమంత్రిని చేశారని, ఆయనను కూడా రాత్రికి రాత్రి బర్తరఫ్ చేశారని, ఇందుకు ఇప్పటి వరకు కారణం చెప్పలేదని, దేశ చరిత్రలో ఎప్పుడూ ఒక ఉపముఖ్యమంత్రిని బర్తరఫ్ చేసిన చరిత్ర లేదని భట్టి మండిపడ్డారు.

# భవిష్యత్ తరాలకు అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

చేసిన నేపథ్యంలో బడ్జెట్‌యేతర అప్పులు కూడా చేయలేని పరిస్థితి నెలకొంది.

**కమ్యూనిస్టులు వచ్చినా అప్పు తీర్చలేని పరిస్థితి**

గత ప్రభుత్వం చేసిన అప్పుల నేపథ్యంలో ఇప్పుడు మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ వచ్చినా తీర్చలేరని, చివరికి కమ్యూనిస్టులు అధికారం చేపట్టినా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందని సాంబశివరావు అన్నారు. గతంలో చంద్రశేఖర్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఇలాంటి పరిస్థితి ఏర్పడితే బంగారం అమ్మి అప్పు తీర్చారని గుర్తుచేశారు. ఆ తర్వాత పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్ కమ్యూనిస్టులు వ్యతిరేకించినా పలు సంస్కరణలను చేపట్టి ఆర్థిక పరిస్థితిని గాడిలో పడినట్లు చేశారన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో గత ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో అప్పు చేసినా ఒక్క పేదవాడు కూడా బాగుపడిందిలేదన్నారు. ప్రభుత్వం రూ.3లక్షల కోట్ల బడ్జెట్ పెట్టినా మూలధన వ్యయం రూ.36,504 కోట్లు మాత్రమేనని, ఇందులో కూడా ఎంతఖర్చు అవుతుందో తెలియదన్నారు.

**ఇతర ఆదాయాల అన్వేషణపై దృష్టి సారించాలి**

భూములు అమ్మకం ఇతర వనరుల ద్వారా డబ్బులను సమకూర్చుకోనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, అయితే హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయానికి చెందిన భూములను అమ్మడం సరికాదని, ఇతర భూములపై దృష్టి సారించాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాల ప్రభుత్వం భూముల్లో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, అర్హులైనవారికి 58 జిఓ కింద ఉచితంగా మిగిలిన వారికి 59 జిఓ ద్వారా ఆ భూములను క్రబద్దీకరించడం ద్వారా ఆదాయం సమాకూరుతుందని చెప్పారు. ప్రభుత్వం ఏలాగు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని చెబుతున్న నేపథ్యంలో 58 జిఓ కింద క్రమబద్దీకరించిన గుడిసేవాసులకు అదే స్థలాల్లో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించిస్తే అటు పేదలకు న్యాయం జరగడంతో పాటు ఇటు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని కూనంనేని సాంబశివరావు సూచించారు. భూమాఫియా అక్రమించుకున్న భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం ద్వారా వాటిని విక్రయించినా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని ఆయన సూచించారు.

**కేంద్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు డిమాండ్ చేయాలి :** కేంద్ర ప్రభుత్వం ఆదాయ, ఇతర పన్నుల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి సమకూరే నిధుల్లో సెంట్రల్ పూల్ ద్వారా అన్ని రాష్ట్రాలకు 41 శాతం కేటాయిస్తున్న నిధులను 50 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పొందపర్చడం హర్షనీయమన్నారు. దీనిని సాధించుకునేందుకు అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ప్రభుత్వానికి మద్దతు తెలుపాల్సిన అవసరముందని, తద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి నిధులను సాధించుకోవాల్సి ఉందన్నారు. దక్షిణాది రాష్ట్రాల నుంచే కేంద్రానికి అధిక నిధులు సమకూరుతున్న ఈ రాష్ట్రాలకు మాత్రం కేంద్రం నిధుల పంపిణీలో పూర్తిగా అసమానతలను పాటిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో మన వాటా నిధులను మనం రాబట్టుకునేందుకు అన్ని పార్టీలు సహకరించాలన్నారు.

**6 గ్యారంటీలలో అమలు చేయనివి ప్రజలకు వివరించాలి :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలలో కొన్ని అమలు చేయడం అభినందనీయమని, అయితే భారీ అప్పుల దృష్ట్యా ఇప్పటికిప్పుడు అమలు చేయలేని పథకాలను ప్రజలకు వివరించాలని, తద్వారా ప్రజలు వాటిని అర్థం చేసుకుంటారని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు.

**వ్యవసాయ రంగానికి మరిన్ని నిధులు ఇవ్వాలి**

రైతు భరోసా కింద రైతుకు ప్రతి ఏటా ఎకరానికి పంట సహాయం గా రూ. 15 వేలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం రూ.12 వేలకు తగ్గించిందని, దీనినైనా చిత్తశుద్ధితో అమలు చేయాలని కూనంనేని సాంబశివరావు సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కార్మికులకు ఇస్తామన్న రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని 40 లక్షల మంది వ్యవసాయ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వం యువత కోసం ఇటివల తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాసం మంచి పథకమని, దీనిని చిత్తశుద్ధితో అమలు చేయాలని సూచించారు. పంటల అమ్మకాలకు సంబంధించి పంటల మద్దతు ధర నిర్ణయక కమిటి ఏర్పాటు చేయాలని, పంటబీమాకు సంబంధించి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. మార్కెట్‌లో పంటలకు మద్దతు ధర లభించనప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతులను అదుకునేవిధంగా రూ.500 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. నీటిపారుదల రంగానికి సంబంధించి మేజర్ ప్రాజెక్టులపై ప్రభుత్వ దృష్టి సారించాని, అదే సమయంలో కొద్ది పాటి నిధులు అవసరమైన మైనర్ ప్రాజెక్టులను గుర్తించి వాటిని త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చని తెలిపారు.

**ఉచిత విద్య, వైద్యం అందిస్తే చాలు :** ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన విద్యతో పాటు వైద్యం ఉచితంగా అందించగలిగితే ఇంతకన్న మించిందిలేదని కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్య కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నా విద్యారంగంలో మనం చాలా వెనకబడి ఉన్నామన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రతి జిల్లాకు ఓ ఐఎఎస్ అధికారిని ప్రత్యేకంగా నియమించి విద్యారంగాన్ని పూర్తిగా పర్యవేక్షించాల్సిన అవసరముందన్నారు. వైద్యానికి సంబంధించి రూ.5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచినా పేదలకు నాణ్యమైన వైద్యం అందడం లేదన్నారు.

**బడ్జెట్‌లో అందరినీ భాగస్వామ్యం చేయాలి**

రాష్ట్రంలో సుమారుగా 4 కోట్లమంది ఉంటే అందులో 2 కోట్ల మందికి రాష్ట్ర బడ్జెట్‌లో భాగస్వామ్యమే లేదని, వారే అసంఘటిత కార్మికులన్ని వీరందరికి బడ్జెట్‌లో భాగస్వామ్యం లభించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇందులో భాగంగా భవన నిర్మాణ కార్మికులు, ఆటో రిక్షా కార్మికులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు, కూలీలు, కుల వృత్తుల దార్లు వారందరికి సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు వారిని అన్ని విధాలు అందుకునేందుకు ప్రభుత్వ చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా చాలీచాలని వేతానాలు పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని తెలిపారు.

**ఆర్‌టిసి, సింగరేణి, జెన్‌కోను కాపాడుకోవాలి**

ఆర్‌టిసికి సంబంధించి దొడ్డిదారిన ప్రైవేటికరించేందుకు కుట్రలు జరుగుతున్నాయని, ప్రభుత్వం ఆర్‌టిసి, సింగరేణి, జెన్‌కోను కాపాడుకోవాల్సిన అవసరముందని కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. ఇందులో భాగంగానే ఆర్‌టిసికి ఎలక్ట్రికల్ బస్సులను కేటాయించడం లేదని, అదేవిధంగా రైల్వేకు 4 శాతం డీజిల్ పన్ను వసూళ్లు చేస్తుండగా ఆర్‌టిసికి మాత్రం 18 శాతం పన్ను వసూలు చేయడం అన్యాయమన్నారు. ఆర్‌టిసికి టోల్ టాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వడంతో పాటు 5 ఏళ్ల పాటు టాక్స్ హాలిడే ప్రకటించాలన్నారు. జెన్‌కోకు సంబంధించి అందులో పని చేస్తున్న 20 వేలమంది ఆర్టిజెన్ల ఉద్యోగాలను క్రమబద్దీకరించాలన్నారు.

# లెక్కలెక్కువ చూపొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సెక్షన్‌లను బిఆర్‌ఎస్ ప్రభుత్వం సాధించింది. ట్రిబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించాలి. తెలంగాణకు న్యాయబద్ధమైన 575 టిఎంసిలను రాబట్టాలి' అని హరీశ్ రావు అన్నారు. శాసనసభలో శుక్రవారం 2025–26 వార్షిక బడ్జెట్‌పై సాధారణ చర్చను హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉచితంగా ఎల్ఆర్‌ఎస్ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పుడు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని అన్నారు. రూ.30వేల కోట్ల విలువైన భూములు అమ్మకానికి పెట్టారన్నారు. రుణమాఫీకి రూ.31 వేల కోట్లు సమీకరించుకున్నట్లు గత బడ్జెట్‌లో చెప్పారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను ఎన్నికల తర్వాత ఏమార్చారని విమర్శించారు. గతంలో ఫార్మా సిటీకి భూములు సేకరిస్తే కాంగ్రెస్ నిరసనలు చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫార్మా సిటీ భూములు వెనక్కి ఇస్తామన్నారని, ప్రస్తుతం వెనక్కి ఇవ్వకుండా ఫార్మా సిటీ పేరును ఫ్యూచర్ సిటీగా మార్చి తిరిగి భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు. గతంలో నిర్ధరక ఆస్తులను బిఆర్‌ఎస్ ప్రభుత్వం అమ్మితే ఎలా విక్రయిస్తారని ప్రశ్నించారన్నారు. రుణమాఫీలో విఫలమైనవారు తమ చిత్తశుద్ధిని శంకిస్తున్నారని గతంలో భట్టి చెప్పారన్నారు. అయితే ఇవాళ చేతగానివారెవరు, మాట తప్పిందెవరు, చిత్తశుద్ధిలేని వారెవరో తేలిపోయిందని హరీశ్‌రావు విమర్శించారు. రైతు బంధు కింద ఎకరానికి రూ.15 వేలు చెల్లిస్తామన్న సంకల్పం ఏమైందని ప్రశ్నించారు. గత బడ్జెట్‌లో పథకం కింద రైతుబంధు నిధులు ఇస్తామని చెప్పారని, రైతులు, కౌలు రైతులకు రైతుభరోసా, రైతుబీమా ఇస్తామని చెప్పారని, కౌలు రైతులను రైతులే చూసుకోవాలని చెబుతున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు చెప్పారన్నారు. కాంగ్రెస్ పాలనలో 4.5 లక్షల ఇళ్లు కాదు కదా 4 ఇళ్లు కూడా కట్టలేదని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టిలు ఇళ్లు కట్టుకుంటే రూ.6 లక్షలు ఇస్తామని గొప్పగా చెప్పారని, ఈసారి ప్రసంగంలో రూ.లక్ష మాయమైందన్నారు. దళిత, గిరిజనులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బిఆర్‌ఎస్ పాలనలో వాహనాల అమ్మకాలు జోరుగా జరిగాయని ప్రస్తుతం వాహనాల విక్రయాలు పడిపోయాయని తెలిపారు. దివ్యంగా ఉన్న రాష్ట్రాన్ని దివాళా అని ప్రచారం చేశారన్నారు. తెలంగాణ రైజింగ్ అని సిఎం రేవంత్ గొప్పలు చెప్పారని, సిఎం ప్రచారంతో తెలంగాణకు పెట్టుబడులు ఆగిపోయాయని హరీశ్ రావు అన్నారు.

**పరిపాలనలో దివాళాతనం :** కాంగ్రెస్ విధానాలు, పరిపాలనలో దివాళాతనం కనిపిస్తోందని, కాంగ్రెస్ 6 గ్యారెంటీలు ఆవిరయ్యాయన్నారు. చేతి గుర్తు చేతకాని పాలనలో రైతు మళ్లీ అప్పు కోసం చేయి చాచాల్సి వస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొందన్నారు. అంతా నాకే తెలుసు అనుకునే సిఎం అజ్ఞానం, అహంకారం, అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్ర ఆదాయం కుంటుపడిందని విమర్శించారు. సంపూర్ణ రుణమాఫీ కోసం రూ.49,500 కోట్లు అవసరమన్నారు. తెలంగాణకు అన్యాయం చేసిన ఆంధ్రాకు చెందిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆదిత్యనాథ్ దాస్‌ను తెలంగాణ అడ్వైజర్‌గా పెట్టుకోవడం దారుణమన్నారు.

# టోల్ విధించం

(మొదటి పేజీ తరువాయి)

జోక్యం చేసుకుని 'మా వికారాబాద్ జిల్లాలో రోడ్లు సక్కగ లేక పిల్లనిచ్చేటట్టు లేరు' అని అన్నారు. హరీశ్‌రావు కృష్ణ జలాల అంశాన్ని ప్రస్తావించడంతో మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని నీళ్లకు నీళ్లు, పాలకు పాలు తర్వాత చర్చిద్దామన్నారు. 'హరీశ్ రావుకు మొత్తం తెలువదు.. వెనుక నడిపిచ్చే వారు ఇంకా ఇద్దరు ముగ్గురు ఉన్నారు. వాళ్లే నడిపిస్తరు' అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును రూ.7,300 కోట్లకు అమ్ముకున్న ఘన చరిత్ర బిఆర్‌ఎస్‌దని విమర్శించారు. వైన్‌షాప్‌ల గడువు మూడు నెలలు ఉండగానే ముందస్తుగా టెండర్లను పిలిచిన విషయాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావుకు మంత్రి గుర్తుచేశారు. భూముల అమ్మకాలు, కోకాపేట వేలం పాటలు ఇంకా ఎన్నో ఉన్నాయని, ఈ విషయాలు రాష్ట్రమంతా తెలుసునని కోమటిరెడ్డి అన్నారు.

పరిధి దాటి మాట్లాడొద్దు : ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుద్ధి మాంద్యం, అజ్ఞానం అంటూ బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో దుమారం రేపాయి. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలతో ఆర్థిక వృద్ధి రేటు తగ్గిపోతోందన్నారు. దేశమంతా ఆర్థిక మాంద్యం ఉందని అబద్ధాలు చెబుతున్నారన్నా రు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని ఆర్థిక మాంద్యం తెలంగాణలో ఉందంటున్నా రని చెప్పారు. ఆర్థిక మాంద్యం ప్రపంచంలో కాదు, ప్రభుత్వ పెద్దల బుద్ధిలో మాంద్యం ఉందని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో ఆర్థిక వృద్ధి రేటు తగ్గు తోందన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకొని బుద్ధి మాంధ్యం అనే పదాన్ని వాడటం కరెక్టు కాదని, దానిని ఉపసంహరిం చుకోవాలని, అలా మాట్లాడటం సభహూందాతనాన్నితగ్గిస్తుందన్నారు. దీనికి హరీశ్ రావు స్పందిస్తూ.. 'ముఖ్యమంత్రి బట్టలూడదీసి కొడ్తాం అని ఇదే సభలో అంటే వారికి మీరెందుకు చెప్పలేదు' అని ప్రశ్నించా రు. 'నేను బుద్ధి మాంద్యం అంటే మీ ఆలోచన విధానంలో తప్పుందీ' అన్నానని తెలిపారు. అది తప్పయితదా? వారి విజ్ఞతకే వదిలేస్తున్నా అన్నారు. హరీశ్ రావు సభలో రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 'మీ స్పీచ్ హుందాగా ఉండాలి' అని సభాపతి సూచిస్తున్నా? మీ తోనే వాదనకు దిగడం ఏమిటి?, సిఎం ఈ భాష మాట్లాడగినప్పుడు చెప్పలేదనే ఎదురు ప్రశ్న ఎందుకు? సభ్యుడు చెప్పిన విషయాలన్ని నోట్ చేసుకుంటున్న అని తెలిపారు. బుద్ధిమాంద్యం అన్నారని, అలా మాట్లాడటం సరి కాదని, పరిధి దాటి మాట్లాడొద్దు అని భట్టి విక్రమార్క హితవు పలికారు.

# అవినీతికి కేరాఫ్ బిఆర్‌ఎస్



మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'అవినీతికి కేరాఫ్ బిఆర్‌ఎస్ పార్టీ.. తెలంగాణ పరువు తీసింది.. తీస్తున్నది కెసిఆర్ కుటుంబమే.. మాకు ఢిల్లీ వ్యాపారాలు తెలియవు.. ఢిల్లీ వ్యాపారాలతో రాష్ట్రం పరువు తీసింది బిఆర్‌ఎస్ పార్టీ, కెసిఆర్ కుటుంబం కాదా'' అని రాష్ట్ర మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనమండలిలో శుక్రవారం 2025– 26 వార్షిక బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చల్లో బిఆర్‌ఎస్ సభ్యులు కె.కవిత పాల్గొంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ పరువు తీస్తున్నారని చేసిన వ్యాఖ్యలపై మంత్రి ధనసరి అనసూయ సీతక్క తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతు 'మొదటి ఐదు సంవత్సరాల్లో మంత్రి పదవిలో మహిళలు లేరు, మహిళా కమిషన్‌కు సభ్యులు లేరు. మహిళలు పొదుపు చేసుకున్న రూ.1800 కోట్ల అభయ హస్తం నిధులు ఇవ్వలేదు. పావలా వడ్డీ ఇవ్వలేదు. మహిళా సంఘాలకు ఇవ్వాల్సిన రూ.3700 కోట్ల వడ్డీ లు చెల్లించలేదు' ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయని స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బిఆర్‌ఎస్ ప్రభు త్వం అన్ని బాగుచేస్తే.. ప్రజలు ఎందుకు ఓడిస్తారని అన్నారు. బిఆర్‌ఎస్ నేతలు ఇకనైనా బుద్ధి మార్చుకోవాలని హితవు పలికారు.

**ఆర్థిక ఇబ్బందులను అధిగమించి పెట్టిన బడ్జెట్ : ఎంఎల్‌సి జీవన్ రెడ్డి**

శాసనమండలిలో శుక్రవారం 2025–26 వార్షిక బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చల్లో కాంగ్రెస్ సభ్యులు జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి బడ్జెట్‌ను రూపొందించామని, ఈ బడ్జెట్ దేశానికే ఆదర్శమని జీవన్ రెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తయారు చేసిన బడ్జెట్ ఇది అని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఏ సంక్షేమ పథకాన్ని కూడా నిలిపివేయకుండా కొనసాగిస్తున్న ప్రభుత్వం తమదని అన్నారు. తమ ప్రభుత్వం రైతులను అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, పదేండ్లుగా కేటీఆర్, హరీశ్‌రావు రాజుల్లాగా వ్యవహరించారని ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబానికి తప్ప మంత్రులకు ఏమైనా పవర్ ఉండేదా అని ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం తమ ప్రభుత్వం కుల గణన, వర్గీకరణ చేసిందని చెప్పారు

**మా ప్రభుత్వం రైతు పక్షపాతి: మహేష్‌కుమార్‌గౌడ్**

తమ ప్రభుత్వం రైతు పక్షపాతి అని బడ్జెట్‌లో కూడా వారికి ప్రాధాన్యత ఇచ్చామని ఎంఎల్‌సి మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. శాసనమండలిలో శుక్రవారం 2025–26 వార్షిక బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చల్లో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం కట్టి కమిషన్లు దండుకున్నారని, రైతులకు మాత్రం ఏమాత్రం న్యాయం జరగలేదన్నారు. రూ.1.4 లక్షల కోట్లు బూడిదలో పోసిన పన్నీరుగా మారిందన్నారు. కాళేశ్వరం సక్సెస్ ఫుల్ ప్రాజెక్ట్ కాదని దాని బదులుగా తమ్మిడిహట్టి ప్రాజెక్ట్ కట్టి ఉంటే బాగుండేదన్నారు. రానున్న కాలంలో కాళేశ్వరంపై పెట్టుబడి పెట్టాలంటే నిపుణుల పూర్తి నివేదిక పరిశీలించాల్సిదేనన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఐదేళ్లు మంత్రి వర్గంలో ఒక్కమహిళ కూడా లేని నేతలు మహిళల అభివృద్ధి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. బిఆర్‌ఎస్ చేసిన అప్పులను సరిదిద్దుకుని ముందుకు వెళ్లాల్సి వస్తుందన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో 55 వేలు దాటలేదు తాము ఏడాది కాలంలోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. శాసన మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టిన 2025–26కు బడ్జెట్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు.

**విద్యపై మరింత దృష్టి సారించాలి: ఎంఎల్‌సి నర్సిరెడ్డి**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ఎంఎల్‌సి నర్సిరెడ్డి తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. శాసనమండలిలో శుక్రవారం 2025–26 వార్షిక బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1991లో వచ్చిన నూతన ఆర్థిక విధానం ద్వారా ప్రభుత్వాలు విద్యపై చిన్నచూపు చూపాయన్నారు. రాష్ట్రంలో ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలన్నారు.

**కాళేశ్వరంపై ఖర్చుపెట్టాలన్నా.. : కోదండరాం**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఇప్పుడు ఒక్కపైసా ఖర్చు పెట్టాలన్నా నిపుణుల తుది నివేదికను పూర్తిస్థాయిలో రిశీలించిన తరువాతనే నిర్ణయం తీసుకోవాలని, తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరాం ప్రభుత్వానికి సూచించారు. శాసనమండలిలో శుక్రవారం 2025–26 వార్షిక బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో రాష్ట్రంలో 33 ప్రాజెక్ట్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, కాళేశ్వరంకు పెట్టిన డబ్బులు వీటికి పెట్టి ఉంటే ఇవన్ని పూర్తి అయ్యేయన్నారు. విద్య, వైద్యంపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలన్నారు. బడ్జెట్‌కు తన సంపూర్ణ మద్దతు తెలిపారు.

**రాష్ట్ర పరువు తీశారు: ఎంఎల్‌సి కవిత**

రాష్ట్రం అప్పుల ఊబిలో ఉందని, వడ్డీలు కూడా కట్టలేక పోతున్నామని తరచుగా సిఎం రేవంత్‌రెడ్డి చెప్పడం పట్ల రాష్ట్ర పరువు తీసినట్లుయ్యిందని ఎంఎల్‌సి కవిత పేర్కొన్నారు. శాసనమండలిలో శుక్రవారం 2025–26 వార్షిక బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చల్లో కవిత మాట్లాడుతూ.. బిఆర్‌ఎస్ చేసిన అప్పులు అన్ని కలిపి రూ.4.22 లక్షల కోట్లేనని తెలిపారు. తాము చేసిన అప్పులను కావాలని అధికంగా చూపించి బిఆర్‌ఎస్‌ను బదలాం చేస్తున్నారన్నారు.

**పెండింగ్ డిఎలు ఎప్పుడు ఇస్తారు: ఎవిఎన్ రెడ్డి**

ఉద్యోగులకు పేరుకుపోయిన పెండింగ్ డిఎలు ఎప్పుడు ఇస్తారని ఎంఎల్‌సి ఎవిఎన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శాసనమండలిలో శుక్రవారం 2025–26 వార్షిక బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చల్లో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో విద్యకు తక్కువ నిధులు కేటాయించారని విమర్శించారు. ప్రభుత్వం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు.

**బిఆర్‌ఎస్ సభ్యుల నిరసన..**



తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు వినూత్న నిరసనను కొనసాగించారు. రోజుకో అంశంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న బిఆర్‌ఎస్ పార్టీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శుక్రవారం నిరసన తెలియజేశారు. 'అప్పులు ఘనం.. అభివృద్ధి శూన్యం' అంటూ ప్లకార్డులు పట్టుకుని అప్పులు ఆకాశంలో.. అభివృద్ధి పాతాళంలో అని నినాదాలు

## మత విద్వేషాలను రెచ్చగొట్టొద్దు

ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మత విద్వేషాలను రెచ్చగొట్టడం కాదని, కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన నిధులను రాబట్టేందుకు ప్రయత్నించాలని బిజెపి ఎంఎల్‌ఎలకు ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసి సూచించారు. శాసనసభలో శుక్రవారం సాధారణ బడ్జెట్‌పైన జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని, నిధులను ఇవ్వడం లేదని, ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వడం లేదని విమర్శించారు. రాష్ట్రానికి సంబంధించి 24 కేంద్ర మంత్రిత్వ శాఖల వద్ద 150 అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి కోసం సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి ప్రధాని, కేంద్రమంత్రులను కలుస్తున్నారని, సిఎం బాగా ప్రయత్నిస్తున్నారని అక్బరుద్దీన్ వివరించారు. రాష్ట్ర పరిధిలోని అంశాలపై అనేక ప్రశ్నలు, పలు అంశాలపై చర్చిస్తున్న బిజెపి ఎంఎల్‌ఎలు కేంద్ర పరిధిలోని 150 అంశాలను కూడా పరిష్కరించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రూ.3 లక్షల కోట్లకు చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇందులో గత ఉమ్మడి రాష్ట్రంలోని చంద్రబాబు, వైఎస్‌ఆర్, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి, కెసిఆర్, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ,అప్పటి, ప్రస్తుత రాష్ట్ర మంత్రులు, శాసనసభలోని ప్రతిపక్ష నాయకులు, రాజకీయ పార్టీలకు చెందిన సభ్యుల సేవలు కూడా ఉన్నాయని, అందరూ తమ తమ స్థాయిలో ఎంతో కొంత సేవలను అందించారని కొనియాడారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులను ఇవ్వలేదని, ఉన్న కార్డులను తొలగించారని ఆరోపించారు. స్వయం ఉపాధి పథకంలో భాగంగా గత ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులను గుర్తించి, కొందరికి చెక్కులను ఇచ్చినప్పటికీ డబ్బులను మాత్రం ఇవ్వలేదని, మరి కొందరిని లబ్ధిదారులుగా గుర్తించినప్పటికీ వారికి రుణాలను సంబంధించి నిధులను మంజూరు చేయలేదని తెలిపారు. వీరంతా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ వికాస్ పథకంలో అనర్హులుగా మారారని, వీరి దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకోవాలని అక్బరుద్దీన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## బిసి జనాభా తగ్గించడం వెనుక అనుమానాలు : ఎంఎల్‌ఎ శంకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం కులగణనలో బిసి జనాభాను తగ్గించి చూపిందని, దీనిపై తమకు అనుమానాలు ఉన్నాయని బిజెపి ఎంఎల్‌ఎ పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 56 శాతం ఉన్న బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడాన్ని ఆహ్వానిస్తున్నామని, కానీ, ఇందులో ముస్లిం మైనార్టీలకు 10శాతం మతపరమైన రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. దీన్ని బట్టి బిసిలను మోసం చేసినట్టేనన్నారు. ఈ విషయమై బిసిలు ప్రభుత్వాన్ని నిక్కచ్చిగా అడగాలని కోరారు. తాము అడిగినా దీనిపై సమాధానం రాలేదని చెప్పారు. ప్రభుత్వానికి సమయం ఇస్తున్నామని ఈలోపు నిర్ణయం తీసుకోకపోతే సోమవారం అసెంబ్లీ చర్చలో లేవనెత్తుతామని చెప్పారు. ఇంకా డీలిమిటేషన్ అంశం ఇంకా కొలిక్కి రాలేదని, అప్పుడే కాంగ్రెస్, బిఆర్‌ఎస్ చెన్నైలో జరిగే సభకు పోతున్నాయని విమర్శించారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటేనని పేర్కొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సచివాలయంలో తాగు నీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మిషన్ భగీరథ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రిజర్వాయర్లలో తాగు నీటికి తగినంత నీటి నిలువలు ఉన్నాయని, గతంలో తాగునీరు అందని గ్రామాలకు కూడా ఈసారి తాగునీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఏదైనా సాంకేతిక కారణాలతో సమస్యలు తలెత్తిన ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాగు నీటి అవసరాలకు ఇచ్చేందుకు ప్రతి కలెక్టర్ వద్ద రెండు కోట్ల రూపాయల నిధులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. జాగ్రత్తగా తాగు నీటిని వినియోగించాలని, తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య ఉత్పన్నమైన వెంటనే పరిష్కారం చూపాలన్నారు. తాగు నీటి సమస్యలు లేకున్నా కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. తప్పుడు ప్రచారాన్ని స్థానిక అధికారులు తిప్పి కొట్టాలని సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.

## అక్రమ రవాణాతో ఆర్‌టిసికి రూ.1000 కోట్ల నష్టం

అర్‌టిఎ అధికారులు అక్రమ రవాణాను అడ్డుకోవాలి : విఎస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిఎ అధికారుల అవినీతి, అలసత్వం కారణంగా రాష్ట్రంలో విచ్చలవీడిగా కొనసాగుతున్న ప్రజా అక్రమ రవాణకు ప్రభుత్వం తక్షణమే అడ్డుకట్ట వేసి ఆర్‌టిసినీ ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్.బోస్ డిమాండ్ చేశారు. అక్రమ రవాణా కారణంగా ఆర్‌టిసికి దాదాపు రూ.1000 కోట్ల నష్టం వాటిల్లడమే కాకుం డా రాష్ట్ర ప్రభుత్వం ట్యాక్స్ ఆదాయానికి గండిపడుతున్నప్పటికీ అటు ఆర్‌టిఎ అధికారులు గానీ ఇటు ఆర్‌టిసి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఆర్‌టిఎలో తగిన సిబ్బంది లేదనే సాకుతో కాలయాపన చేస్తూ వచ్చారు. కానీ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిఎకు కావాల్సిన సిబ్బందిని అందజేసినప్పటికీ అక్రమ రవాణాలో అడ్డుకట్ట పడినట్లు కనిపించటంలేదన్నారు. దీనికి ప్రధాన కారణం అక్రమ రవాణా వెనుక ఉన్న రాజకీయ వ్యవస్థకు ఆర్‌టిఎ అధికారులు లొంగిపోవటంతో పాటు ఆర్‌టిఎలో పేరుకుపోయిన అవినీతి కారణమని ఆరోపించారు. మరోవైపు అక్రమ రవాణా అరికట్టటంలో ఆర్‌టిఎ అధికారులపై ఒత్తిడి తీసుకురావటంలో ఆర్‌టిసి యాజమాన్యంసైతం పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. ఆర్‌టిసి ఎండి, సజ్జనార్ తనకున్న గత ప్రాబల్యాన్ని ఉపయోగించి ఆర్‌టిఎ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసి ఆర్‌టిసి నష్టపోతున్న రూ.1000 కోట్లు లాభాలు పెరిగేటట్లుగా చూడాలని కోరారు. దానితో పాటు ఆర్‌టిసికి కేంద్రం నేరుగా ఎలక్ట్రికల్ బస్సులు కేటాయించే విధంగా ప్రతిపాదనలు పంపి, రాష్ట్ర ప్రభుత్వం సహాయంతో కేంద్రంతో సంప్రదింపులు జరపాలన్నారు. దీనితో పాటు రైల్వేలకు ఇచ్చినట్లుగా డిజిల్‌కు ఆర్టీసీకి కూడా 4 శాతం మాత్రమే ట్యాక్స్ విధించేటట్లు చూడాలని, ఆర్‌టిసిలో ఉన్న బస్‌బాడీ వర్క్‌షాప్‌ను ఉపయోగించి ''డీజిల్ బస్సులను రెట్రోఫిట్మెంట్ పాలసీ''పై ఎలక్ట్రికల్ వాహనాలుగా తయారు చేయటానికి అనుమతి పొందాలన్నారు. ఆర్‌టిసి వాహనాలపై టోల్ టాక్స్‌రద్దు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలను పంపడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి ట్యాక్స్ హాలీడే ప్రకటించే విధంగా ఆర్‌టిసి ఎండి చర్యలు తీసుకోవాలని కోరారు.

## తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం సవతితల్లి ప్రేమ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆరోపించారు. బిఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలపైన రాష్ట్ర ప్రభుత్వం జ్యూడీషియల్ కమిటీ ద్వారా విచారణ చేపట్టామని, ఈ కమిటీ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాసనసభలో సాధారణ బడ్జెట్‌పై శుక్రవారం జరిగిన చర్చలో బిజెఎల్‌పి నేత మహేశ్వర్ రెడ్డి ప్రస్తావించిన అంశాలపైన మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తామని, జన్‌ధన్ ఖాతా ద్వారా రూ.15 లక్షల ఇస్తామని 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో నరేంద్రమోదీ ప్రస్తావించారని, ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని బిజెపి సభ్యులను నిలదీశారు. మహేశ్వర్ రెడ్డికి బిజెపి పట్ల ఎంత అభిమానం ఉన్నదో, అదే తరహా తెలంగాణ ప్రజలపై అభిమానం ఉంటే బాగుండేదన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్తున్న పన్నులలో సింహభాగం తిరిగి రాష్ట్రానికి చెల్లించాలన్నారు. రైల్వే లైన్లు, రహదారుల నిర్మాణాలు కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని, అన్ని రాష్ట్రాల తరహాలోనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి నిధులను పంపిణీ చేస్తుందని, అదనంగా ఏమీ ఇవ్వడం లేదని మండిపడ్డారు. అంతకుముందు మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ అవినీతిపైన విచారణ చేపడుతామని, ఇప్పటి వరకు ఏమీ చేయలేదని ఆరోపించారు.

కాంగ్రెస్ ఎంఎల్‌ఎ విజయరమణారావు మాట్లాడుతూ ఎన్నికలు వచ్చినప్పుడల్లా బిజెపికి పాకిస్తాన్‌పై యుద్ధం, సర్జికల్ స్ట్రైక్‌ను తెర పైకి తీసుకొస్తుందని, సెంటిమెంట్ ఎక్కువ కాలం పనిచేయదని, వాస్తవాలు ప్రజలు గమనిస్తారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకంగా నిధులు, ప్రాజెక్టులను తీసుకొస్తే, బిజెపి ఎంఎల్‌ఎలను గౌరవిస్తామని, వారికి ఆవుపాలతో పాలాభిషేకం చేస్తామని చెప్పారు.

**'కాళేశ్వరం' పిల్లర్ కూలిందని ఇప్పటికైనా అంగీకరించారు.. మంత్రి పొన్నం**

**ఒక పిల్లరే కూలింది.. : హరీశ్‌రావు**

ఒక భవనంలో ఒక పిల్లర్ కూలిపోతేనే ఆ భవనం ఉంటుందా? అని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఒక పిల్లర్ కూలిపోయిందని ఇప్పటికైనా హరీశ్‌రావు అంగీకరించారని, కానీ పిల్లర్ కూలిపోయిన తర్వాత అందులో నీటిని ఎలా నిల్వ చేస్తారని ప్రశ్నించారు. నిపుణుల సలహా మేరకే ప్రభుత్వం ముందుకెళ్తుందని వివరించారు. అంతకుముందు బిఆర్‌ఎస్ సభ్యులు తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఒక బ్లాక్‌లో ఒక పిల్లర్ మాత్రమే కూలిందని, దీనికి మరమ్మతులు చేపడితే సరిపోతుందని సూచించారు.

## డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలి

శాసనసభలో సిపిఐ వాయిదా తీర్మానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు శుక్రవారం శాసనసభలో వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రభుత్వం మెమో నెంబర్ 57/04/2019అండ్ 57/05/2021 ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో సిపిఎస్ అమలు తేది 1–9–2004 ముందు నియామక నోటిఫికేషన్ విడుదలై 1–9–2004 తర్వాత నియామక ఉత్తర్వులు అందుకున్న డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు కాంట్రిబ్యుషన్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తున్నారని, ఈ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఇందుకు సంబంధించి సభలో చర్చించాలని కోరుతూ కూనంనేని సాంబశివరావు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు.

## తెలంగాణలో ప్రతిరోజూ సుమారు రూ.1,700 కోట్లకుపైగా అప్పు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిరోజు సుమారు రూ.1,700 కోట్లకుపైగా అప్పు చేస్తోందని బిజెపి శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం అప్పు రూ. 8.6 లక్షల కోట్లకు చేరిందన్నారు. శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమిషానికి రూ. 1 కోటికి పైగా అప్పు చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తిపై రుణభారం రూ. 2.27 లక్షలుగా ఉందన్నారు. ఇంత భారీ స్థాయిలో రుణాలు ఉంటే తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి చెందుతుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. యుపిఎ హయాం కంటే ఎన్‌డిఏ హయాంలో ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రాలకు పెరిగాయన్నారు. యుపిఏ హయాంలో రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో వాటా 32 శాతం మాత్రమే ఉండగా, నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వాటాను 10 శాతం పెంచి 42 శాతానికి చేర్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పన్నుల్లో వాటాను పెంచినప్పటికీ విమర్శలు చేయడం సముచితం కాదన్నారు.

**తెలంగాణ నమూనా ఏంటో అర్థం కావడంలేదు**

తెలంగాణ నమూనా అంటే కూల్చివేతలు, కమీషన్లేనా అని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. 'బడ్జెట్‌లో మూల ధన వ్యయం తగ్గిస్తున్నారన్నారు. బడ్జెట్‌లో సూక్తి ముక్తావళి చాలా ఉందని, కానీ, వాస్తవం చూస్తుంటే కమీషన్ల ప్రభుత్వంలా కనిపిస్తుందని విమర్శించారు. నిధులు లేక వ్యవస్థలు కూనరిల్లుతున్నాయన్నారు. సచివాలయంలో ధర్నాలు ఎన్నడూ చూడలేదన్నారు. భూసేకరణ పేరుతో పేద, గిరిజన రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. 15 నెలల్లోనే లక్షా 63వేల కోట్లు అప్పులు చేశారన్నారు. కేంద్రం నుంచి పొందిన సాయాన్ని గుర్తుచేస్తే బాగుండేదన్నారు. 6 గ్యారెంటీలకు నిధులు కేటాయించక పోవడం బాధాకరమన్నారు.

# నీతులు మీవోళ్లకు చెప్పుకో...

తలసానికి మంత్రి శ్రీధర్‌బాబు హితవు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అధికారంలో ఉన్నవాళ్లకు ఓపిక ఉండాలని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రభుత్వం ఏదైనా చెప్పాలి అనుకుంటే మంత్రి ఉన్నారని, హరీశ్ రావు మాట్లాడేటప్పుడు ప్రతిసారి అడ్డుకోవద్దు అని అన్నారు. శ్రీనివాస్ యాదవ్ నీతులు మాకు కాదు వాళ్ల పార్టీ వాళ్లకు చెప్పుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రతిపక్షాలు అబద్ధాలు చెబితే వినేవాళ్లు ఎవరూ లేరన్నారు. సభలో నినాదాలు ఇవ్వడం సంప్రదాయం కాదన్నారు. అడ్డగోలుగా మాట్లాడతాం అంటే మౌనంగా ఉండలేమన్నారు.

**హరీశ్‌రావు అబద్ధాలు చెబుతారనుకోలేదు : దేవరకొండ ఎంఎల్‌ఎ బాలూ నాయక్**

పదేండ్లపాటు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు సభలో ఇన్ని అబద్ధాలు చెబుతారనుకోలేదని దేవరకొండ కాంగ్రెస్ ఎంఎల్‌ఎ బాలూనాయక్ అన్నారు. పాలన అంటే గతంలో ప్రాజెక్టుల పేరుతో అడ్డగోలుగా బొక్కేయడం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్ష పేపర్ల లీకేజీతో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను అడ్డగోలు సంపాదన కేంద్రాలుగా మార్చడం కాదన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా బాలూ నాయక్ మాట్లాడుతూ 'హరీశ్‌రావు సభలో ఉపన్యాసం వాస్తవాలకు దూరంగా ఉందన్నారు. పరివారానికి, సంతానానికి లిక్కర్ స్కాముల విద్య నేర్పడం కాదు పరిపాలన అంటే అని విమర్శించారు. అధికారం అడ్డు పెట్టుకుని ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం కాదన్నారు. పదేండ్ల బిఆర్‌ఎస్ పాలనలో మహిళలను మీటింగ్‌లకు వాడుకోవడం తప్ప వారిని వృ ద్ధిలోకి తీసుకొచ్చే ఆలోచన చేయలేదన్నారు. ఆర్‌టిసి సిబ్బంది నిరసనలు తెలిపితే ఉద్యోగాలను తొలగించారన్నారు. పండుగలకు పంపిణీ చేసిన చీరలు పొలాలకు పరదాలు అయ్యాయని విమర్శించారు. తమ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్లుతుందన్నారు. హరీశ్ రావు ప్రభుత్వాన్ని టార్గెట్‌గా చేసుకుని పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని బాలూనాయక్ అన్నారు. అలాగే గతంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారని, దాని పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న పథకాలను బాలు నాయక్ సుదీర్ఘంగా వివరించారు.

## సిఎంను అభినందించిన బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసెంబ్లీలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి రెండు బిల్లులను ఆమోదించినందుకు బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు అసెంబ్లీలో సిఎం కార్యాలయంలో శుక్రవారం సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపి అభినందిచారు. ఈ సందర్భంలో కమిషన్ యొక్క కార్యక్రమ వివరాలను, వివిధ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బిసి కమిషన్ చైర్మన్, సభ్యులు, మంత్రులు పొన్నం



ప్రభాకర్, మంత్రి వర్గ ఉప సంఘ సభ్యులు ఉత్తం కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబులను కూడా కలిసి వారికి ధన్యవాదాలు తెలిపారు.

# జీవజాలం మనుగడకు అడవులే ఆధారం




మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పర్యావరణ పరిరక్షణ, జీవజాలం మనుగడకు అడవులే ఆధారం.. జీవజాలానికి, వనాలకు విడదీయరాని సంబంధం ఉందని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కెబిఆర్ పార్కుల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా తాను చెట్ల సంరక్షణలో భాగస్వామ్యం అవడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయంలోనే వృక్ష సంరక్షణ ఉన్నదన్నారు. వృక్షో రక్షతి రక్షితః చెట్టును మనం కాపాడితే... చెట్టు మనల్ని కాపాడుతుంది.. ఇది జగమెరిగిన సత్యం అని తెలిపారు. అడవుల పరిరక్షణ ఆవశ్యకత అందరికీ తెలియాలనే ఉద్దేశ్యంతో, జనంలో చైతన్యం రావాలని మార్చి 21ని ప్రపంచ అటవీ దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని దీన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహిస్తుందన్నారు. అడవులను ప్రజలు తమ స్వలాభం కోసం నాశనం చేస్తూ... తమ ఉనికిని తామే ప్రశ్నార్థకం చేసుకొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకృతి మాత్రమే శాశ్వతమైనదనే సత్యాన్ని గుర్తిస్తే, మానవ మనుగడకు ఆధారంగా నిలుస్తున్న అడవులను జాగ్రత్తగా కాపాడుకునేలా మనమంత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని సంరక్షిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడంలోనే అర్థవంతమైన జీవితం ఉందన్నారు. అడవుల ప్రాముఖ్యత, అడవులతో మనిషికి ఉన్న అనుబంధం, అడవుల సంరక్షణకు అనుసరించాల్సిన కార్యాచరణ ఈ సందర్భంగా మనమంతా గుర్తు చేసుకోవాలని సూచించారు. అడవులను సంరక్షించుకోకపోతే తలెత్తే విపత్కర పరిస్థితులను అటవీ దినోత్సవం సందర్భంగా మనమంతా మననం చేసుకోవాలన్నారు. పట్టణీకరణ, పరిశ్రమల స్థాపన, ప్రాజెక్టుల నిర్మాణం, పోడు వ్యవసాయం, గృహాల నిర్మాణం వంటి కారణాలతో అడవులు నానాటికీ అంతరించి పోతున్నాయన్నది మనమంతా ఆవేదన వ్యక్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భూ విస్తీర్ణానికి అనుగుణంగా అడవుల విస్తరణ లేకపోవడంతో గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో కఠిన సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. కార్యక్రమంలో మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పెస్కోవా, అటవీశాఖ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు,పౌరసంఘాలు పాల్గొన్నాయి.


తెలంగాణ ప్రభుత్వం
పంచాయత్‌రాజ్ ఇంజనీరింగ్ శాఖ
జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్ కార్యాలయం, పెద్దపల్లి.
నెం: T3/14/DPRE/PDPL/2024-25, టెండర్ ప్రకటన తేదీ: 20.03.2025.
పనుల సంఖ్య: (42), మొత్తం అంచనా విలువ: రూ.316.50 లక్షలు, పనుల పేరు: పెద్దపల్లి జిల్లాలో 1) భవనములు & మరమ్మతులు (22 నెం.లు), అంచనా విలువ: రూ.194.50 లక్షలు, 2) సిసి రోడ్ & డ్రెయిన్ పనులు (20 నెం.లు), అంచనా విలువ: రూ. 122.00 లక్షలు. టెండర్ షెడ్యూళ్ల దరఖాస్తుల జారీకి ఆఖరి తేదీ: 29.03.2025. టెండర్ షెడ్యూళ్ల జారీ: 03.04.2025. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేదీ: 04.04.2025న మ.3.00గం.ల వరకు. టెండర్లు తెరుచు తేదీ: 04.04.2025న మ.3.30గం.లకు.
సం/- జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్, పెద్దపల్లి.
DIPR R.O. No. : 11863-PP/CL/ADVT/1/2024-25, Date: 21-03-2025

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
కుత్బుల్లాపూర్ సర్కిల్ - 25, కూకట్‌పల్లి.
Lr No. 207/EE/Quthbullapur Circle/GHMC/2024-25 తేదీ: 21.03.2025
[illegible]
DIPR R.O. No. : 11946-PP/CL/ADVT/1/2024-25, Date: 21-03-2025

తెలంగాణ ప్రభుత్వం
వ్యవసాయ మార్కెట్ కమిటీ, పటాన్‌చెరు.
టెండర్ నోటీసు తేదీ: 21.03.2025.
[illegible]
DIPR R.O. No. : 11927-PP/CL/ADVT/1/2024-25, Date: 21-03-2025

ప్రజాపక్షం
శనివారం, మార్చి 22

# మారుతీ సుజుకీలో కార్మిక ఆందోళన

మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ ప్రయాణీకుల కార్లు ఎంతగా వినియోగదారుల ఆదరణ పొందుతున్నాయో, తద్విరుద్ధంగా కార్మిక వ్యతిరేక విధానాలకు కూడా అది ప్రసిద్ధి. కీ.శే. సంజయ్ గాంధి ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్య సంస్థగా మనదేశంలోకి తీసుకువచ్చిన ఈ జపాన్ కంపెనీ అతి త్వరలోనే బహుళ ప్రాచుర్యం పొందింది. జపనీయుల టెక్నాలజీపై ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నమ్మకం అందుకు ప్రధాన కారణం. అయితే ట్రేడ్ యూనియన్‌ల ఏర్పాటుకు, హక్కుల కోసం పోరాటాలకు ఆస్కారం లేదు. యాజమాన్యం మాటే శాసనం. అయినా అప్పటి నుంచీ కొద్దోగొప్పో కార్మిక ప్రతిఘటన తలెత్తుతూనే ఉంది. భారత కార్మిక చట్టాలు, న్యాయస్థానాలు ప్రతిపాదించిన, సమర్థించిన 'సమాన పనికి సమాన వేతనం' అమలును డిమాండ్ చేస్తూ మారుతీ (ఎంఎస్ఐఎల్) పూర్వ, ప్రస్తుత కార్మికుల్లోని ఒక భాగం 'మారుతీ సుజుకీ పోరాట కమిటీ' బ్యానర్ కింద హర్యానాలోని మనేసార్‌లో జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో గత సెప్టెంబర్ 18 నుంచి నిరవధిక ధర్నా నిర్వహిస్తున్నారు. ఆరు మాసాలుగా కార్మికులు శాంతియుత ఆందోళన చేస్తున్నా కంపెనీ యాజమాన్యానికి చీమకుట్టినట్లు లేదు. బిజెపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నాయి.

కంపెనీ విధించిన కష్టనష్టాలకు వ్యతిరేకంగా గత 12 సంవత్సరాలుగా ఈ కార్మికులు లీగల్, సామాజిక, ఆర్థిక పోరాటం చేస్తున్నారు. 546 మంది పర్మినెంట్, 1800మంది కాంట్రాక్టు కార్మికులను కంపెనీ డిస్మిస్ చేసింది. పలువురు అనేక సంవత్సరాలపాటు జైల్లో ఉన్నారు. వారి నేరాన్ని కోర్టులో నిరూపించలేకపోయింది కంపెనీ. ఈ పర్యాయం కూడా, ఆందోళన చేస్తున్న కార్మికులు వేతనాల్లో 40శాతం పెంపుదలను, కాంట్రాక్టు, టెంపరరీ, క్యాజువల్ వర్కర్లు, అప్రెంటీస్‌లు, విద్యార్థి ట్రైనీలు, ట్రైనీలకు నేషనల్ ఎంప్లాయిబిలిటీ ఎన్‌హేన్స్‌మెంట్ మిషన్ కింద సమాన హక్కులు డిమాండ్ చేస్తున్నారు. హర్యానాలోని మూడు మారుతీ సుజుకీ కర్మాగారాల్లోని ఉద్యోగులు, కార్మికుల్లో పై క్యాటగిరీలు 77శాతం. పర్మినెంట్ ప్రధాన ఉత్పత్తి ఉద్యోగాల్లో టెంపరరీ లేదా కాంట్రాక్టు కార్మికులను వినియోగించటాన్ని చట్టాలు నిషేధిస్తున్నప్పటికీ కంపెనీ అనేక సంవత్సరాలుగా అదే పద్ధతిని పాటిస్తున్నది. తద్వారా 'సమాన పనికి సమాన వేతనం' సూత్రాన్ని ఉల్లంఘిస్తున్నది.

సమాన వేతన చట్టం, 1976, పురుష–స్త్రీ కార్మికులకు సమాన వేతనం చెల్లింపును ఆదేశించింది. కొత్తగా ఆమోదించిన 'వేతనాలపై కోడ్', 2019లో కూడా ఆ సూత్రాన్ని పొందుపరిచారు. కంపెనీలు కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులను తీసుకోవటం ద్వారా వారికి తక్కువ వేతనాలు చెల్లిస్తూ, వేతన వ్యయం తగ్గించుకుని అధిక లాభాలు పొందుతున్నాయి. ఈ జబ్బు ప్రైవేటురంగానికే పరిమితం కాలేదు. అన్నిటికీ ఆదర్శంగా, మార్గదర్శకంగా ఉండాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం అనేక డిపార్టుమెంట్లలో 'ఔట్‌సోర్సింగ్', 'కాంట్రాక్టు' ఉద్యోగులతో శ్రమ దోపిడీ చేస్తున్నాయి. దానితో 'నియంత' కార్మిక–ఉద్యోగ శక్తి తగ్గి 'అనియత' లేదా అసంఘటిత కార్మిక శ్రేణులు పెచ్చుపెరుగుతున్నాయి. సంఘటిత మాన్యుఫాక్చరింగ్‌లో కాంట్రాక్టు కార్మికులు 1990–91లో 12శాతం ఉండగా, 2013–14లో 33.6శాతానికి పెరిగారు. మొత్తం వేతన చెల్లింపులో కాంట్రాక్టు కార్మికుల వాటా 1990–2000లోని 58.7 శాతం నుంచి 2013–14లో 81.5శాతానికి చేరింది. మొత్తం శ్రామికుల్లో అసంఘటిత కార్మికుల దామాషా 90శాతంపైగా ఉంది.

టెంపరరీ ఉద్యోగులు పర్మినెంట్ ఉద్యోగుల విధులు నిర్వర్తిస్తున్నందున 'సమాన పనికి సమాన వేతనం' సూత్రం వర్తిస్తుందని, రెగ్యులర్ పే స్కేల్‌లో కనీస మొత్తానికి వారు అర్హులని సుప్రీంకోర్టు 2016లో ఒక పంజాబ్ కేసులో తీర్పు చెప్పింది. ఆపద్ధర్మంగా, కాంట్రాక్టు పనికి నియమించేవారు కూడా 'సమాన పనికి సమాన వేతనానికి' అర్హులని తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టు ఉత్తర్వును ప్రభుత్వ శాఖలు, మంత్రిత్వశాఖల్లో అమలు చేస్తున్న స్థితిపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నప్పుడే చట్టాలు, కోర్టు ఆదేశాలు అమలవుతాయి. నయా ఉదారవాద విధానాలతో శ్రేయోరాజ్యం భావన స్థానంలోకి పెట్టుబడిని సేవించటం ప్రవేశించాక కార్మిక ఆందోళనలు, పోరాటాలు చెవిటివాని ముందు శంఖు ఊదిన చందమవుతున్నవి. ప్రస్తుత కార్మిక చట్టాలు, వేతనాలపై కోడ్ 'సమాన పనికి సమాన వేతనం' సూత్రాన్ని సుస్పష్టంగా చెప్పకపోయినా న్యాయస్థానం తీర్పులు ఆ సూత్రాన్ని బలపరుస్తున్నాయి. అందువల్ల మారుతీ సుజుకి కాంట్రాక్టు కార్మికుల పోరాటం లేబర్ మార్కెట్‌పై దీర్ఘకాల పర్యవసానం కలిగి ఉంది.

# బ్యాంకు సిబ్బంది సమ్మె ఎందుకు?

సిబ్బంది కొరతతో బ్యాంకులు కొట్టుమిట్టాడుతున్నాయి. గత పదేళ్లుగా చూసుకుంటే అధికారులు మినహా క్లర్క్‌లు, సబ్ స్టాఫ్ సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. గత నెల 10వ తేదీ లోక్‌సభలో సీపీఐ సభ్యుడు వి సెల్వరాజ్ అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి సమాధానం ఇస్తూ బ్యాంకులలో సిబ్బంది కొరతలేదనీ, 95 శాతం సిబ్బంది పనిచేస్తున్నారని అసత్యాలు చెప్పారు. వాస్తవానికి ప్రభుత్వరంగ బ్యాంకుల శాఖలలో క్లర్కులు, సబ్‌స్టాఫ్ తదితర పోస్టులు చాలా ఎక్కువగా ఖాళీగా ఉన్నాయి. ఖాళీలను భర్తీ చేయాలని ఏఐబీఈఏ (అఖిల భారత ఎంప్లాయీస్ యూనియన్) సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకున్న నాధుడులేడు. ఖాళీల భర్తీతో పాటు, ఇతర సమస్యల పరిష్కారానికి బ్యాంకు ఉద్యోగ సంఘాలు మార్చి 24, 25 తేదీలలో సమ్మెకు సిద్ధమవుతున్నాయి. ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదు. పైపెచ్చు 95 శాతం సిబ్బందిని భర్తీ చేశామని లోక్‌సభ సాక్షిగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి అబద్దాలు చెపుతున్నారు. బ్యాంకుల్లో క్లర్కుల సిబ్బందిని చేర్చుకోవడం తగ్గించినట్టు అన్ని శాఖల్లో పనిచేసే వారందరికీ తెలుసు. అంతేకాదు సబ్‌స్టాఫ్‌ను, పార్ట్‌టైం ఉద్యోగులను చేర్చుకోవడంపై నిషేధం విధించారు. అంతేకాదు ముఖాముఖంగా ఇచ్చే ఆదేశాల మీద కూడా రిక్రూట్ చేసుకోవడం లేదు. ఈ కారణాలన్నింటి వల్ల ఆయా శాఖలలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. ఫలితంగా తక్కువగా ఉన్న సిబ్బంది రోజువారీ పనిని పూర్తిచేయలేకపోతున్నారు. పర్యవసానంగా చాలా శాఖల్లో తాత్కాలిక, క్యాజువల్ సిబ్బందిని చేర్చుకొని పనిచేయించుకుంటున్నారు. 95 శాతం సిబ్బందిని చేర్చుకున్నామని మంత్రి పంకజ్ చౌదరి చెప్పిన సమాధానం కేవలం అబద్ధమే.

| అధికారులు, సిబ్బంది | 2011 | 2017 | 2024 | 1–1–2024 నాటికి |
|---|---|---|---|---|
| అధికారులు | 2,39,997 | 3,19,685 | 4,12,977 | 4,21,584 |
| క్లర్కులు | 2,54,232 | 2,69,271 | 2,48,539 | 2,48,173 |
| సబ్‌స్టాఫ్ | 1,24,609 | 1,19,288 | 95,199 | 88,851 |
| మొత్తం | 6,18,838 | 7,08,288 | 7,56,715 | 7,58,608 |

మంత్రి సమాధానం మేరకు 2011–2024 మధ్యకాలంలో 1,72,980 అధికారులు అదనంగా వచ్చి చేరగా, క్లర్కుల సంఖ్య 5,693, సబ్‌స్టాఫ్ సంఖ్య 29,410 తగ్గిపోయింది. బ్యాంకు ఉద్యోగుల సంఖ్యకు సంబంధించి భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) విడుదల చేసిన వివరాలిలా ఉన్నాయి.

| | మంత్రి సమాధానం | | ఆర్బీఐ ఇచ్చిన సమాచారం | |
|---|---|---|---|---|
| | 2011 | 2024 | 2011 | 2024 |
| అధికారులు | 2,39,997 | 4,12,911 | 3,10,961 | 4,05,336 |
| క్లర్కులు | 2,54,232 | 2,48,539 | 3,13,537 | 2,46,965 |
| | 5,693 | | 66,572 | |
| సబ్‌స్టాఫ్ | 1,24,609 | 95,199 | 1,51,190 | |
| | | 2,9410 | | 56,842 |

2011–2012ల్లో క్లర్కుల రిక్రూట్‌మెంట్‌తో పోల్చినప్పుడు, 2013–2024లో క్లర్కుల సిబ్బంది 2013–2024 సంవత్సరాలలో పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది.

| | |
|---|---|
| క్లర్కుల సంఖ్య 2013 నాటికి | 3,98,801 |
| క్లర్కుల సంఖ్యా బలం 2024 నాటికి | 2,46,965 |
| తగ్గుదల | 1,51,836 |

ఈ సంఖ్యలను పరిశీలించినప్పుడు 1,50,000 క్లర్కుల పోస్టులు, దాదాపు 50,000 సబ్‌స్టాఫ్ (దాదాపు 2 లక్షల ఖాళీలు) ప్రభుత్వరంగ బ్యాంకులలో ఖాళీలు ఉన్నాయి. వాణిజ్యం వృద్ధిపరిచేందుకు, వివిధ ప్రభుత్వ పథకాలు పెంపొందించాలంటే మరింత మంది అవసరమవుతారు. అందువల్లనే ఉద్యోగులు పనిభారంతో ఇబ్బంది పడుతున్నారు. మరో పక్క ప్రైవేటు బ్యాంకులలో సిబ్బంది ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయడంతో పాటు సిబ్బంది సంఖ్యను పెంచుతున్నారు. ప్రైవేట్ బ్యాంకులలో 2011లో 1,71,071సిబ్బంది ఉండగా, ఆ సంఖ్య 2024లో 8,46,530కి చేరింది. క్లర్కులు, వాస్తవ పరిస్థితులు ఇలావుండగా, సబ్‌స్టాఫ్ సిబ్బంది 95 శాతం రిక్రూట్ చేసినట్టుగా మంత్రి ఎలా చెప్పారో తెలియదు. ఇది అంకెల పొరపాటా లేక కావాలని తప్పుడు సమాచారం ఇచ్చారా? ఏదైనా కానివ్వండి. వివిధ శాఖలలో సిబ్బంది కొరత చాలా తీవ్రంగా ఉందని మనకు తెలుసు. ఈ నేపథ్యంలో ఖాళీలన్నీ భర్తీ చేయాలని, డిమాండ్ చేయాలని ఏఐబీఈఏ మార్చి 24, 25 తేదీలలో జాతీయ స్థాయి సమ్మెకు పిలుపునిచ్చింది. సిబ్బంది మొత్తం ఈ సమ్మెలో పాల్గొనాలని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

సిహెచ్ వెంకటాచలం
ఎఐబిఇఎ ప్రధాన కార్యదర్శి

# డీలిమిటేషన్ ప్రక్రియ నుంచి మరో ప్రమాదం

## జమ్మూ–కశ్మీర్, అసోం నుంచి గుణపాఠాలు

**రాధా కుమార్**
**చరిత్రకారిణి, విశ్లేషకురాలు**

చట్టసభల నియోజకవర్గాల తాజా డీలిమిటేషన్ (పునర్విభజన)పై ప్రస్తుతం జరుగుతున్న చర్చ వేడెక్కుతున్నది. అనేక అనుమానాలు, భయాలు, వాటికి పరిష్కారాలు వ్యక్తం చేయబడుతున్నాయి. పార్లమెంటరీ నియోజకవర్గాలను స్తంభింపజేయటం, జనాభా పెరిగిన రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లను పెంచటం అనే విజ్ఞతాయుతమైన ప్రతిపాదన కూడా వాటిలో ఉంది. శాసనసభ్యులు తమ నియోజకవర్గాలకు బాధ్యత వహిస్తారు, పార్లమెంటు సభ్యులు జాతీయ విధానం విషయంలో తమ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తారు (స్థూలంగా). కాబట్టి ఇది చాలామేరకు ప్రజాస్వామిక ఫార్ములా.

తాజా డీలిమిటేషన్ అధికార అసమతౌల్యాన్ని విస్తరిస్తుందనే దక్షిణాది రాష్ట్రాల సవ్యమైన భయాలను సంతృప్తి పరచటానికి ఇతర మార్గాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు, రాజ్యసభ సీట్లను ఉత్తరం, మధ్య, తూర్పు, పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాల మధ్య సమాన సంఖ్యలో పునఃపంపిణీ చేయవచ్చును.ఆ భౌగోళిక పరిధులతో అవి ఇప్పటికే జోన్‌లుగా గ్రూపు చేయబడి ఉన్నాయి. ఒక్కొక్క జోన్‌కు దాని సొంత జోనల్ కౌన్సిల్ ఉంది. వాటిలో ఎక్కువభాగం 2023 నుంచీ సమావేశం కాలేదు. పశ్చిమ జోనల్ కౌన్సిల్ మాత్రం ఫిబ్రవరి 2025లో సమావేశమైంది. దక్షిణ జోనల్ కౌన్సిల్ 2022 నుంచీ సమావేశం కాలేదు. 2025 జనవరిలో చెన్నైలో జరగాల్సిన సమావేశం కూడా వాయిదా పడింది.

జోనల్ కౌన్సిళ్లు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి ఉద్దేశించాయని, కాగా అంతర్ రాష్ట్ర కౌన్సిల్ రాష్ట్రం – రాష్ట్రం, కేంద్రం – రాష్ట్ర సంబంధాలు రెండింటినీ చర్చించి పరిష్కారాలు చూపగలుగుతుందని ఈ ప్రతిపాదనను వ్యతిరేకించేవారు వాదించవచ్చు. అయితే ఆచరణలో, కౌన్సిళ్లు అనేక సమస్యలు – ఆధార్ నుంచి సుపరిపాలన వరకు చర్చించవచ్చు. వాటికున్న పరిధి దృష్ట్యా, వాటిని హోం మంత్రిత్వశాఖ పెత్తనం నుంచి విముక్తం చేయాల్సిన అవసరముంది. జోనల్ కౌన్సిళ్లు ప్రస్తుతం నిద్రాణంగా ఉన్న అంతర్రాష్ట్ర కౌన్సిల్ (అది 2016లో గత పర్యాయం సమావేశమైనట్లు దాని వెబ్‌సైట్ తెలుపుతున్నది) ద్వారా కేంద్రప్రభుత్వ కార్యనిర్వాహకవర్గంతో సమన్వయం చేసుకోవచ్చు. ఇందుకుగాను దానికి ఇతోధిక అథారిటీ, అలాగే శాశ్వతత్వం అవసరం.

**జమ్మూ–కశ్మీర్‌లో ఏం జరిగింది?**

పైన సూచించిన రెండు ప్రతిపాదనలను కలిపి చూచినట్లయితే, ఎలక్టోరల్ ప్రాతినిధ్యం, ఫెడరలిజం రెండూ గాఢమవుతాయి. అయితే 2026లో చేబట్టే డీలిమిటేషన్‌కు ఎదురయ్యే సమస్యలు లేకపోలేదు. వాటిపట్ల జాగ్రత్త వహించాలి. 2022లో జమ్మూ–కశ్మీర్‌లో, 2023లో అసోంలో రాష్ట్రస్థాయి డీలిమిటేషన్ చేపట్టటం జరిగింది. 2026లో చేబట్టబోయే కసరత్తుకు అవి రెండూ హెచ్చరిక సంకేతాలు చూపుతున్నాయి.

జమ్మూ–కశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్విభజనను ఆ పూర్వ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ – భారతీయ జనతాపార్టీ మినహా – విమర్శించాయి. అదనంగా ఇచ్చిన ఏడు సీట్లలో ఆరు జమ్మూకు, ఒకటి కశ్మీర్‌కు దక్కాయి. దాంతో లోయ ఓటరుతో పోల్చినపుడు జమ్మూ ఓటు తూకం 1.2 అయింది. అది పరిపాలనా, భౌగోళిక సౌలభ్యం లేకుండా నియోజకవర్గాలు సృష్టించింది. జమ్మూలోని పూంచ్, రాజౌరిలను కశ్మీర్ లోయలోని అనంతనాగ్ లోక్‌సభ సీటులో కలిపింది. ఇందులో మొదటివి పీర్ పంజాల్ పర్వత శ్రేణుల్లో భాగంగా వుండగా, చివరిది జీలం లోయలో ఉంది.

మరీ దారుణమేమంటే, అసెంబ్లీ నియోజకవర్గాల హద్దుల పునర్ నిర్ణయానికి డీలిమిటేషన్ కమిషన్ మతాన్ని కొలబద్దగా తీసుకున్నట్లు చెప్పబడింది. జమ్మూలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆరు నియోజకవర్గాల్లో (జస్రోట, రాంఘర్, రాంనగర్, వైష్ణోదేవి, పద్దార్ – నాగ్‌సేని, దోడా పశ్చిమం) హిందువులు మెజారిటీ. అంతేగాక ముస్లిం మెజారిటీగా ఉన్న కిష్టావర్‌ను పూర్వపు ఇందర్‌వాల్ నియోజకవర్గంలోని భాగాలను చేర్చి హిందూ మెజారిటీ నియోజకవర్గంగా మార్చారు. వైష్ణోదేవి, పద్దార్, దోడా పశ్చిమ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్యలు 50వేలు కాగా, ముస్లిం మెజారిటీ నియోజకవర్గాలైన దూరు(1.92 లక్షల ఓటర్లు), సురాన్ కోట్ (1.77లక్షల ఓటర్లు) భారీ సంఖ్యలో ఓటర్లున్నారు. పై మూడు నియోజకవర్గాల్లో ఏ ఒక్కటి కూడా అదే జిల్లాలోని ఇతర ప్రాంతాలకు భౌగోళికంగా విలక్షణమైనవేమీ కాదు.

**అసోంలోనూ ఇదే తంతు**

అసోం డీలిమిటేషన్‌లో కొద్దిగా భిన్నమైన పద్ధతిని అనుసరించినా ఫలితం మాత్రం అదే విధంగా ఉంది. అసెంబ్లీ సీట్ల సంఖ్యను స్తంభింపజేశారు. అయితే అసోం మంత్రివర్గం ముందస్తు వ్యూహంతో నాలుగు జిల్లాలను రద్దు చేసి ఆ ప్రాంతాలను వాటి పూర్వపు జిల్లాల్లో కలిపింది. జిల్లాల సంఖ్య 35 నుంచి 31కి తగ్గింది. ఈ విలీనం వల్ల 10 ముస్లిం మెజారిటీ సీట్లు రద్దు కాగా, హిందూ, ఆదివాసీ సీట్ల సంఖ్య పెరిగింది. జమ్మూ–కశ్మీర్‌లో వలె అసోంలో కూడా నియోజకవర్గాల జనాభా సంఖ్యలో పెద్ద వ్యత్యాసం ఉంది.

మరో విధంగా చెప్పాలంటే, 2026లో డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నవారు భయపడాల్సింది జనసంఖ్య విషయంలో పక్షపాతం గూర్చి మాత్రమే కాదు. జమ్మూ–కశ్మీర్, అసోం ఉదాహరణలు సూచిస్తున్నట్లు, మైనారిటీలను మరింత పక్కకు తోసే మతతత్వ ప్రయోజనానికి ఉపకరించేందుకుగాను ఆ డీలిమిటేషన్ కమిషన్‌లు చాలా ఎక్కువ జనాభా కలిగిన నియోజకవర్గాల పక్కనే చిన్న నియోజకవర్గాలు ఏర్పాటు చేయడానికి సంకోచించలేదు. 2026లో డీలిమిటేషన్‌లో అదే ఎత్తుగడ అనుసరించరని విశ్వసించటానికి ఏదైనా హేతువు ఉందా?

**మతపరంగా విభజన ప్రమాదం**

ఈ ప్రమాదంపై ప్రతిపక్షం ఇంకనూ దృష్టిపెట్టలేదు. అది ఆ పని చేయాలి. ప్రతిపక్ష పార్టీలు పరిపాలిస్తున్న రాష్ట్రాలన్నింట్లో మైనారిటీలు – అత్యధికులు ముస్లింలు – పెద్ద సంఖ్యలో ఉన్నారు. ప్రాంతీయ గుర్తింపు చాలా మేరకు మత గుర్తింపును త్రోసివేస్తున్నమాట నిజం – ఉదాహరణకు, బెంగాలీ లేదా తమిళ హిందువులు, ముస్లింలు, క్రైస్తవుల్లో మెజారిటీ తమ రాష్ట్రాల్లో సాపేక్షికంగా లౌకికతత్వం కలిగిన ప్రాంతీయ పార్టీలకు – బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, తమిళనాడులో డిఎంకెలకు గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటువేశారు. ఈ మతరహిత ఓటింగ్ తరహా కొనసాగుతుందన్న గ్యారంటీ లేదు. తద్విరుద్ధంగా, మతపరంగా నియోజకవర్గాలను విభజించినపుడు దక్షిణాది రాష్ట్రాల్లో సైతం ఓటర్లు విభజించబడే అవకాశం ఉంటుంది. జమ్మూ–కశ్మీర్, అసోంలో ఆ ప్రభావం కనిపించింది. కొత్త నియోజకవర్గాలు దాదాపు అన్నీ బిజెపికి ఓటువేశాయి.

సరిహద్దు రాష్ట్రాల్లో ఆచరించే కేంద్ర పరిపాలన విధానాలను దేశ ప్రధాన భాగంలో యథాతథంగా అమలు చేస్తారని మనం విశ్వసించలేము. అది ఒకనాడు వాస్తవం, ఇప్పుడు ఎంతమాత్రం కాదు. వివాద ప్రాంతాల్లో, ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల్లో అసమ్మతికి వ్యతిరేకంగా నిరంకుశ చట్టాలను ప్రయోగించటం సర్వసాధారణం. ఇప్పుడది దేశమంతటికీ విస్తరించింది. అదేవిధంగా మైనారిటీలపై దుష్ప్రవర్తన అనేక రెట్లు పెరిగింది.

కేవలం జనాభా ప్రాతిపదికగా డీలిమిటేషన్ చేసినట్లయితే పెద్ద ఉత్తరాది రాష్ట్రాలు, మిగతా దేశం మధ్య ఏర్పడే అధికార అసమతౌల్యం నిస్సందేహంగా స్పష్టమైన, ప్రస్తుత ప్రమాదం. అయితే ఎన్నికల నియోజకవర్గాలను మతమార్గాల్లో విభజించే మరో స్పష్టమైన, ప్రస్తుత ప్రమాదాన్ని అది కనుమరుగు చేయటాన్ని అనుమతించకూడదు. అది ప్రతిఒక్కటీ ఈ దేశ ఐక్యతకు భిన్నమైన మార్గంలో ముప్పు తెస్తుంది. తొలిచర్య, ఎక్కువగా అభివృద్ధి చెందిన రాష్ట్రాల ప్రభావాన్ని యూనియన్‌లో తగ్గించటం ద్వారా ఎక్కువ అభివృద్ధి చెందిన రాష్ట్రాలను తక్కువ అభివృద్ధి చెందిన రాష్ట్రాల నుంచి విభజిస్తుంది. రెండవ చర్య, ప్రజలను మతపరంగా విభజిస్తుంది. ఒకటవ చర్య, రెండవ చర్య కలిసి మన బహుళాత్మక ఫెడరలిజంపై అత్యంత శక్తివంతమైన దాడి చేస్తాయి. వాటిని ఆపుచేసి తీరాలి.

(రచయిత్రి తాజా గ్రంథం :'ది రిపబ్లిక్ రీలెరెంట్ : రెన్యూయింగ్ ఇండియన్ డెమోక్రసీ, 1947–2024)
– ది హిందూ (మార్చి 20) సౌజన్యంతో)

# కుల నిర్మూలనకు కారల్ మార్క్స్, అంబేద్కర్ దృక్పథం కావాలి

కులం అనగానే కొంత మందికి డాక్టర్ అంబేద్కర్ గుర్తుకు వస్తాడు. వర్గం అనగానే కొంతమందికి కారల్ మార్క్స్ గుర్తుకు వస్తాడు.

భారతదేశంలోని ప్రధాన సమస్య కులం అని డాక్టర్ అంబేద్కర్ చెబితే, ప్రపంచంలోని ప్రధా న సమస్య వర్గం అని మార్క్స్ చెప్పాడు. కుల సమస్యను పరిష్కరిస్తే భారతదేశంలోని ప్రధానమైన సమస్య పరిష్కారం అవుతుందని డాక్టర్ అంబేద్కర్ చెబితే, వర్గ సమస్యను పరిష్కరిస్తే ప్రపంచంలోని ప్రధాన సమస్య పరిష్కారం అవుతుందని మార్క్స్ చెప్పాడు. కుల సమస్యను క్షుణ్ణంగా అంబేద్కర్ పరిశీలిస్తే వర్గ సమస్యను విపులంగా మార్క్స్ పరిశీలించాడు. కులసమస్యతో పాటు వర్గ సమస్యను పరిశోధించటానికి అంబేద్కర్ అవకాశం లభించింది. కాని వర్గ సమస్యతో పాటు కుల సమస్యను అంత వివరంగా పరిశోధించటానికి మార్క్స్‌కు అవకాశం లేకపోయింది. భారతదేశంలో కుల సమస్య ఉన్నది, వర్గ సమస్యా ఉన్నది. కుల వైరుధ్యాలు ఉన్నాయి. వర్గ వైరుధ్యాలు ఉన్నాయి. కులద్వేషం ఉన్నది. వర్గద్వేషమూ ఉన్నది. కులాధిపత్యం ఉన్నది. వర్గ ఆధిపత్యమూ ఉన్నది. అందువల్ల అంబేద్కర్ ఈ రెండింటినీ పరిశోధించే అవకాశం దొరికింది. మార్క్స్ పుట్టిన జర్మనీలో కాని, ఆయన ఎక్కువ కాలం జీవించిన ఇంగ్లాండులో కాని కేవలం వర్గ సమస్య మాత్రమే ఉండటం వల్ల ఆయన వర్గ సమస్య మీదనే కేంద్రీకరించగలిగాడు. భారతదేశంలోని ప్రజల సమస్య కుల నిర్మూలన ద్వారా పరిష్కారం అవుతుందని అంబేద్కర్ చెబితే ప్రపంచ దేశాలలోని పీడితుల సమస్య వర్గ నిర్మూలన ద్వారా పరిష్కారం అవుతుందని మార్క్స్ చెప్పాడు. కుల, వర్గ సమస్యలపై ప్రముఖంగా కృషి చేసిన అంబేద్కర్, మార్క్స్ ఇద్దరూ ఒకే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆర్థిక విప్లవం వచ్చి సామ్యవాదం స్థిరం కావాలంటే ముందు సామాజిక విప్లవం రావాలని అంబేద్కర్ అన్నాడు. సామాజిక విప్లవంద్వారా సమాజంలోని హెచ్చు తగ్గులు, ఎగుడు దిగుడులు, అంతరాల తొలగి పోతాయని అంబేద్కర్ అభిప్రాయపడ్డాడు.వ ర్గ నిర్మూలన ద్వారా అన్ని రకాల దోపిడీలు తొలగిపోయి, కొత్త మనిషి ఉద్భవిస్తాడని మార్క్స్ ఊహిస్తే, కుల నిర్మూలన ద్వారా అసమానతలు తొలగిపోయి కొత్త మనిషి పుడతాడని అంబేద్కర్ ఊహించాడు. అందుకనే కులం అనగానే కొంతమందికి అంబేద్కర్ గుర్తుకురావటం, వర్గం అనగానే కొంతమందికి మార్క్స్ గుర్తుకు రావటం జరుగుతున్నది.



భారతదేశంలోని పీడితుల విముక్తి వర్గనిర్మూలన ద్వారా జరుగుతుందా? లేక కులనిర్మూలన ద్వారా జరుగుతుందా? అనే ప్రశ్నకు సమాధానం ఇంకా దొరకలేదు. వర్గ నిర్మూలన ద్వారా కులనిర్మూలన జరుగుతుందా లేక కులనిర్మూలనద్వారా వర్గ నిర్మూలన జరుగుతుందా అనే ప్రశ్న సమాధానం పొందకుండానే కొనసాగుతున్నది. వర్గ నిర్మూలన ఒక్కటే మార్గం అనేవారు కొందరుంటే కులనిర్మూలన ఒక్కటే మార్గం అనేవారు. కొందరున్నారు. వర్గ నిర్మూలన అనేది సాధ్యం కాదు అనేవారు కొందరుంటే కులనిర్మూలన కూడా సాధ్యం కాదు అనేవారూ కొందరున్నారు. వర్గనిర్మూలన గురించి ఆలోచించే వారు అసలు 'కుల' సమస్యనే గుర్తించకపోతూ ఉంటే, కుల నిర్మూలన గురించి ఆలోచించేవారు కూడా 'వర్గం' గురించి ఆలోచించటం లేదు. వర్గం, కులం అనేవి ఒకదానిలోనుంచి ఒకటి వచ్చాయా లేక రెండూ విడివిడిగా ఉత్పన్నమయ్యాయా? ఈ రెండింటినీ ఒకే వేటుతో సంహరించవచ్చా లేదా ఒకదాని తర్వాత మరొకటి తీసి వేయాలా అనే ప్రశ్నకు సరైన సమాధానం ఇంకా దొరకలేదు. కులం మూలంగా వర్గం మూలంగా నష్టపోతున్న వారు కోట్లాదిమంది ఉంటే వీటి వలన ప్రయోజనం పొందుతున్న వారు చాల తక్కువ మంది ఉన్నారు. నష్టపోతున్నకోట్లాది జనం వీటి నిర్మూలన గురించి ఎందుకు ముందుకు రాలేకపోతున్నారు? ఒకవేళ వచ్చినా, సిద్ధమవుతున్నా సమాయత్తమవుతున్నా విజయం ఎందుకు సాధించలేకపోతున్నారు?.చదువులేదు, ఆకలి తగదు, అవమానాలు పోవు. ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా దారిద్ర్య రేఖకు దిగువనే జనం ఉండిపోతున్నారు. ఆర్థిక రంగంలో ఆకలి, సాంఘిక రంగంలో అవమానం, కుటుంబ జీవితంలో సంక్షోభం. పరిస్థితులు ఇంత అధ్వాన్నంగా ఉంటే భారతదేశంలోని శ్రామిక వర్గం ఎందుకు ఏకం కాలేకపోతున్నది?

కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో శ్రామికులు కొన్ని కొన్ని చోట్ల కొన్ని కొన్ని సందర్భాలలో ఏకమై కూలి రేట్లు పెంచుకోగలిగారు నిజమే. మరికొన్ని చోట్ల పోరాటాలు చేసి భూమిని సంపాదించుకోగలిగారు. ఇంకా కొన్ని చోట్ల తమకు జరుగుతున్న అవమానాలను అడ్డుకోగలిగారు. కాని సంకెళ్లు ఇంకా తెగిపోలేదు. కూలి పెంచుకొని, పెరిగిన కూలీ తెచ్చుకొని మళ్లీ ఎవరికి వారే విడివిడిగా ఉండిపోయారు. రథాన్ని నడిపే కుటుంబంలో నుంచి వచ్చిన కర్ణుడు ఒక దేశానికి రాజు అయ్యాడు. పడవ నడిపే ' కుటుంబంలో నుంచి వచ్చిన సత్యవతి శంతనుణ్ణి పెళ్లాడింది. అతను క్షత్రియుడు. అపుడు అభ్యంతరం లేదు. అటువంటివి ఎన్నో. ఒక రాజవంశమే ఆ విధంగా సంకర పద్ధతిలోనుంచి వచ్చింది. అయితే అదే భారతంలో ఏకలవ్యుని కథ కురువంశ అభ్యుదయానికి భిన్నంగా ఉంటుంది. శూద్రవర్ణానికి చెందిన ఏకలవ్యుడు క్షత్రియ విద్య నేర్చుకోవటానికి వీల్లేదని బొటనవ్రేలు నరికించేశారు. అయితే ఇది ఒక రాజాజ్ఞగా జరగలేదు. ఒక శాసనాన్ని ఒక నియమాన్ని ఉల్లంఘించినందుకు శిక్షగా బొటనవ్రేలును నరికివేయలేదు. ఒక బ్రాహ్మణగురువు తన ప్రియ శిష్యుని పరువు నిలబెట్టటం కోసం అతనికంటే విలువిద్యలో ప్రావీణ్యం పొందిన వారు వేరొకరు ఉండకూడదనే ఈర్ష్యతో కుట్రపన్ని చేసిన పని అది. అయితే రామాయణ కాలంనాటి సంఘటనకూ దీనికి కొంత తేడా ఉన్నది. శూద్ర కులానికి చెందిన శంభుకుడు బ్రాహ్మణ పద్ధతి అయిన తపస్సు చేసుకుంటుంటే రాజయిన రాముడు అది ధర్మ విరుద్ధమని నమ్మి శంబుకుని తల నరికి వేశాడు. శూద్రుడు తపస్సు చేయటం ధర్మ విరుద్ధమని బ్రాహ్మణ పురోహితులు రాజును నమ్మించారు. ఒక వర్ణానికి ఒక ధర్మం పెట్టి ఆధర్మాన్ని ఆయా వర్ణాలు పాటించాలనే నియమం పెట్టి అది సరిగ్గా అమలు జరుగుతున్నదా లేదా అని చూసే పని రాజుకు పెట్టారు.

అందరూ ఒకటే అనే ఐక్య భావాన్ని కులం ఎప్పుడూ అందించదు. పై గా అందరూ సమానం కాదు. ఒక్క అడగు అయినా వంద అడుగులు అయినా మనిషి మనిషిమధ్య దూరం ఉంటుందని అది తొలగిపోవటానికి వీలులేదని హెచ్చరిస్తూనే ఉన్నది. మనిషి మనిషీ కలవకుండా చేస్తున్న ఈ కులం పెద్ద అడ్డుగోడ అని అనుకోవటానికి వీలులేదు. అయితే మనసులో ఇది పెద్ద అడ్డుగోడలా నిలిచింది. కులం అనేది ఒక భావన, ఒక మానసిక స్థితి అని డాక్టర్ అంబేద్కర్ అంటాడు. ఈ మానసిక భావనను తొలగించుకోవటానికి ఆయనే ఒక మార్గం సూచించాడు. 'మనిషి మనిషి కలవటానికి కలిసి జీవించటానికి, ఒక స్త్రీ పురుషుడు పెళ్లి చేసుకొని కలిసి జీవించటానికి, ఆవిధంగా కలుస్తూ ఒక సమాజాన్ని ఏర్పరచుకోవటానికి కులం అడ్డుగా నిలిచింది.' కాబట్టి దీనిని నిర్మూలించాలి. అన్నాడు. 'ఇంతవరకూ ఏర్పడిన సమాజ చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే' అని కార్ల్ మార్క్స్, కమ్యూనిస్ట్ పార్టీ ప్రణాళిక మొదలు పెడతాడు. చరిత్ర పొడుగునా ఒక వర్గం మరొక వర్గాన్ని అదిమి పెట్టటానికి ప్రయత్నం చేస్తుంటే దోపిడి చేస్తున్నవానికి దోపిడికి గురవుతున్న వానికి మధ్య నిరంతరం పోరాటం జరుగుతూ ఉన్నదని, ఆ పోరాటం ఒకప్పుడు బహిరంగంగాను మరొకప్పుడు చాటుగాను, ఒకప్పుడు ప్రత్యక్షంగాను మరొకప్పుడు పరోక్షంగాను జరుగుతూ ఉండేదని, ఈ పోరాటంలో ఒకప్పుడు దోపిడివర్గాలు ఓడిపోయి విప్లవమార్గం ద్వారా సమాజం పునర్నిర్మాణం కావటమో లేక పోరాటంలో పీడిత వర్గాలు ఓడిపోవటం మూలంగా ఆ వర్గాలు నాశనం కావటమో జరుగుతూ ఉండేదని మార్క్స్ చెబుతాడు. ఒకప్పుడు మానవ సమాజం వర్గాలు లేకుండా ఉన్నది. వర్గ సంఘర్షణ లేకుండా ఉన్నది, దోపిడి లేకుండా ఉన్నది. తిరిగి ఆ స్థితిని తీసుకురావచ్చు. సమాజ పరిణామం మెరుగుదల వైపు ఉండాలి, పురోగమించాలి, పరిణితి చెందాలి. ఆధునిక యుగంలో మనిషి ప్రకృతిపై అనేక విజయాలను సాధించుకొని సమాజంలో లేని ఒక కృత్రిమమైన కులం నిర్మూలన జరిగిన నాడు కొత్త మనిషి పుడతాడని అనుకున్నట్టుగానే, వర్గ నిర్మూలన జరిగిననాడు మాత్రమే కొత్త మనిషి పుడతాడు. అలాకాకుండా ఒక్క వర్గ పోరాటమే ముందు చేద్దాం అంటే కులం పెరిగిపోతూ ఉంటుంది బలం పుంజు కుంటూ ఉంటుంది. వర్గ నిర్మూలన తర్వాత కులాన్ని నిర్మూలిద్దామనుకుంటే అది చావదు. ఒక వేళ విపరీతమైన బలాన్ని ఉపయోగించి కులాన్ని కూలగొడితే ఈ లోగా కిందపడి పోయిన వర్గం నెమ్మదిగా పైకి లేస్తుంది. కుల నిర్మూలన యుద్ధకాలంలో కొత్త శక్తిని పుంజుకుంటుంది. కులాన్ని నిర్మూలించి తిరిగి ఇటు చూస్తే వర్గం లేచి కూర్చుంటుంది. మళ్లీ దానిని చంపాలి. దానిని చంపి ఇటు చూస్తే మళ్లీ కులం కూడా లేచి కూర్చుంటుంది. ఇక అదే పద్ధతి జరుగుతూ ఉంటుంది. ఎందుకంటే కులం వేరు, వర్గం వేరు కాదు. కులంలో వర్గం ఉంది, వర్గంలో కులం ఉంది. కులంతో వర్గం బలపడుతుంది. వర్గంతో కులం బలపడుతుంది. ఒకదానిలోంచి ఒకటి వచ్చి పరస్పరం బలపర్చుకుంటూ ఉన్నాయి. కులం లేకుండా వర్గం కనబడదు. వర్గం లేకుండా కులమూ కనపడదు. ఒకసారి వర్గమే కులం అవుతుంది. మరొకసారి కులమే వర్గమవుతుంది. పునాది–ఉపరితల సిద్ధాంతం తీసుకున్నా పునాది ఒకసారి ఉపరితలం అవుతుంది. ఉపరితలం ఒకసారి పునాది అవుతుంది. వర్గమూ కులమూ విడివిడిగా ఎప్పుడూ లేవు. విడివిడిగా లేవు కాబట్టి విడివిడిగా నిర్మూలన కావు. సామాజిక పరిస్థితులకు సంబంధించిన అంశాలు ఒక స్థిరమైన సూత్రానికి కట్టుబడి ఉండకపోవచ్చు. పనిచేస్తున్న క్రమంలో వివిధ అంశాల ప్రభావాన్ని బట్టి విధానం మార్చుకోవలసి వస్తుంది. ఆచరణను బట్టి సిద్ధాంతాన్ని మెరుగు పరచుకోవచ్చు. సిద్ధాంతాన్ని బట్టి ఆచరణకు పదును పెట్టుకోవచ్చు. కుల నిర్మూలన వర్గ నిర్మూలన కార్యక్రమాలు రెండింటినీ కలిపి నిర్వహిస్తున్నపుడు ఎదురయ్యే పరిస్థితులను బట్టి ప్రాధాన్యత మారుతూ ఉంటుంది. ఏ కార్యక్రమమైనా సమయం ప్రాంతం బట్టి మార్చుకోవలసి వస్తుంది.



మారుపాక అనిల్ కుమార్
9440482429

శ్రామిక జనావళి కుల భేదాలలో కూరుకుపోయి వర్గ నిర్మూలన కోసం కలిసి పోరాటం చేయలేని స్థితిని చూసి డాక్టర్ అంబేద్కర్ ఇలా అన్నాడు. 'వెనుకబడిన కులాలు విడిగా ఉండటం వల్ల ఎంతో నష్టపోయారు. వయోజన ఓటు హక్కు ద్వారా అది సాధించవచ్చు' అని చెబుతూ షెడ్యూల్డు కులాలతో వారు కలవటంలేదని బాధపడుతూ కలవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాడు. ఆర్థిక విప్లవం తెచ్చిన తర్వాత వేయి సాంస్కృతిక విప్లవాల కోసం ఆగకుండా ఆర్థిక విప్లవం కోసం చేస్తున్న పోరాట క్రమంలో సామాజిక విప్లవాన్ని కూడా జోడిస్తే అనుకున్న ఫలితాలు చాల తొందరలోనే దొరుకుతాయని చారిత్రక పరిణామాలు రుజువు చేస్తున్నాయి.షెడ్యూల్డు కులాలు, వెనుకబడిన కులాలు కలవలేక పోవటానికి కుల భేదాలే కారణమని చూశాం. 'కుల నిర్మూలన వర్గ నిర్మూలన' అనే రాజకీయ కార్యక్రమంతో ఒకే రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో ఐక్య సంఘటన నిర్మాణం చేసినపుడే నిజమైన, సంపూర్ణమై న విప్లవం వస్తుంది. కేవలం కుల ప్రాతిపదిక మీద షెడ్యూల్డు కులాలు, వెనుకబడిన కులాలు ఐక్య సంఘటనగా ఏర్పడటం కాదు కావలసింది. వర్గ నిర్మూలన లక్ష్యంతో కుల నిర్మూలన కార్యక్రమంతో ఐక్య సంఘటన కట్టాలి. కుల నిర్మూలన, వర్గ నిర్మూలన, కార్యక్రమంలో ప్రజలు తమ మార్గాన్ని వారే సుగమం చేసుకుంటారు.

చరిత్ర పొడుగునా వారి దారిలో ఎదురవుతున్న అనేకమైన అడ్డంకులను తొలగించుకున్నారు. అనుభవాన్ని అవసరంతో జోడించి అనేకమైన అవరోధాలను అధిగమించారు. కులమూ వర్గమూ ఏదీ వారిని ఓడించలేదు. ఎన్ని అవతారాలు మార్చినా పాలక వర్గం పతనమవుతూనే ఉన్నది, ప్రజలు విజయాన్ని సాధిస్తూనే ఉన్నారు. కులమూ వర్గమూ ప్రజలను పీడించటం సుదీర్ఘమైన మానవ చరిత్రలో చాలా కొద్దికాలం నుంచే. అవి ఓడిపోయి నశించిన ఉదంతాలున్నాయి.

# ఇదేం చెత్తకుండీ కాదు

న్యాయ వ్యవస్థ మీద నమ్మకం సన్నగిల్లుతోంది!'

వర్మను బదిలీ చేయడంపై

బార్ అసోసియేషన్ ఆగ్రహం



**న్యూఢిల్లీ :** పెద్దమొత్తంలో డబ్బు కట్టలు దొరికిన దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయటాన్ని అక్కడి బార్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇది 'చెత్తకుండీ' కాదని పేర్కొంది. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసినట్లు సమాచారం అందగానే ఈ మేరకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది అనిల్ తివారీ పేరుతో ఓ తీర్మానం చేశారు. ఢిల్లీ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో లెక్కల్లో చూపని రూ.15 కోట్లు బయటపడినట్లు అలహాబాద్ హైకోర్ట్ బార్ అసోసియేషన్ తీర్మానంలో పేర్కొన్నారు. న్యాయమూర్తుల కొరత సహా తాము అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ చెప్పారు. ఫలితంగా కొత్త కేసులను విచారణ చేయలేకపోవటం వల్ల ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. అంత మాత్రాన అలహాబాద్ హైకోర్టు చెత్తకుండీ కాదన్నారు. తాము అవినీతిని అంగీకరించబోమని అనిల్ తివారీ స్పష్టం చేశారు.

**బదిలీ చేస్తే సమస్య తీరిపోతుందా?**

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో లెక్కలు చూపని నగదు బయటపడటం చాలా పెద్ద విషయమని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. కేవలం న్యాయమూర్తిని బదిలీ చేయడంతో ఈ సమస్య సమసిపోదని స్పష్టంచేసింది. జస్టిస్ వర్మ ఇంట్లో దొరికిన నగదు ఎవరిదో తేల్చి, ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టాలని కాంగ్రెస్ సూచించింది. ఈ అంశంపై కేంద్రంపై విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ ఇడి, సిబిఐ కంటే అగ్నిమాపక దళం మెరుగ్గా పనిచేసిందని వ్యంగ్యాస్త్రాలు సంధించింది. మరోవైపు కాంగ్రెస్ వ్యాఖ్యలపై స్పందించిన బిజెపి న్యాయస్థానాల వ్యవహారాల్లో పార్టీలు జోక్యం చేసుకోకూడదని తెలిపింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా చర్యలు తీసుకున్నారని బీజే పీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర గుర్తుచేశారు.

**తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతోంది!**

ఢిల్లీ హైకోర్ట్ న్యాయమూర్తి ఇంట్లో పెద్ద మొత్తంలో నగదు దొరికినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో సుప్రీంకోర్ట్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ఘటన విషయంలో తప్పుడు సమాచారం, పుకార్లు (రూమర్స్) వ్యాప్తి చెందుతున్నాయని పేర్కొంది. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్ట్‌కు బదిలీ చేయాలనే ప్రతిపాదనకు, అంతర్గత విచారణ ప్రక్రియ రెండూ వేర్వేరు అని సుప్రీం కోర్ట్ స్పష్టం చేసింది. ఢిల్లీ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డికె ఉపాధ్యాయ ఈ ఘటనకు సంబంధించిన ఆధారాలు సేకరించే అంతర్గత విచారణ ప్రక్రియ ప్రారంభించారని తెలిపింది. దానికి సంబంధించిన నివేదికను ఈ రోజే (శుక్రవారం) సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు సమర్పిస్తారని పేర్కొంది. ఆ నివేదిక పరిశీలన తరువాతనే, సుప్రీం కోర్ట్ అవసరమైన తదుపరి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేసింది.

**డబ్బు దొరకలేదట!:** మరోవైపు ఢిల్లీ హైకోర్ట్ న్యాయమూర్తి ఇంట్లో మంటలు ఆర్పేందుకు వచ్చిన సిబ్బందింకి అసలు ఎలాంటి నగదు కనిపించలేదని దిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్ చె ప్పడం గమనార్హం. కాగా, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ బంగ్లాలో 14వ తేదీన అగ్నిప్రమా దం జరిగింది. దీనితో మంటలు ఆర్పేందుకు వెళ్లిన సి బ్బందికి అనుకోకుండా అక్కడ భారీ ఎత్తున డబ్బు కనిపించింది. దీనిపై పై అధికారులకు సమాచారం ఇవ్వగా, అదంతా లెక్కల్లోకి రాని డబ్బు అని తెలిసింది. దీంతో సు ప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని కొలీజియం స్పందించి ఆయన్ను మరో హైకోర్టుకు బదిలీ చేసింది. ఈ ఘటన న్యాయవర్గాల్లో సంచలనం సృష్టించింది.

## త్వరలో అమెరికా నుంచి మరో 295 మంది వలసదారుల రాక..

పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు విదేశాంగ మంత్రి లిఖితపూర్వక సమాధానం



**న్యూఢిల్లీ :** డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన అమెరికా ప్రభుత్వం.. కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. దీంతో విడతల వారీగా పలువురు స్వదేశానికి తిరిగొచ్చారు. త్వరలో మరో 295 మంది భారతీయులను వెనక్కి పంపనున్నట్లు కేంద్రం తాజాగా వెల్లడించింది. ఈ మేరకు అక్రమ వలసల అంశంపై అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ శాఖ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చింది. ఈ సందర్భంగా భారత్‌కు పంపించిన వలసదారుల పట్ల అమెరికా అధికారులు వ్యవహరించిన తీరు పైనా కేంద్రం స్పందించింది. దీనిపై తమ ఆందోళనను అగ్రరాజ్యానికి తెలియజేసినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 5న భారత్‌కు పంపించిన అక్రమ వలసదారులకు, ముఖ్యంగా మహిళలకు సంకెళ్లు వేసిన అంశాన్ని అమెరికా వద్ద లేవనెత్తినట్లు తెలిపింది. దీనికి అగ్రరాజ్యం కూడా సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించింది. భారత్ ఆందోళనల తర్వాత ఫిబ్రవరి 15, 16 తేదీల్లో పంపించిన వలసదారుల్లో మహిళలు, చిన్నారులకు సంకెళ్లు వేయలేదని అమెరికా ధ్రువీకరించింది. వలసదారులు స్వదేశానికి చేరుకున్న తర్వాత వారితో చర్చించి మన అధికారులు కూడా దీన్ని నిర్ధారించుకున్నారు. ఇక, అమెరికాలో చట్టవ్యతిరేకంగా నివాసం ఉంటున్న వారిలో మరో 295 మంది భారతీయులు త్వరలోనే స్వదేశానికి రానున్నారు. ప్రస్తుతం సంబంధిత ఏజెన్సీలు వారి వివరాలను పరిశీలిస్తున్నాయి అని విదేశాంగశాఖ తమ సమాధానంలో పేర్కొంది. ఫిబ్రవరి 5 నుంచి ఇప్పటివరకూ 388 మంది భారత అక్రమ వలసదారులను సైనిక విమానాల్లో అగ్రరాజ్యం వెనక్కి పంపింది. వీరిలో అత్యధికంగా 40శాతం మంది పంజాబ్ వాసులు కాగా.. 34శాతం హర్యానాకు చెందిన వారు ఉన్నారు. అయితే, వీరి చేతులకు సంకెళ్లు, కాళ్లకు గొలుసులతో బంధించి పంపడం అప్పట్లో తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై కేంద్రం కూడా స్పందించింది. మరోవైపు, ఈ డిపోర్టేషన్ ప్రక్రియ కొన్నేళ్ల నుంచి సాగుతోందని ప్రభుత్వం అప్పట్లో వెల్లడించింది. 2009 నుంచి 2024 వరకు దాదాపు 15,500 మందిని అమెరికా వెనక్కి పంపించినట్లు గుర్తుచేసింది.

## జాతీయ గీతాన్ని అగౌరపర్చిన నితీశ్

**పాట్నా:** బిహార్ సిఎం నితీశ్ కుమార్ జాతీయ గీ తాన్ని అగౌరపర్చారు. జాతీయ గీతం ఆలపిస్తున్న సమయంలో పక్కనున్న వారితో మాట్లాడేందుకు ఆయన ప్రయత్నించారు. అలాగే సైగలు చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అ య్యింది. ఈ నేపథ్యంలో సిఎం నితీశ్ కుమార్ తీరుపై ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ మండిపడ్డా రు. జాతీయ గీతాన్ని ఆయన అగౌరపర్చడంపై క్ష మాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'బిహార్ సిఎం నితీశ్ కుమార్ గురువారం జాతీయ గీతాన్ని అగౌరవపరిచారు. 'బిహారీ'గా నేను సిగ్గుపడుతున్నా. ఈ సంఘటన చాలా దురదృష్టకరం. సిఎం నితీశ్ కుమార్ పదవీ విరమణ చేయాలి' అని మీడియాతో అన్నారు. కాగా, బిహార్ మాజీ సిఎం, ఆర్‌జెడి నాయకురాలు రబ్రీ దేవి కూడా ఈ సం ఘటనపై స్పందించారు. 'ఆయన (బిహార్ సిఎం నితీశ్ కుమార్) మానసిక స్థితి సరిగా లేదు. ఆయ న మనసు పని చేయకపోతే తన కొడుకును ముఖ్యమంత్రిని చేయాలని డిమాండ్ చేస్తున్నాం' అని అన్నారు.

## నాగ్‌పూర్ హింస... పోలీస్‌కస్టడీలో 17మంది

లోకల్ కోర్టు మెజిస్ట్రేట్ ముందు నిందితుల హాజరు

ఏడు రోజులు కోరినప్పటికీ

రెండు రోజుల పోలీస్‌కస్టడీ మాత్రమే మంజూరు

**నాగ్‌పూర్ :** మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నగరంలో హింసతో సంబంధం ఉన్న నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపబడిన 17మందిని శుక్రవారం ఇక్కడి స్థానిక కోర్టు మార్చి 22వరకు పోలీస్ కస్టడీకి పంపింది. ప్రాథమిక విచారణలో వారిపై వచ్చిన నేరం తీవ్రతను పేర్కొంటూ లోకల్ కోర్టు మెజిస్ట్రేట్ మయిమునా సుల్తానా ముందు గురువారం నిందితులను హాజరుపర్చారు. నిందితులను 7 రోజులపాటు పోలీస్ కస్టడీకి కోరగా, కేవలం రెండు రోజులకు మాత్రమే కస్టడీ మంజూరు చేశారు. అరెస్ట్ అయిన వ్యక్తులు గణేష్‌పేట్ పోలీసులు రిజిస్టర్ చేసిన ఎఫ్ఐఆర్‌తో సంబంధం ఉన్నవారు. కోర్టు తన ఉత్తర్వులలో నిందితులు పాల్పడిన నేరాలస్థాయిని పరిగణనలోనికి తీసుకుని తీవ్ర స్వభావం కలిగి ఉన్న నేరంగా భావిస్తున్నామని, పోలీసుల కస్టోడియల్ విచారణ అవసరమని ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించింది. ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలోని ఔరంగజేబు సమాధిని తొలగించాలని కోరుతూ విశ్వహిందూపరిషత్ నేతృత్వంలో పవిత్ర శాసనాలతో కూడిన ఛాదర్‌ను దగ్ధం చేస్తున్నారన్న పుకార్లు ప్రారంభమైన తర్వాత సోమవారం సాయంత్రం నాగ్‌పూర్ నగరంలోని పలు ప్రాంతాలలో పెద్ద మొత్తంలో రాళ్లు విసరడం, లూటీచేసిన ఘటనలు పోలీస్‌స్టేషన్లలో నమోదయ్యాయి. అయితే అరెస్ట్ అయిన 17మందిలో కేవలం నలుగురి పేర్లను మాత్రమే ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. నిందితుల తరపున హాజరైన న్యాయవాదుల ఉద్దేశాన్ని అంగీకరించేందుకు కోర్టు తిరస్కరించింది.

## సీనియర్ అడ్వకేట్ హోదా రద్దుపై 'షోకాజ్'నోటీస్

సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని

ఫుల్ కోర్టు నిర్ణయం షోకాజ్ నోటీస్ జారీ ఇదే మొదటిసారి సెక్రటరీ జనరల్

భరత్ పరాషర్‌కు షోకాజ్‌నోటీస్ జారీ అధికారం అప్పగింత



**న్యూఢిల్లీ :** మీకు ప్రదానం చేసిన హోదాను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని ఓ సీనియర్ న్యాయవాదిని అడిగిన సుప్రీంకోర్టు సంతృప్తి చెందని నేపథ్యంలో శుక్రవారం షోకాజ్ నోటీస్ ఇవ్వాలని నిర్ణయించింది. షోకాజ్ నోటీస్ నిర్ణయం ఇదే మొదటిసారి. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రాపై దుష్ప్రవర్తన ఆరోపణల నేపథ్యంలో సుప్రీంకోర్టు పూర్తి కోర్టు ఈ అనూహ్య నిర్ణయం తీసుకుంది. సుప్రీం న్యాయమూర్తులు అందరితో ప్రాతినిథ్యం వహించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌కన్నా నేతృత్వంలోని ఫుల్ కోర్టు పరిపాలనాదిశగా ఈ షోకాజ్ నోటీస్ నిర్ణయాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, ఆగస్టిన్ జార్జి మాసిహ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఫిబ్రవరి 20న ఇచ్చిన తన తీర్పులో ఇటీవల కేసులో అతని ప్రవర్తనను తప్పుపట్టింది. అదే సమయంలో సుప్రీంకోర్టు దోషుల శిక్ష నుండి 30సంవత్సరాలు ఉపశమనం పొందకుండా అడ్డుకుందనే విషయాన్ని ఆయన వెల్లడించలేదని ఆరోపించింది. సర్వోన్నత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించే అతని దుష్ప్రవర్తనను ఆక్షేపించింది. ఫిబ్రవరి 20కి వ్యతిరేకంగా అత్యున్నత న్యాయస్థానం రిషి మల్హోత్రాపై కఠిన చర్యలు తీసుకుంది. షోకాజ్ నోటీస్ జారీ చేయడానికి సెక్రటరీ జనరల్ భరత్ పరాషర్‌కు సుప్రీం కోర్టు ఫుల్ కోర్ట్ అధికారం ఇచ్చింది. హోదా నుండి ఆయనను తొలగించే ముందు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రాకు తన ప్రవర్తనను వివరించడానికి మరో అవకాశం ఇవ్వాలని సూచించింది. అత్యున్నత న్యాయస్థానం హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ తప్పుదారి పట్టించే ప్రకటనలు చేయడంతో పాటు ఖైదీలను ముందస్తుగా విడుదల చేయడానికి సంబంధించిన అనేక కేసులలో వాస్తవాలను అణిచివేస్తున్నారని సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రాపై ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో మల్హోత్రా ఇతర సందర్భాలలో కూడా సుప్రీంకోర్టును తప్పుదారి పట్టించారనే ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ధర్మాసనం మాట్లాడుతూ ఏదైతే తాము పునరుత్పత్తి చేశామో 'అది రికార్డు నుండి ఉద్భవించింది' అని వెల్లడించింది. రిషి మల్హోత్రాకు సీనియర్ అడ్వకేట్ హోదా ప్రదానం 2024, ఆగష్టు 14న జరిగింది. ఈ నిర్ణయాల కింద ఏర్పాటు చేయబడిన సీనియర్ హోదా వ్యవస్థ 'వాస్తవికంగా సమర్థవంతంగా పనిచేస్తుందా' అని ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. రెండు తప్పనిసరి నిర్ణయాలతో విభేదించలేమని, లేదా వ్యతిరేక అభిప్రాయాన్ని తీసుకోలేమని ధర్మాసనం స్పష్ట ంచేసింది.

## లోక్‌సభలో ఆశావర్కర్ల సమస్యను లేవనెత్తిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** కేరళలో కొనసాగుతున్న ఆశా వర్కర్ల ఆందోళన అంశాన్ని కాంగ్రెస్ నాయకుడు కె.సి. వేణుగోపాల్ శుక్రవారం లోక్‌సభలో లేవనెత్తారు. అయితే కేంద్ర ఆరోగ్య మంత్రి జెపి నడ్డా తన ఛాంబర్‌లో ఈ విషయాన్ని చర్చించవచ్చని చెప్పారు. గురువారం కేరళలోని ఆశా వర్కర్లలో ఒక వర్గం తమ నిరసనను తీవ్రతరం చేసింది. తమ డిమాండ్లు సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో కేరళ ఎంపి అయిన వేణుగోపాల్ ఆందోళనను పరిష్కరించడంలో సహాయం చేస్తారా లేదా అని మంత్రి నడ్డా నుండి తెలుసుకోవాలని కోరారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. అయితే జార్జ్ నడ్డాను కలవలేకపోయారనే వార్తలను కూడా ఆయన ప్రస్తావించారు. దీనికి నడ్డా బదులిస్తూ తన చాంబర్‌కు వస్తే వివరింగా చర్చిస్తానని, ఈ ప్రశ్న ఆశా వర్కర్లకు సంబంధించినది కాదని అని పేర్కొన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంతో బుధవారం జరిగిన చర్చలు విఫలమైన తర్వాత కొంతమంది ఆశా వర్కర్లు నిరాహార దీక్ష చేయాలని నిర్ణయించుకున్నారు. పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలు, గౌరవ వేతనాన్ని రూ.7,000 నుండి రూ.21,000 కు పెంచాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 10 నుండి ఆశా వర్కర్లలో ఒక వర్గం తిరువనంతపురంలోని సచివాలయం వెలుపల నిరసన తెలుపుతున్నారు.

# రూ.219 కోట్ల రుణాలను తక్షణమే విడుదల

గిరిజన సంఘాల నాయకులు డిమాండ్

'ట్రైకార్' ద్వారా ఎంపికైన

30వేల మంది లబ్ధిదారులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గిరిజన నిరుద్యోగ యువతి, యువకులకు గాను స్వయం ఉపాధికి సంబంధించి ట్రైకార్ ద్వారా ఇప్పటికే ఎంపికైన 30 వేల లబ్దిదారులకు రుణాలు మంజూరై ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.219 కోట్లను తక్ష ణమే విడుదల చేయాలని వివిధ గిరిజన సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గడిచిన 3 ఏళ్లుగా రుణాల కోసం నిరుపేద గిరిజన యువత ఎదురు చూస్తోందని, ప్రభుత్వం కొ త్తగా తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాస పథకంతో తమకు అ న్యాయం జరగుతుందోనన్న తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఇదే జరిగితే ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ ప్రతిఘటిస్తామని వారు హె చ్చరించారు. శుక్రవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో తెలంగాణ గిరిజన స మాఖ్య తెలంగాణ గిరిజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రా జీవ్ యువ వికాసం బకాయి పడ్డ ట్రైకార్ రుణాలను రద్దుకు కుట్ర అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గి రిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రాంమూర్తి, గిరిజన సంఘం అధ్యక్షులు ధర్మనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కా ర్యదర్శి ఆర్.అంజయ్య నాయక్, ఆర్.శ్రీరామ్ నాయక్, దాస్‌రామ్ నాయక్, రాంబాల్ నాయక్, శంకర్ నాయక్, సేవాలాల్ సేనా రాష్ట్ర అధ్యక్షులు సంజీవ్ నాయక్,జాతీయ నాయకులు రాజేష్, గిరిజన జెఎసి నాయకులు రవీంద్ర నాయక్, ఎరుకల సంఘం నాయకులు రఘు, వెంకటేషం, గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి జూవ్వారి రమేశ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జర్పుల శ్రీను, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఖట్రావత్ నారాయణ, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజయ్య నాయక్ మాట్లాడుతూ ట్రైకార్ ద్వారా గత ప్రభుత్వం 30 వేల మంది గిరిజన యువతి యువకులకు రూ.219 కోట్ల స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయగా, ఆ తర్వాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ వాటిని విడుదల చేస్తామని ప్రకటించి 6 నెలలు కావాస్తున్న ఇప్పటికి మం జూరు చేయలేదన్నారు. దీనికి తోడు ఇప్పుడు రాజీవ్ యువ వికాసం పథకం ప్రకటించడం, ఈ రుణాల విడుదల సంబంధించి ప్రభుత్వం ఏలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో 30వేలమంది నిరుపేద గిరిజన బిడ్డలు తీవ్ర అందోళనకు గురవుతున్నారని తెలిపారు. వీరికి ఇప్పటికే రుణాలు మంజూరైనట్లు ఆన్‌లైన్‌లో కూడ నమోదు కావడంతో , ప్రభుత్వం ప్రకటించిన రా జీవ్ యు వ వికాస పథకానికీ సైతం దరఖాస్తు చేసుకునే పరిస్థితి లేదన్నారు. 30 వేల మంది లబ్ధిదారులకు సంబంధించి ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.219 కోట్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్ష ణమే విడుదల చేసి వీరిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దాస్ రామ్ నాయక్ మాట్లాడుతూ బడ్జెట్‌లో ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి సరిపోను నిధులను ప్రతిపాదించలేదన్నారు. డిఐసి ల ద్వారా ఇప్పటికే రుణాలు పొందిన అనేకమందికి సబ్సిడి పెండింగ్‌లో ఉందని, వీటిని కూడ స కాలంలో విడుదల చేసి ఆదుకోవాలన్నారు. రవీంద్ర నాయక్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల విష వలయంలోకి నెట్టి వెళ్లిందని, దీంతో నిరుపేద ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు కనీసం స్వయం ఉపాధికి రుణాలు కూడ అందని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు పలువురు గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామి ప్రకారం గిరిజనులను అన్ని విధాలుగా ఆదుకోవాలని లేకపోతే గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతి కాంగ్రెస్ పడుతుందని హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వం తక్ష ణమే లబ్ధిదారులకు నిధులను విడుదల చేయకపోతే ఏఫ్రిల్ 7న 30 మంది లబ్ధిదారులతో గిరిజన సంక్షేమ ముట్టడించనట్లు రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది.

# బెట్టింగ్ యాప్‌ల ప్రకటనలు ఇవ్వొద్దు

సినీ పరిశ్రమకి సిపిఐ నారాయణ హితవు



**న్యూఢిల్లీ :** సంపాదన కోసం యువతను నాశనం చేసే బెట్టింగ్ యాప్ లను, సమాజాన్ని చెడగొట్టే వ్యాపార ప్రకటనలను ఇవ్వొద్దని సినీ పరిశ్రమకు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ హితవు పలికారు.పవిత్రమైన కళామతల్లిని సమాజ అభివృద్ధికి మాత్రమే ఉపయోగ పద్ధతుల్లో వినియోగించుకోవాలని సూచించారు. బెట్టింగ్ యాప్ లకు ప్రచారం చేసిన కొందరు సినీ ప్రముఖులపై హైదరాబాద్ లోని మాదాపూర్, పంజాగుట్ట పోలీసులు కేసులు నమోదు చేసిన ఢిల్లీలోని ఆంధ్రా భవన్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన స్పందించారు. సినీ పరిశ్రమ ద్వారా వచ్చిన ఖ్యాతిని అడ్డం పెట్టుకొని డబ్బు సంపాదన వ్యామోహంతో అనైతిక చర్యలకు పాల్పడదాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. బెట్టింగ్ యాప్ ల ను ప్రమోట్ చేయడం ద్వారా యువత జీవితాలను నాశనం చేస్తున్నారని ఆక్షేపించారు. గతంలో అల్లూరి రామలింగయ్య వంటి వారు కళను సమాజ అభి వృద్ధి కి ఉపయోగ పరచారని గుర్తు చేశారు. సినీ పరిశ్రమలో సక్రమంగా వచ్చే సంపాదన ఉన్నవారు కూడా మరింత సంపాదన కోసం సమాజాన్ని పక్కదారి పట్టించే అనేక అనైతిక ప్రకటనల్లో నటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకే తెలియకుండా బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేశామని ఒకరు, చట్ట పరంగా అవకాశం ఉన్నది కాబట్టి చేశామని ఒకరు పేర్కొనడాన్ని తప్పుబట్టారు. మీకు ఉన్న పాపులరిటి కారణంగా మీరు నటించే, ప్రమోట్ చేసే అంశాలను ప్రజలు సులభంగా నమ్మి తీవ్రంగా ఇబ్బంది పడుతున్న విషయాన్నీ గుర్తించాలన్నారు. బెట్టింగ్ యాప్ లకు వేలాది మంది యువత బలి అవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నా వాటిని ఇంకా ప్రమోట్ చేయడం నేరమేనని స్పష్టం చేశారు. ఈ వ్యవాహారం పై ప్రభుత్వం కఠినముగానే చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. గుట్కా, పాన్ మసాలాలు, తప్పుడు పద్ధతుల్లో సాగే రియల్ ఎస్టేట్, మోసపూరిత బంగారు వ్యాపారాల ప్రకటనల్లో నటించి సమాజానికి కీడు చేస్తున్నారని విమర్శించారు.

# వ్యవసాయ రంగానికి మరో రూ.5వేల కోట్లు





తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

అధ్యక్షులు బాగం హేమంతరావు,

ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రతిపాదించిన రూ.24,439 కోట్లు నిధులు స రిపోవని, మరో ర ఊ.5వేల కోట్లు అదనంగా కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఎఐకెఎస్) రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డి మాండ్ చేశారు. గత బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ. 30,748.84 కోట్లు నిధులను కేటాయించిన ప్రభుత్వం రూ. 20, 61 6 కోట్లతో 25,32,067 మందికి రైతులకు రుణమా ఫీ చేసినప్పటికీ రూ. 2 లక్షల లోపు ఉన్న మరికొంతమంది రైతులతో పాటు రూ.2లక్షల పై న బ్యాంకు రుణాలు ఉన్న రై తులు సైతం రుణమా ఫీ కోసం ఆశతో ఎదురుచూస్తున్నారని వీరందకి రుణమాఫీ చేయాల్సిందేనని అన్నారు. కాని, 20 25 26 బడ్జెట్లో రుణమాఫీ ప్రస్తావన లేక పోగా గ త సంవత్సర బడ్జె ట్ కంటే ఈ సంవత్సరం బడ్జెట్ లో రూ.18,101 కోట్లు వ్యవసాయ రంగానికి ని ధులను తగ్గించడం సరైందని కాదని పేర్కొన్నారు.

**మార్కెట్ జోక్యంపథకానికీ నిధులే లేవు :** వ్యవసాయ పంటల కొనుగోలుకు సంబంధించి ధరలు క్షిణించినప్పుడు ప్రభుత్వం తరుపున రైతులను ఆదుకోవడానికి మార్కెట్ జోక్యం పథకం కింద నిధులు కేటాయించాల్సి ఉన్నా ఆ దీశ ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకోకపోవడ అన్యాయమన్నారు. మార్కెట్‌లో ఇటీవల మిర్చి ధర దారుణంగా పడిపోతే మార్కెట్ యార్డ్ లను ముట్టడించిన రైతులు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారన్నారు.. మా ర్కెట్లో పంటలకు దారుణంగా ధరలు పడిపోతే రైతులను ఆదుకోవటానికి ఈ పథకాన్ని అమలు చేస్తూ వస్తున్నారని, ఇందుకు మార్కెట్ జోక్యం పథకానికి విధిగా నిధులను కేటాయించాలని వారు కోరారు.

గత ఏడాది పంటల బీమా పథకానికి, రూ. 981 కోట్లు కేటాయించినట్లుగానే ఈ సంవత్సరం కూడా కేటాయించడం హర్షనీమని, అదేవిధంగా రాష్ట్ర స్థాయి పంటల బీమా పథకాన్ని ఏర్పాటు చేసి పంటల సీజన్ లో బీమా సౌకర్యాన్ని కల్పించాలని రైతు సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. .

**రైతు భరోసాను కౌలు రైతులకు వర్తింప జేయాలి:** రైతు భరోసా కు రూ. 13,603 కోట్ల రూపాయలను కేటాయించారని, ఈ పెట్టుబడి సహాయం (రైతు భరోసా) రైతులతో పాటు 22 లక్షలు గా ఉన్న కౌలు రైతులకు కూడా వర్తింప చేయాలని, కానీ బడ్జెట్‌లో కౌలు రైతుల ప్రస్తావన లేకపోవడం విచారకరం వార పేర్కొన్నారు.. రైతు బీమా కూడా కౌలు రైతులకు వర్తింప చేయటం లేదని, భూమి లేని రైతులకు (ఇందిరమ్మ ఆత్మీయ భరోసా )సంవత్సరానికి రూ. 12వేల ఆర్థిక సహాయం ప్రకటించినప్పటికీ బడ్జెట్ లో మాత్రం రూ.413.52 కోట్లు ను మాత్రమే ప్రతిపాదించారని, ఈనిధులు కేవలం 3.44 లక్షల లబ్ధిదారులకు మాత్రమే సరిపోతాయని తెలిపారు. . రాష్ట్రంలో 34.52 లక్షల మంది గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ కార్మికులు పనిచేస్తున్నారని, వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా అమలు చేయటానికి నిధులను ఏ శాఖ కింద కేటాయించారో స్పష్టత ఇవ్వాలని కోరారు.

**విపత్తు నిధులను కేటాయించాలి :** భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బావులు, బోర్లు ఎండిపోవడం, మరో వైపు ఎండల తీవ్రత పెరిగిపోవడంతో వరి పొలాలకు సాగు నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయని, ఇలాంటి వారికి నష్టపరిహారం చెల్లించాలని రైతులు ఆందోళన చేస్తున్నరన్నారు. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకునే విధంగాప్రకృతి విపత్తు నిధులను కేటాయించాలన్నారు. అదేవిధంగా బడ్జెట్లో కౌలు రైతులను, వ్యవసాయ కార్మికులను నిర్లక్ష్యం చేశారని, వ్యవసాయ రంగానికి ఆదుకునేవిధంగా ఈ రంగానికి అదనంగా మరో రూ.5 వేల కోట్లను కేటాయించాలని హేమంతరావు, పశ్య పద్మ డిమాండ్ చేశారు.

## కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు

**న్యూఢిల్లీ :** ఆర్టికల్ 370 రద్దుతో 'ఒకే రాజ్యాంగం ఒకే జెండా' అనే రా జ్యాంగ నిర్మాతల కలను మోదీ ప్రభు త్వం నెరవేర్చిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద దాడులు తగ్గిపోయాయని.. అక్కడ ఇప్పుడు సాధారణ పరిస్థితులు నెలకొంటున్నట్లు చెప్పారు. రాజ్యసభలో హోంశాఖ పనితీరుపై జరిగిన చర్చ సందర్భంగా షా మాట్లాడారు. ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానం అనుసరిస్తున్నట్లు చెప్పారు.జమ్ముకశ్మీర్‌లో ఉగ్రఘటనలు గణనీయంగా తగ్గుము ఖం పట్టాయి. 2004 –2014 మధ్య ఈ ప్రాంతంలో 7,217 ఉగ్రవాద సం ఘటనలు జరిగాయి. 2014 నుంచి 2024 మధ్య ఆ సంఖ్య 2,242కి తగ్గింది. మోదీ పాలనలో కశ్మీర్‌లో ఉ గ్రవాదం వల్ల మరణాలు 70 శాతం తగ్గాయి. ఉగ్రవాదాన్ని జీరో టాలరెన్స్ విధానంతో కఠినంగా అణచివేశాం. 2026 మార్చికల్లా నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తాం. ఉగ్రఘటనలే కాకుం డా రాళ్ల దాడులు కూడా తగ్గాయి. కశ్మీర్ యువకులు ఉద్యోగాలు చేసుకుంటున్నారు. 2019 నుంచి 2024 వరకూ యువతకు 40 వేల ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య కూడా పెరిగింది. జమ్ము కశ్మీర్‌లో ఇప్పటికే రూ.12,000 కోట్ల విలువలైన పెట్టుబడులు వచ్చాయి. రూ.1.1 లక్షల కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు జరిగాయి. ఇప్పుడు కశ్మీర్‌లో సాయంత్రం పూట కూడా సినిమా హాళ్లు తెరిచే ఉంటున్నాయి' అని అమిత్ షా తెలిపారు.

**డాక్యుమెంట్స్ పోయినవి**

హనుమకొండ జిల్లా వేలేరు మండలములోని పీచర గ్రామ శివారులోని వేములకుంట తండాకు చెందిన **బానోతు లాలు, తండ్రి పంతులు** గారికి సంబంధించిన పట్టాపాస్ బుక్కు గత జనవరి నెలలో బానోతు లాలు పీచర నుండి హనుమకొండకు బస్‌లో ప్రయాణం చేయుచుండగా భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ పట్టా పాస్ బుక్ పోయినది. పట్టా పాస్‌బుక్ నెంబర్ **T21100030974**, ఖాతా నెం 1261 గల పాస్ బుక్ దొరికిన వారు ఈక్రింది అడ్రస్‌లో ఇవ్వగలరని మనవి.

ఇట్లు- బానోతు లాలు, తండ్రి : పంతులు

గ్రామం: పీచర, వావిల్లకుంట తండ ,

ఇంటి నెంబరు: 8-9, మండలం :

వేలేరు, జిల్లా : హనుమకొండ,

పిన్ కోడ్ నెంబర్ - 506145,

ఫోన్ నంబర్ : 7075059046.

**IN THE COURT OF HON'BLE PRINCIPAL DISTRICT JUDGE AT NIZAMABAD.**

**G.W.O.P.NO. 2 OF 2025**

*(In the matter of Guardians and Wards Act, 1890)*

Between:

**RAYANAVENI SHANKAR, S/o. Late Gangaram,** Age: 56 years, occ: Private Employee, R/o. Raikal (v&m) Present residing at H.No: 9-8-210, Quilla Road, Gajulpet, Nizamabad city and Mandal, District Nizamabad.

...**Petitioner**

And

1. The Assistant Provident Fund Commissioner, Sub Regional Provident Fund Office, Nyalkal Road, Nizamabad
2. M/s Sable waghire & co Pvt Ltd Beedi Company, Shivaji Nagar, Nizamabad city and Mandal, Nizamabad District
3. To whom so ever it may concern

...**Respondents**

To,

**Whom so ever it may concern,**

Whereas the above named petitioner has applied to the Court for his appointment as Guardian to the Minor viz. Bejjarapu Hamsika D/o. Late Bejjarapu Bhoomaiah who is the daughter of the deceased Late Smt. L.G.Renvena (Laxmi bai Gangaram Renvena - As per P.F.Record) @ Ramanavena Laxmi Bai (As per Bidi Company) @ Bejjarapu Laxmi (As per Aadhar Card)for obtaining the P.F.& Service Benefits, Orphan Pensions, other legal dues and benefits under P.F Account No. AP/5206/28383 lying with the Respondents no 1 & 2 pertaining to the deceased Late Smt. L.G.Renvena @ Ramanavena Laxmi Bai @ Bejjarapu Laxmi.

If anybody or concern has any objection or claim they may approach the Hon'ble Court on **02-04-2025 at 10.30 a.m.** and put forth their objections, claims etc., with documentary proof, otherwise the matter will be decided on merits.

// By order of the Hon'ble Court //

**G.RAMESH,**

**BASA PAVAN PRASAD**

CELL. 9985574766,

Counsels for the petitioners

## వివేకా హత్య కేసులో సిబిఐకి నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు విచారణ జాప్యం అవుతోందంటూ వివేకా కూతురు సునీతరెడ్డి వేసిన పిటిషన్‌లో హైకోర్టు సీబీఐకి నోటీసులు ఇచ్చింది. సిబిఐ కోర్టు విచారణ 6 నెలల్లో పూర్తి చేసేలా ఆదేశాలివ్వాలనే కేసులో సీబిఐ, ఆకేసులో నిందితులు ఎంపీ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి ఇతరులకు నోటీసులు ఇచ్చింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

## బిపి ఆచార్యకు భారీ ఊరట

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జగన్ ఆస్తుల కేసుల్లోని లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు భూమి కేటాయింపు, నిధుల అక్రమ మళ్లింపు జరిగాయనే కేసులో నిందితుడిగా ఉన్న ఐఎస్ఎస్ అధికారి బిపి ఆచార్యకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఏపీఐఐసీ వైస్ చైర్మన్, ఎండీగా ఉండగా నిబంధనలను ఉల్లంఘించారని ఈడీ పెట్టిన కేసును డిస్మిస్ చేస్తూ తీర్పు చెప్పింది. సీఆర్పీసీ సెక్షన్ 197(1) కింద రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకున్నాకే ఆఫీసర్లను ప్రాసిక్యూట్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని పిటిషనర్ వాదనను ఆమోదించింది. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఈడీ కేసు విచారణ చేయాలంటే రాష్ట్రప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిందేనని చెప్పింది.

## మొహంతి కేడర్ బదిలీపై కేంద్రానికి నోటీసు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏపీ కేడర్‌లో బాధ్యతలు స్వీకరించడానికి అభిషేక్ మొహంతికి ఈనెల 24వరకు పొడిగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈలోగా కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) ఆదేశాలతో అభిషేక్ మొహంతిని తెలంగాణ కేడర్‌లోకి తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 171ను పరిగణనలోకి తీసుకుని ఉత్తర్వులు జారీ చేశారో లేదో చెప్పాలంటూ కేంద్రాన్ని ఆదేశించింది. తెలంగాణాలో కొనసాగించాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ ఏపీ కేడర్‌లో బాధ్యతలు స్వీకరించాలంటూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ అభిషేక్ మొహంతి ఇటీవల క్యాట్‌ను ఆశ్రయించగా స్టే ఇవ్వడానికి నిరాకరించడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ ఇ.తిరుమలాదేవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు పిటిషనర్ సమర్పించిన వినతి పత్రాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, ఖండేల్కర్ కమిటీ సిఫారసు మేరకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వాదనలను విన్న ధర్మాసనం పిటిషన్‌పై తేలేదాకా ఇప్పటికిప్పుడు ఏపీకి వెళ్లాల్సిన అవసరం ఉందా, అప్పటిదాకా తెలంగాణలో కొనసాగిస్తుందా లేదా అన్న విషయాలపై వివరణ ఇవ్వాలంటూ విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది.

## బండి సంజయ్‌పై కేసు డిస్మిస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా 2020లో నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టేలా ప్రసంగించారంటూ సికింద్రాబాద్ మార్కెట్ పోలీసు స్టేషన్‌లో బండి సంజయ్‌పై కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు జరిపిన పోలీసులు అభియోగ పత్రం దాఖలు చేయగా ప్రస్తుతం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఆ కేసు పెండింగ్‌లో ఉంది. దీన్ని కొట్టివేయాలంటూ బండి సంజయ్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మ ణ్ తాజాగా విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసులు అసత్యాలతో కేసు నమోదు చేశారనా, పోలీసుల దర్యాప్తు మొక్కుబడిగా ఉందని, సాక్షుల వాంగ్మూలాల్లో ఒకదానికొకటి పొంతన లేదన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి పిటిషనర్‌పై మోపిన అభియోగాలకు సరైన కారణాలు లేవంటూ బండి సంజయ్‌పై ఉన్న కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## పది పరీక్షల్లో గందరగోళం

రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైన పరీక్షలు

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సీరియస్



**ప్రజపక్షం/మంచిర్యాల ప్రతినిధి:** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పది పరీక్షలు జిల్లా విద్యా శాఖ అధికారి నిర్లక్ష్యం కారణంగా రెండు గంటలు ఆలస్యమయ్యాయి. తెలుగు పరీక్ష పత్రాలకు బదులుగా హిందీ పరీక్ష ప్రశ్నపత్రాల బెండెల్ రావడం గందరగోళానికి దారితీసింది. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హుటాహుటిన పరీక్షా కేంద్రానికి వెళ్లి ఆలస్యానికి గల కారణాలను ఆరాతీశారు. అక్కడే ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి విషయంలో వివరణ ఇస్తూ, తప్పిదం అనుకోకుండా జరిగిందని సమర్థించుకున్నారు. అధికారుల నిర్లక్ష్య ధోరణిపై కలెక్టర్ కుమార్ దీపక్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గందరగోళాన్ని సర్దుబాటు చేసేందుకు అధికారులు వెంటనే సరైన ప్రశ్నపత్రాలను విద్యార్థులకు అందజేసి పరీక్షలను ప్రారంభించారు. ఉదయమే పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు గంటల తరబడి ఎదురుచూడాల్సి రావడంతో, వారికి స్నాక్స్ అందజేసిన అనంతరం పరీక్షలు నిర్వహించారు. ఘటనపై విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో విద్యాశాఖ మొదటినుండి నిమ్మకు నీరెత్తినట్టే వ్యవహరిస్తోందని, నేటి పరీక్షల నిర్వహణ ఆ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని, విద్యార్థుల భవిష్యత్‌తో అధికారులు ఆటలాడటం తగదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పరీక్షకు సరైన ప్రశ్నపత్రాలను ముందుగానే అందించాల్సిన బాధ్యత అధికారులదేనని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనల నేపథ్యంలో ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఏమేరకు చర్యలు తీసుకుంటారో చూడాలి.

## పరీక్షా కేంద్రంలో ఫిట్స్‌తో పడిపోయిన విద్యార్థి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** పది పరీక్షల ప్రారంభం రోజునే ఓ విద్యార్థి ఫిట్స్‌తో పరీక్ష కేంద్రంలో పడిపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం పరీక్ష కేంద్రంలో ఓ విద్యార్థి ఫిట్స్‌తో పడిపోయాడు. రాయగూడెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బోయిన ధనుష్ అనే విద్యార్థి పది పరీక్షలు వ్రాసేందుకు శుక్రవారం చెరువుమాధారం పరీక్ష కేంద్రంకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లిన అరగంటలోనే ఒక్కసారిగా ఫిట్స్ రావటంతో కేంద్రంలోనే పడిపోయాడు. దీంతో విద్యార్థులు, ఇన్విజిలేటర్స్ ఆందోళనకు గురయ్యారు. స్థానికంగా ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం 108 ద్వారా నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్‌కు తరలించారు. వైద్యాధికారి డాక్టర్ రాజేష్ వైద్య సేవలు అందించారు. కానీ ఉపాధ్యాయులు పరీక్ష ఉన్నందును పంపించాలని కోరటంతో సెలైన్ బాటిల్ ద్వారా విద్యార్థిని తిరిగి పరీక్ష కేంద్రానికి పంపించారు. సదరు విద్యార్థి పరీక్ష రాసిన అనంతరం తిరిగి హాస్పిటల్‌కు వచ్చి మరోమారు వైద్య పరీక్షలు చేయించారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, ఎంపిడిఓ యం.ఎర్రయ్య విద్యార్థిని పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శాఖ సిబ్బంది తప్పకుండా ఉండాలని ఆయన ఆదేశించారు. మండలంలోని మొత్తం 456మంది విద్యార్థులకు గాను 454 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

# సిఎంతో నాబార్డ్ చైర్మన్ షాజీ కెవి భేటీ

ఆర్ఐడిఎఫ్ కింద తక్కువ వడ్డీకి రుణాలు అందించాలని కోరిన సిఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్ఐడిఎఫ్ కింద తక్కువ వడ్డీకి రుణాలు అందిచాలని, మైక్రో ఇరిగేషన్‌కు నిధులు ఇవ్వాలని సిఎం ఎ.రేవంత్‌రెడ్డి నాబార్డ్ చైర్మన్ షాజీ కెవిని కోరారు. అసెంబ్లీలోని సిఎం కార్యాలయంలో నాబార్డ్ చైర్మన్ షాజీ కెవి మర్యాదపూర్వకంగా సిఎంను కలిసి భేటీ అయ్యారు. కోఆపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాలని, కొత్తగా మరిన్ని కోఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయాలని నాబార్డు చైర్మన్‌కు సిఎం విజ్ఞప్తి చేశారు. స్వయంసహాయక సంఘాల మహిళా గ్రూపులకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలని, ఐకేపీ, గోడౌన్స్, రైస్ మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేసి రాష్ట్రంలో మిల్లింగ్ కెపాసిటీ పెంచేందుకు సహకరించాలని కోరారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు స్కీమ్స్ నిధులు మార్చ్ 31 లోగా ఉపయోగించుకోవాలని అధికారులకు సిఎం సూచించారు. నాబార్డు పరిధిలోని స్కీములన్నింటినీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీలైనంత ఎక్కువ ఉపయోగించుకోవాలన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు అందించే సోలార్ ప్లాంట్స్ నిర్వహణను నాబార్డుకు అనుసంధానం చేయాలని సూచించారు. కొత్త గ్రామపంచాయతీలకు రూరల్ కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కొత్త జిల్లాల్లో కొన్ని డిసిసిబిలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి నాబార్డు చైర్మన్ ప్రతిపాదించారు. ఈ సమావేశంలో నాబార్డు ప్రతినిధులతోపాటు తాండూరు ఎంఎల్ఎ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

# న్యాయవాదుల భద్రతకు చట్టం

శాసనసభలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటన



(ఫైల్)

**ప్రజాపక్షం/హైదరాబాద్:** న్యాయవాదులు వామనరావు దంపతుల దారుణ హత్య నేపథ్యంలో న్యాయవాదుల భద్రత కోసం చట్టాన్ని తీసుకురానున్నట్టు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శాసనసభలో ప్రకటించారు. న్యాయవాదులపై దాడులు జరుగుతున్న క్రమంలో వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో 19,830 మంది న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులు మొత్తం 55,000 మందికి రూ.2 లక్షల పరిమితితో హెల్త్ కార్డులు, రూ.10 లక్షల ప్రమాద బీమాను కల్పిస్తున్నామని వెల్లడించారు. నూతన హైకోర్టు భవన నిర్మాణానికి సిఎం రేవంత్ రెడ్డి 100 ఎకరాల స్థలం కేటాయించారని, నూతన హైకోర్టు, న్యాయమూర్తుల నివాస సముదాయాల నిర్మాణానికి రూ.2600 కోట్లు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. న్యాయవాదులు, గుమాస్తాల సంక్షేమ నిధి స్టాంప్ విలువలను రూ.100ల నుంచి రూ.250 వరకు పెంచేందుకు ఉద్దేశించిన 'న్యాయవాదుల సంక్షేమ నిధి, న్యాయవాదుల గుమస్తాల సంక్షేమ నిధి,' సవరణకు సంబంధించిన రెండు వేర్వేరు బిల్లులను' శాసనసభ, శాసనమండలి ఉభయ సభలు శుక్రవారం ఆమోదించాయి. ఈ రెండు బిల్లులను ఉభయ సభలలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టగా చర్చ అనంతరం ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. తొలుత శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు బిల్లును ప్రవేశపెడుతూ బిల్లు ఉద్దేశాలను వివరించారు. న్యాయవాదుల జీవి త భాగస్వాములతో పాటు రిటైర్ట్ అయిన తర్వాత న్యాయవాదులను ఆదుకునే లక్ష్యంతో ఈ రెండు చట్టాల సవరణ బిల్లులను తీసుకొచ్చినట్టు వివరించారు. ప్రతి కేసుకు గతంలో ఉన్న రూ.100లను టికెట్ ధరను రూ.250లకు పెంచుతున్నామని, ఇందులో రూ.215లను న్యాయవాదుల సంక్షేమ నిధికి, మిగిలిన రూ.35లను గుమాస్తా నిధిలో జమ చేస్తారని వివరించారు.

**న్యాయవాదులకు హెల్త్ కార్డులు, పిఎఫ్, ఇంటి సౌకర్యాన్ని కల్పించాలి: కూనంనేని**

చర్చలో సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు పాల్గొంటూ న్యాయవాదులకు హెల్త్‌కార్డులను ఇవ్వాలని, ఇళ్లు, పిఎఫ్, సౌకర్యంతో పాటు వయోపరిమితిని నిర్ణయించి, వారికి పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని, వారి పిల్లల చదవు నిమిత్తం ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు. ఈ చట్టం చాలా మంచిదన్నారు. శాసనసభలో సభ్యులంతా చట్టం చేసేవారని, దానిని పరిరక్షించే న్యాయవాదులు చట్టసభలకు అనుసంధానం అని అన్నారు. వారి సంక్షేమం కోసం తీసుకొచ్చిన సవరణ బిల్లును సిపిఐ సంపూర్ణంగా బలపరుస్తుందని తెలిపారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎ వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమ నిధికి సంబంధించి రూ.100 కోట్లను కేటాయించిందని, , కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మరో రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. బిల్లుపైన జరిగిన చర్చలో కాంగ్రెస్ ఎంఎల్ఎ జి.మధుసూదన్‌రెడ్డి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ కాలేరు వెంకటేశం, బిజెపి ఎంఎల్ఎ పాయల శంకర్ పాల్గొన్నారు.

# అవసరమైన సహాయక చర్యలు

వడగళ్ల వాన నేపథ్యంలో జిల్లా యంత్రాంగానికి సిఎస్ శాంతికుమారి ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో శుక్రవారం వడగళ్ల వాన కురిసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయక చర్యలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో కురిసిన వడగళ్ల వాన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లతో శుక్రవారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితులను సమీక్షించారు. వడగళ్ళ వాన వల్ల నెలకొన్న పరిస్థితులను అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు. జిల్లా యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయక చర్యలు అందించాలన్నారు. రానున్న 48 గంటలలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని సూచన ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని సిఎస్ ఆదేశించారు. జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిఎస్ సూచించారు. అకాల వర్షాల వల్ల ఏర్పడే నష్టాల అంచనాలను ఏప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు అందించాలని సూచించారు.

# ఆప్‌లో సంస్థాగత మార్పులు



**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీలో (ఆప్) శుక్రవారం సంస్థాగత పునర్వ్యవస్థీకరణ మార్పులు జరిగాయి. మాజీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఢిల్లీ యూనిట్ అధ్యక్షుడిగా, సీనియర్ నాయకుడు మనీష్ సిసోడియా పంజాబ్ ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. ఆప్ స్వస్థలమైన ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన నెల రోజుల తరువాత పార్టీలో సంస్థాగతంగా మార్పులు జరగడం గమనార్హం. కాగా, గోపాల్ రాయ్ స్థానంలో భరద్వాజ్ నియమితులవుతుండగా, సిసోడియా ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రమైన పంజాబ్‌కు బాధ్యత వహించనున్నారు. పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో జరిగిన ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఎసి) సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. కొత్త బాధ్యతలు చేపట్టే వారికి కేజ్రీవాల్ ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. పిఎసి సమావేశం తర్వాత ఆప్ జనరల్ సెక్రటరీ (ఆర్గనైజేషన్) సందీప్ పాఠక్ మాట్లాడుతూ గోపాల్ రాయ్ ఇప్పుడు గుజరాత్‌కు ఇన్‌ఛార్జ్‌గా ఉంటారని, అక్కడ పార్టీ మరింతగా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. రాజ్యసభ ఎంపి పాఠక్‌ను ఆప్ ఛత్తీస్‌గఢ్ యూనిట్‌కు ఇన్‌ఛార్జ్‌గా నియమించగా, పంకజ్ గుప్తా గోవా పార్టీ వ్యవహారాలకు నాయకత్వం వహిస్తారు. పంజాబ్, గుజరాత్, గోవా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు రెండేళ్లలో జరగనున్నాయి. ఆప్ జమ్ముకశ్మీర్ యూనిట్‌కు కొత్త చీఫ్‌గా మెహ్రాజ్ మాలిక్ నియమితులయ్యారు. పంజాబ్‌కు సత్యేంద్ర జైన్, గుజరాత్‌కు దుర్గేష్ పాఠక్ సహా గోవాకు అంకుష్ నారంగ్, అభాష్ చందేలా, దీపక్ సింగ్లాతో పాటు రాష్ట్ర యూనిట్లకు పార్టీ కోఇన్‌చార్జులను కూడా నియమించింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కు దాదాపు 43.5 శాతం ఓట్లు వచ్చాయని, ఇది బిజెపి కంటే కేవలం రెండు శాతం తక్కువ అని భరద్వాజ్ అన్నారు. ఈ పరిస్థితుల్లో కూడా ఢిల్లీలో సగం మంది ఆప్‌కు ఓటు వేశారని ఆయన విలేకరులతో అన్నారు. బిజెపికి ఓటు వేసిన వారితో పాటు, ఆప్‌ను బలోపేతం చేసిన వారిని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఢిల్లీ యూనిట్ కొత్త ఆప్ చీఫ్ మాట్లాడుతూ విజయం సమయంలో చాలా మంది పార్టీలో చేరినందున ఓటమి తర్వాత సంస్థాగత నిర్మాణం సులభమని, కానీ ఓటమిలో కూడా కలిసి ఉండేవారు స్వచ్ఛమైన బంగారం అని అన్నారు. తాము ర్టీని బలోపేతం చేస్తామని సంస్థాగతంగా సంస్థాగతంగా విస్తరిస్తామని చెప్పారు.

## తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బహిరంగ విచారణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యుత్ షాక్‌తో చనిపోయిన రైతులకు నష్టపరిహారం సకాలంలో అందడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. టిజిఎస్‌పిడిసిఎల్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేయబడిన ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్–సబ్సిడీ సర్–చార్జీల ప్రతిపాదనపై ఇఆర్‌సి చైర్మన్ జస్టిస్ డి.నాగార్జున ఆధ్వర్యంలో బహిరంగ విచారణ శుక్రవారం జరిగింది.

విచారణకు టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్, రైతు కమిషన్ సభ్యురాలు భవానీ రెడ్డి, విద్యుత్ రంగ సంస్థ అధికారులు, రైతులు, విద్యుత్ వినియోగదారులు హాజరయ్యారు. విద్యుత్ సప్లైలో ఎదురవుతున్న సమస్యలు, కరెంట్ చార్జీలు, అధికారుల నిర్లక్ష్యం, కరెంట్ షాక్‌లతో చనిపోతున్న రైతులు, కరెంట్ కోతలపై ఇఆర్‌సి చైర్మన్ జస్టిస్ డి.నాగార్జున్‌కు రైతులు, వినియోగదారులు వివరించారు. జాతీయ రహదారులపై వీధిదీపాలు సరిగ్గా ఉండడం లేదని దాని కారణంగా ప్రమాదాలు జరుగుతున్నట్లు జస్టిస్ దృష్టికి పలువురు తీసుకువచ్చారు.

## ఘనంగా అన్నపూర్ణయ్య స్మారక అవార్డు, పురస్కారాల ప్రదానోత్సవం



**రాజమహేంద్రవరం:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, పాత్రికేయుడు, ఆంధ్రనేతాజీ మద్దూరి అన్నపూర్ణయ్య త్యాగధనుడని రుడా మాజీ చైర్మన్, మాజీ శాసన సభ్యులు రౌతు సూర్యప్రకాశరావు, వర్తక ప్రముఖులు అశోక్ కుమార్ జైన్ నివాళులర్పించారు. ఇటువంటి మహనీయుల గురించి నేటి తరం తెలుసుకోవడమే కాదు, ఎంతో నేర్చుకోవాలన్నారు. మద్దూరి అన్నపూర్ణయ్య 126వ జయంతిని పురస్కరించుకుని మద్దూరి అన్నపూర్ణయ్య సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రాజమండ్రిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముందుగా స్థానిక జండాపంజారోడ్‌లో గల శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్య పార్కులో అన్నపూర్ణయ్య విగ్రహానికి పూలమాలలు వేసి భక్త్యంజలి ఘటించారు. అనంతరం స్థానిక ప్రకాశం నగర్ పోలీసు స్టేషన్ ప్రక్కన ధర్మంచర కమ్యూనిటీ హాలు పైన బుక్ బ్యాంకులో జయంతి సభ నిర్వహించారు. సమితి గౌరవ అధ్యక్షులు అయిన రౌతు సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ అన్నపూర్ణయ్య లాంటి మహనీయులను సదా స్మరించాలన్నారు. ఈసందర్భంగా అన్నపూర్ణయ్యబ్ జీవితానికి సంబందించిన కీలక ఘట్టాలతో అన్నపూర్ణయ్య స్మారక అవార్డు గ్రహీత శ్రీపాద శ్రీనివాస్ రూపొందించిన బ్రోచర్‌ని రౌతు, జైన్ ఆవిష్కరించి, శ్రీపాదను అభినందించారు. రిటైర్డ్ హెడ్ మాస్టారు వెన్నపు వీరభద్రరావుని శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్య స్మారక అవార్డుతో సత్కరించారు. శ్రీపాద శ్రీనివాస్ తాను రచించిన సన్మాన పత్రం అందజేసారు.

## అమెరికాతో సంప్రదింపులు జరుపుతున్నాం : భారత్

**ఢిల్లీ:** భారత్ అధిక సుంకాలు విధిస్తోందని, ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు తప్పవంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుంకాలు సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నామని భారత్ పేర్కొంది. ఇరువురికీ ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం కోసం ఓ ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనకు అమెరికాతో సంప్రదింపులు చేస్తున్నామని తెలిపింది. ట్రంప్ సుంకాల విధింపునకు మరో 11 రోజులే గడువున్న నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ ఈ విధంగా స్పందించింది. పరస్పరం ప్రయోజనం చేకూరే వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా యంత్రాంగంతో వివిధ స్థాయిల్లో సంప్రదింపులు జరుపుతున్నాం. వీటిని ముందుకు తీసుకెళ్లే ప్రక్రియలో ఇరు దేశాలు నిమగ్నమై ఉన్నాయి. ద్వైపాక్షిక ఒప్పందానికి అవసరమైన ఫ్రేమ్‌వర్క్ రూపొందించడంపై రెండు ప్రభుత్వాలు చురుకుగా పని చేస్తున్నాయి. వాణిజ్యాన్ని విస్తరించడం, మార్కెట్ యాక్సెస్ సుంకాల తగ్గింపు, సప్లైచైన్ సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఇవి కొనసాగుతున్నాయి అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు.

అయితే, ట్రంప్ హెచ్చరికలకు అనుగుణంగా భారత్ టారిఫ్‌లను తగ్గిస్తుందా? అన్న ప్రశ్నకు మాత్రం రణ్‌ధీర్ నేరుగా సమాధానం ఇవ్వలేదు. చర్చలు కొలిక్కి వచ్చే వరకు వేచి చూడాల్సిందేనని అన్నారు. అంతకు ముందు రోజు ఇదే అంశంపై డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. అమెరికా ఎగుమతులపై సుంకాలను భారత్ తగ్గిస్తుందనే నమ్ముతున్నానని అన్నారు. ఆ దేశంతో మంచి సంబంధాలే ఉన్నాయని.. అయినా ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలను విధించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ యంత్రాంగంతో సంప్రదింపులు చేస్తున్నట్లు భారత్ పేర్కొంది.

## విషాదాన్ని దిగమింగి పరీక్షా కేంద్రానికి వెళ్లిన విద్యార్థిని

**ప్రజాపక్షం/కన్నెపల్లి/మంచిర్యాలప్రతినిధి:** ఒకానొకరి జీవితంలో దుఃఖం, బాధలు మోయలేని భారమవుతాయి. కానీ కొన్ని సందర్భాల్లో ఆ బాధలే మనిషిని మరింత బలంగా మార్చుతాయి. కన్నెపల్లి మండలంలోని ముత్తాపూర్‌కు చెందిన మంచర్ల శ్రీలత తండ్రి మృతి పుట్టెడు దుఃఖాన్ని మోస్తూనే తన చదువుపై ఉన్న నిబద్ధతతో పరీక్షా హాలులో కూర్చొని సమాధానాలు రాయడమే కాదు, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచింది. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శ్రీలత తండ్రి మంచర్ల మల్లయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. మరుసటి రోజునే పదో తరగతి పరీక్షలు ఉండటంతో ఆమె తీవ్ర విషాదాన్ని దిగమింగి తండ్రి అంత్యక్రియలు జరుగుతున్న నేపథ్యంలోనే తెలుగు పరీక్ష రాయడానికి హాజరైంది. ఆమె మనోధైర్యం చూసి పలువురు కంటతడి పెట్టారు. ఈ సంఘటనతో శ్రీలతకు ఉన్న పట్టుదల, చదువుపై అభిరుచి చూసి మండల విద్యాధికారి రాము, ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆమెను అభినందించారు. తండ్రిని కోల్పోయినా భవిష్యత్ మీద ఉన్న నమ్మకాన్ని కోల్పోకుండా ముందుకు సాగుతున్న శ్రీలత నిజమైన పోరాట యోధురాలని గ్రామస్థులు ప్రశంసించారు.

# రైతుభరోసా, రుణమాఫీ సంపూర్ణంగా అమలుచేయాలి

రైతు సంఘం నేతలు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు





**ప్రజాపక్షం/ఖమ్మం :** వ్యవసాయం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావులు తెలిపారు. వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపులు మొదలు సబ్సిడీల వరకు కోత విధిస్తున్నారని వారు ఆరోపించారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోవిందరావు మాట్లాడుతూ జగత్‌జిత్ సింగ్ దలైవాల్ నిరాహార దీక్ష శిబిరాన్ని బలవంతంగా తొలగించి ఆయనను అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. మద్దతు ధర కల్పన కోసం జరుగుతున్న ఆందోళనను అణిచివేస్తూ మోడీ కార్పొరేట్ అనుకూల ప్రతినిధిగా పని చేస్తున్నారన్నారు. మిర్చి ధర రోజు రోజుకు పతనమవుతుందని, సాగు విస్తీర్ణం దృష్ట్యా ఖమ్మంలో మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఖమ్మంజిల్లా 1.14 లక్షల ఎకరాలలో మొక్కజొన్న పంట సాగుచేశారని మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని గోవిందరావు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం మిర్చి పండించడంలో దేశంలోనే రెండవ స్థానంలో ఉందని, ప్రతి యేటా మిర్చి రైతులు నష్టపోతున్నారని వాస్తవ పరిస్థితులను,పెట్టుబడులను పరిగణలోకి తీసుకుని మిర్చి క్వింటాకు రూ.25వేలు నిర్ణయించాలని గోవిందరావు డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ రెండు లక్షలు చేస్తామని హామీ ఇచ్చి 50 శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. వెంటనే మొత్తం రుణమాఫీని పూర్తి చేయాలన్నారు. రైతు భరోసా రూ. 15వేలు ఇవ్వాలని ప్రతి రైతుకు రైతు భరోసాను వారి వారి ఖాతాల్లో జమ చేయాలని ఆయన కోరారు. ధాన్యం బోనస్‌కు సంబంధించి ఖమ్మంజిల్లాలో రూ.64కోట్ల బకాయిలున్నాయని వాటిని విడుదల చేయాలని కోరారు. రైతుబీమాను రూ. 10లక్షలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేయాలని, 55 సంవత్సరాలు దాటిన రైతులకు నెలకు రూ. 10వేల పెన్షన్ ఇవ్వాలని గోవిందరావు కోరారు. మోడీ ప్రభుత్వం ఇస్తున్న కిసాన్ సమ్మాన్ యోజన రైతులకు ఏ మాత్రం ఉపయోగపడటం లేదని కిసాన్ సమ్మాన్ యోజనను రూ.20 వేలకుపెంచి రెండు దఫాలలో జమ చేయాలని మహాసభలో తీర్మానించినట్లు ఆయన తెలిపారు. పంటల బీమా, ధాన్యం కొనుగోలుతో పాటు బహిరంగ మార్కెట్‌కు అనుగుణంగా భూసేకరణ జరిపేందుకు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వనున్నామన్నారు. సీతారామ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని, బిబిసిపై వారబంధీ ఎత్తివేయాలని మహాసభలో తీర్మానించినట్లు ఆయన తెలిపారు. మహాసభకు 545 మంది ప్రతినిధులు హాజరయ్యారని ఆయన తెలిపారు. నిజామాబాద్‌లో ఈనెల 25, 26, 27 తేదీలలో రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని మహాసభకు జిల్లా నుంచి 50 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో రైతు సంఘం నాయకులు మిడికంటి చిన్నవెంకటరెడ్డి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బాగం ప్రసాద్, బానోత్ రవి తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే ఇంట్లోకి దూరి చైన్ స్నాచింగ్

**ప్రజాపక్షం / కొడంగల్ :** పట్టపగలే ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ కండ్లలోకి మత్తు చల్లి ఆమె మెడలో ఉన్న బంగారు అభరణాలను అపహరించిన ఘటన బోంరాస్‌పేట మండల పరిధిలోని తుంకిమెట్లలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు తుంకిమెట్ల గ్రామానికి చెందిన వడ్ల సుష్మిత మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉంటు ఇంటి పనులు చేస్తున్న క్రమంలో అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి వచ్చి ఆకస్మాత్తుగా కండ్లలోకి మత్తు స్ప్రే చేయడంతో కళ్లు కనిపించకుండా పోయాయి. దీంతో అతడు ఎవ్వరో కూడా గుర్తుపట్టే పరిస్థితి లేకపోవడంతో ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కెళ్లి పోయాడని కన్నీరు మున్నీరై చెప్పారు. జరిగిన విషయాన్ని సుష్మిత తన భర్త వడ్ల శేఖరచారికి చెప్పడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు ప్రజలకు పలు సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. మధ్నాహం సమయంలో గాని, ఒంటరిగా ఉన్న సమయంలో గాని గుర్తు తెలియని వ్యక్తులు వస్తే జాగ్రత్తగా ఉండాలని ఎలాంటి అనుమానాలు వచ్చిన వెంటనే 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సిఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 69 సెంటర్లలో ప్రారంభం కాగా వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ బాలికలు, సెంట్ అనంతోనీ హైస్కుల్ ,సంఘం లక్ష్మి బాయి, బాలికలు పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. మొత్తం విద్యార్థులు 1892 కాగా ఇందులో 60మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు త్రాగునీరు, విద్యుత్, వైద్యసదుపాయాలు కల్పించాలని అదేశించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని అదేశించారు.



## ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**ప్రజాపక్షం/అల్వాల్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాయకురాలు కోమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ పిలుపుమేరకు జిల్లాలోని అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆశాలకు 26 వేల కనీస వేతనం ఇవ్వాలని, ఆశాలను మూడవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రమాద బీమా, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు మంజుల రాజకుమారి, ఎంజి సుగుణ, తదితరు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతం : 161 మంది గైర్హాజరు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మేడ్చల్ జిల్లాలో శుక్రవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 230 పరీక్షా కేంద్రాల్లో 47 వేల 329 మంది రెగ్యులర్, 140 మంది ప్రయివేట్ విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 47 వేల 195 మంది రెగ్యులర్,113 మంది ప్రయివేట్ విద్యార్థులు తొలి రోజు పరీక్షలు రాయగా 161 మంది గైరాజరయ్యారన్నారు.

## ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యం

**ప్రజాపక్షం/అల్వాల్ :** తమ కుమార్తెలు రెండు రోజుల నుండి కనబడటం లేదని మచ్చ బొల్లారం డివిజన్ కు చెందిన బాలికల తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంస్టాగ్రామ్ లో పరిచయమైన ఇద్దరు యువకులు, బాలికలు కలిసి ఓయో రూంలో గడిపినట్లు పోలీసులు గుర్తించారు. ఒకరు ఇసిఐఎల్‌కు, మరొకరు దమ్మాయిగూడకు చెందిన వారుగా సమాచారం తెలిపారు. కిడ్నాప్ ఫోక్స్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## న్యాయ సేవాధికార సంస్థ సహకారంతో హాల్ టికెట్ అందుకున్న విద్యార్థి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** పదవ తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కూకట్‌పల్లి ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థి తన స్కూల్ మొత్తం ఫీజు రూపాయలు 50 వేలు కాగా అందులో 28 వేల 500 రూపాయలు చెల్లించగా మిగిలిన పీజు 21 వేల 500 రూపాయలు చెల్లించకపోవడంతో స్కూల్ యాజమాన్యం 20వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు హాల్‌టికెట్ ఇవ్వలేదు. విద్యార్థి తల్లిదండ్రులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అప్లికేషన్ పెట్టుకోగా దానికి స్పందించి సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్ స్కూల్ యాజమాన్యానికి ఫోన్ చేసి హాల్ టికెట్ ఇవాల్సిందిగా ఆదేశాలు జారీ చేసారు. మిగతా ఫీజు చెల్లించలేదని విద్యాభ్యాసం మధ్యలో పాఠశాలకు వెళ్లకుండా,పరీక్షలకు హాజరు కాకుండా నిరోధించడం ద్వారా పిల్లవాడిని బాధపెట్టకూడదని సంస్థ కార్యదర్శి,సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ యాజమాన్యానికి విద్య అనేది జీవించే హక్కు కింద చేర్చబడిన కీలకమైన హక్కు అని తెలుపగా వెంటనే విద్యార్థికి హాల్ టికెట్ అందించారు.ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.



## మూగజీవుల దాహార్తికి సిమెంట్ బౌల్‌లు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వేసవి కాలం దృష్ట్యా జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో మూగజీవుల దాహార్తి నిమిత్తం సిమెంట్ బౌల్‌లను మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ శివపురి కాలనీలో పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి వెటర్నరీ డాక్టర్ మారుతి, గౌతం, మూర్తి, వేణుగోపాల్,నాని, శ్రీనాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## రంజాన్ పండుగ దేశ సంస్కృతి, సాంప్రదాయాన్ని పెంపొందిస్తుంది

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** రంజాన్ పండుగ దేశ ఔనత్యాన్ని , సంస్కృతిని సాంప్రదాయాన్ని పెంపొందించే పండుగ అని టీపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సోంటి రెడ్డి పున్నారెడ్డి అన్నారు. చింతల్ డివిజన్ లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో తెలంగాణ రాష్ట్ర వర్క్ బోర్డు చైర్మన్ అజ్మత్ తుల హుస్సేని తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లీం సోదరుల పవిత్ర మాసమైన రంజాన్ పండుగ అన్నారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్నడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హజ్ కమిటీ మెంబర్ ముజీబ్ ఖాన్, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఉస్మాన్ అహ్మద్ ఖాన్, ఇంచార్జి మేడ్చల్ మల్కాజ్‌గిరి మైనార్టీ డిపార్టుమెంట్ హుస్సేన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సయ్యద్ జహంగీర్ హుస్సేన్, కూన రఘుగౌడ్, చింతల్ డివిజన్ అధ్యక్షులు పండరి, పల్వార్ రెహమన్ తదితరులు పాల్గొన్నా రు.

# ఓటింగ్ ప్రక్రియలో మార్పులు – చేర్పులు

* రాజకీయ పార్టీలతో సమావేశమైన కలెక్టర్ గౌతం
* సూచనలు, సలహాల కోసం అభ్యర్థన



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఓటర్ల జాబితాలో మార్పు చేర్పులు, నూతన పోలింగ్ బూతుల అవసరాలు, ఓటింగ్ సంబంధించిన అభ్యర్థనలు, సందేహాలు, సూచనల కోసం ఎన్నికల సమయంలోనే కాకుండా దఫాల వారీగా అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేస్తుంటామని జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పలు రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జన సంఖ్యతో పాటు ఓటర్ల సంఖ్య పెరుగుతున్న క్రమంలో వారికి అవసరమైన పోలింగ్ బూతు లెవెల్ ఏజన్సీలను నియమించాలని ఆయన సూచించారు. సరళీకృతమైన ఓటరు జాబితాలను అవసరమైన మేరకు ఎప్పటికప్పుడు మార్పు చేర్పులు చేస్తూ వాటి వివరాలను బిఎల్ఎలు ఓటర్లకు తెలియ చేయాలన్నారు. పోలింగ్ బూతులను మార్చటం కష్టతరమైన పని అని, అవసరమైన మేరకు కొత్త పోలింగ్ బూతులను ఏర్పాటు చేస్తామన్నారు. ఒకే కుటుంబంలోని సభ్యులు వేర్వేరు పోలింగ్ బూతులను కేటాయిస్తుంటే ఏర్పడుతు న్న ఇబ్బందులను అధిగమించేందుకు గాను వారు ఫామ్ 8లో బూతు మార్పిడికోసం ధరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందని కలెక్టర్ స్పష్టం చేసారు.

పార్టీ ప్రతినిధుల సూచనల మేరకు తండాలలో పరిశీలించి అవసరమైన చోట కొత్త బూతులను ఏర్పాటు చేస్తామని, రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎలాంటి సమస్యలు ఉన్నా, ఎలాంటి అవసరమైన సూచనలు, సలహాలు తెలియచేయాలని, వీటన్నిటిని పరిగణలోకి తీసుకొనేందుకు గాను జాతీయ ఎన్నికల కమిషన్‌కు పంపిస్తామని కలెక్టర్ కోరారు.

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## బెట్టింగ్ కార్యక్రమాలకు పలుపడితే కఠిన చర్యలు

మోమిన్ పేట్ సిఐ జి.వెంకట్

**ప్రజాపక్షం/నవాబుపేట్ :-** ఆన్లైన్ బెట్టింగ్‌లు ఆడేవారు ఎంతటివరైనా వదిలి పెట్టేది లేదని మోమిన్ పేట్ సిఐ జి.వెంకట్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ, మోమిన్ పేట్, మర్పల్లి, నవాబ్ పేట్ మండల ప్రజలకు తెలియ జేయు విషయంపై నేటి నుండి ప్రారంభం కానున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లని కొంతమంది వ్యక్తులు ఆసరాగా చేసుకుని అక్రమంగా బెట్టింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఇట్టి విషయంపై మోమిన్ పేట్ సీఐ జి వెంకట్ ప్రత్యేక దృష్టి సారించి మోమిన్ పేట్, మర్పల్లి, నవాబ్ పేట్ మండల పరిధిలో సాధారణ దుస్తులులో ఉన్న పోలీస్ వారిచే స్పెషల్ టీంలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడి ఎంతోమంది తమ కుటుంబాన్ని రోడ్డున పడేలా చేస్తున్నారని బెట్టింగ్ పాల్పడే వారిని మరియు బెట్టింగ్ నిర్వహించే వారిని టెక్నికల్, స్పెషల్ టీం లా సహకారంతో గుర్తించి ఇట్టి వ్యక్తులపైన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్య తీసుకుంటామని చెప్పడం జరిగింది. అదేవిధంగా కొంతమంది ప్రభుత్వం నిషేధించిన బెట్టింగ్ యాప్‌లని వినియోగిస్తున్నారని, ఆన్లైన్ లో బెట్టింగ్ యాప్ ల ద్వారా బెట్టింగ్ కి పాల్పడుతున్నారని ఇటీవల ఇట్టి బెట్టింగ్ యాప్ లని ప్రమోట్ చేసిన వారిపై కేసుల నమోదు అయినా యని, అదే విధంగా ఇట్టి బెట్టింగ్ యాప్‌ల ద్వారా బెట్టింగ్‌కి పాల్పడే వారి పైన కూడా కేసులు నమోదు అవుతాయని చెప్పడం జరిగింది. ఇట్టి బెట్టింగ్ కి పాల్పడే వారి యొక్క వివరాలు తెలిసినట్టయితే 100 నెంబర్‌కి గాని, సిఐ మోమిన్ పేట్ 8712670036 నెంబర్ కి గాని ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు. మీ యొక్క వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని మోమిన్ పేట్ సిఐ జి.వెంకట్ అన్నారు.

## మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి



**ప్రజాపక్షం/కూకట్ పల్లి:** మహిళల అభ్యు న్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు లు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని 7వ ఫేజ్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభోత్సవానికి ఆయనతో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డిలు హాజరై మహిళా శక్తి క్యాంటిన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా ప్రభు త్వం అడుగులు వేస్తుందన్నారు. బండి రమేష్ మాట్లాడుతూ ఈ క్యాంటిన్ నిర్వహిస్తున్న యమునా టీంకి ఆయన అభినందనలు తెలియజేశారు. ఇలాంటివి రాబోయే కాలంలో మరెన్నో ప్రారం భించాలన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఐఎన్‌డిసి సెంట్రల్ కమిటీ సెక్రటరీ కరుణాకర్ నాయుడు, పుష్పారెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే సంజీవరావు, మేకల మైకల్, డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, రేష్మ, సంధ్య, పోన్నం రజీత, జోజమ్మ, బండి సుధా, కూకట్ పల్లి క్రిస్టియన్ మైనార్టీ కో అర్డినేటర్ క్రిస్టోఫర్, రాజు ముదిరాజ్, శ్రీధర్ చారి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సూర్య మసాలా కర్మాగారంపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

ఆహార ఉల్లంఘనలు గుర్తించిన అధికారులు

**ప్రజాపక్షః/మేడ్చల్ ప్రతినిధి:** అపరిశుభ్ర స్థలాల్లో ఆహార పదార్థాల తయారీ కేంద్రాలు,నిల్వలు, విక్రయ కేంద్రాలపై మేడ్చల్ జిల్లాలోని శామీర్‌పేట మండలం కిష్టాపూర్ గ్రామంలోని హైదరాబాద్ ఫుడ్ ప్రాడెక్ట్ సంస్థపై రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. సూర్య మసాలా, స్పైసెస్ తయారీ చేస్తున్న ఈ సంస్థలో ఆహార పరిరక్షణ ఉల్లంఘనలను గుర్తించి నోటీసులు జారీ చేసారు. మసాలాలు, పొడులు, అల్లం వెల్లుల్లి పేస్టుల తయారీ చేస్తున్న ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండటం, దుమ్ము, ధూళితో మురికిగా పాడయి ఉండటం, పచ్చళ్ళు, పొడులు నిల్వ చేస్తున్న బ్యారెళ్లలో చెత్త పడుతుండటం బూజు, సాలీడు గూళ్లు ఉండటాన్ని అధికార్లు గుర్తించారు. సంస్థలో సరైన రికార్డులు సైతం సక్రమంగా లేవన్నారు. సేకరించిన పలు శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి నివేదికల మేరకు చర్యలు తీసుకొంటామని రాష్ట్ర టాస్క్ ఫోర్స్ టీం హెడ్ జ్యోతిర్మయి తెలిపారు.

## గోడ కూలి ముగ్గురికి గాయాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాద వశాత్తు గోడ కూలిన సంఘటనలో ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. బండ్లగూడలోని పటేల్ ఫామ్ హౌజ్‌లో శుక్రవారం నిర్మాణ పనులు చేస్తుండగా గోడ కూలి మీద పడటంతో చెన్నాపురం గ్రామానికి చెందిన బసప్ప, శరణప్ప, లక్ష్మణ్‌లు గాయాల పాలయ్యారు. వెంటనే సమాచారం అందుకొని వీరిని 108 అంబులెన్స్ ద్వారా గాంధీ ఆస్పత్రికి చికిత్స నిమి త్తం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావాలపై ముందస్తు హెచ్చరికలు

### ప్రజలకు తెలియచేయాలని వైద్య ఆరోగ్య శాఖకు కలెక్టర్ సూచన



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల జరిగే ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కొనేందుకు జిల్లా వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన వేడిఆరోగ్యం/హీట్ వేవ్ అంశంపై టాస్క్ ఫోర్స్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఈ విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్లను విడుదల చేసారు.తీవ్రమైన వేడి , అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఆరోగ్య సౌకర్యాలకు, ప్రాథమిక సేవలకు సమర్థమైన యాక్సెస్ కల్పించాలన్నారు. వేడి జాగ్రత్తలను ముందస్తుగా ప్రజలకు హెచ్చరికలను తెలియ చేసే ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖ ఇన్‌చార్జిలకు తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయం, నీరు, శానిటేషన్, కృత్రిమ పోషణ, గ్రామీణ అభివృద్ధి, విద్య, ఐసిడిఎస్, వాతావరణం, సంక్షేమం, కాలుష్య నియంత్రణ బోర్డు తదితర సంబంధిత ప్రభుత్వ విభాగాధికారులకు అదనపు కలెక్టర్ పలు సూచనలు చేసారు. పాఠశాలలు, వేదికలు, బహిరంగ కార్యక్రమాలు జరిగే ప్రదేశాల వంటి హాట్‌స్పాట్‌లను గుర్తించటం ఎంతైనా అవసరమని డిఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరి తెలిపారు.

అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, వైద్య సేవలు, శీఘ్ర శీతలీకరణ చర్యలను సమర్థంగా ఏర్పాటు చేయాలని తెలిపారు.

నోడల్ అధికారి, నాన్ కమ్యూనబుల్ వ్యాధుల జిల్లా ప్రోగ్రాం అధికారి డా.మల్లీశ్వరి ,కీసర, మల్కాజిగిరి డివిజన్ల డిప్యూటి డిఎంహెచ్‌ఓలు డా.సత్యవతి, శోభారాణి, ఇతర అధికార్లు డా.శ్రీదేవి, డా.చంద్రకళ, డా.కౌశిక్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు ఈ సమావేవంలో పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

**ప్రజాపక్షం/నాగారం:** పదవ తరగతి విద్యార్థులు ప్రతి ఒక్క విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాసి మంచి ఫలితాలను సాధించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.శుక్రవారం నుంచి పదవ తరగతి పరీక్షలు మొదలవుతున్న సందర్భంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాల ను ప్రధానోపాధ్యాయుడు రాములును అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు రాసే విద్యార్థిని,విద్యార్థులకు ఆయన ఆల్ ది బెస్ట్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## రైతు సంఘం మహాసభలను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఈ నెల 25 నుండి 27 వరకు నిజామాబాద్ లో జరుగుతున్న తెలంగాణా రాష్ట్ర రైతు సంఘ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింలు, జిల్లా అధ్యక్షులు డి.జంగయ్యలు కోరారు. ఆల్వాల్ మండలం యాప్రాల్‌లో శుక్రవారం జరిగిన తెలంగాణా రాష్ట్ర రైతు సంఘ మండల మహాసభలో నిమ్మల నర్సింలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని, రుణ మాఫీ, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఆల్వాల్ మండల సిపిఐ కార్యదర్శి కె.సహదేవ్ రైతు మహాసభలకు అధిక సంఖ్యలో రైతాంగం హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి పి. చంద్రయ్య, బి.నరేంద్ర, రాజు గోపాల్, శ్రీనివాస్, రాజేష్, జనకుమార్‌లు పాల్గొన్నారు. ఆల్వాల్ మండల రైతు సంఘం నూతన అధ్యక్షుడిగా ఎం. కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా అమరావతి బాబు, ఉపాధ్యక్షులుగా ఎన్ పద్మ, నాగలక్ష్మి , సహాయ కార్యదర్శి దేవి వెంకటేష్, కమిటి సభ్యులుగా వెంకటేష్, విజయకుమార్ రాజులు ఎన్నికయ్యారు. అనంతరం రైతు సంఘం సభ్యత్వ నమోదు చేసారు.



## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పేద రోగులు మెరుగైన శస్త్రచికిత్సలతో కూడిన వైద్యం చేయించుకొనేందుకు సిఎం రిలీఫ్ ఫండ్ తోడ్పడుతుందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తెలిపారు. శుక్రవారం ఆయన మల్కాజిగిరికి చెందిన రవీందర్‌కు రూ.20వేలు, గౌతంనగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి కి రూ.60 వేలు,బాషాకు రూ.42 వేలు చెక్కులను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి కాంతరెడ్డి, రాందాస్, సంతోష్ ముదిరాజ్, వినోద్ యాదవ్, రాంచందర్ , సానాది శంకర్, తదితరులు పాల్గొన్నారు.




## నాయకత్వంకోసం ప్రతి మహిళను శక్తివంతం చేయడమే లక్ష్యం

**ప్రజాపక్షం/కూకట్ పల్లి :** ప్రతి మహిళను నాయకత్వం కోసం శక్తి వంతం చేయడమే లక్ష్యమని శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఇందుమతి శ్రీరంగం అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇందిరా ఫెలోషిప్ బూట్ క్యాంపు ఇందిరా ఫెలోషిప్ కన్వీనర్ విజయ లక్ష్మి , రమణి రెడ్డి ఆధ్వర్యంలో బేగంపేట లోని తాతాచారి నగర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి బూట్ క్యాంపు గొప్ప విజయాన్ని సాధించింది. ఈ కార్యక్రమానికి సనత్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి , టిపిసిసి జనరల్ సెక్రెటరీ కోట నీలిమ, శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఇందుమతి శ్రీరంగం, జాతీయ పరిశోధనా అధిపతి హనికా రేషే , ఏఐసీసీ మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజానోళ్ళ లక్ష్మి , రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను శక్తి వంతం చేయడం, అట్టడుగు స్థాయి మహిళా రాజకీయ నాయకులను సృష్టించడం శక్తి అభియాన్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి , మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మహిళా బ్లాక్ అధ్యక్షురాళ్ళు, డివిజన్ మహిళా అధ్య క్షురాలు కృష్ణవేణి, రాధ, రజిత, జోజమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## కొడంగల్ శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సిఎం రేవంత్‌కు ఆహ్వానం

**ప్రజాపక్షం / కొడంగల్ :** పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి 45వ వార్షిక బ్రహ్మోత్సవాలలో ఆలయ ధర్మకర్తలు శుక్రవారం హైద్రాబాద్‌లోని సిఎం రేవంత్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్, ప్రశాంత్‌లు మాట్లాడుతు ప్రతి సంవత్సరం శ్రీవారి బ్రహ్మోత్సవాలలో రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గోని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరుగతుందని అదేవిధంగా తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చే పట్టువస్త్రాలను కూడా రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా స్వామి వారికి సమర్పించేవారని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి స్వామి వారి ప్రసాదాలను అందించి ఆహ్వానించడం జరిగిందని ఈ నెల 24వ తేది నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు.

# తిరుపతిపై సిఎం వ్యాఖ్యలు సరికావు : టిడిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రజలు తిరుపతికి వెళ్లడం, తిరుపతి లెటర్ల కోసం పాకులాడటం ఏంటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదని టిడిపి సికింద్రాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయి బాబా అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల పట్ల వివక్ష లేకుండా ఉండాల్సిన వ్యక్తి, తిరుమల గురించి ఇలా వ్యాఖ్యానించడం హాస్యస్పందంగా ఉందన్నారు. తెలంగాణలో దేవాలయాలు లేవా అని వ్యాఖ్యానించడం సరైంది కాదన్నారు. యాదగిరిగుట్టకు వెళ్ళండి, భద్రాచలం వెళ్లండి అంటూ చెప్పడం చిత్రంగా ఉందన్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా మాట్లాడాల్సిన మాటలు కావన్నారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్, తడక వినోద్, సుదర్శన్ రెడ్డి, బాను ప్రకాష్, శ్యామ్ సుందర్, కిరణ్, సత్యనారాయణ, సుక్రవేది తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు

జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ లచ్చిరెడ్డి వినతి



**ప్రజాపక్షం/ఎల్బీ నగర్ :** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి వారి కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటరర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ శ్రీరాం నగర్ కాలనీ ఫేజ్1, 2లో నూతన సిసి రోడ్లు ఏర్పాటుకు నిధుల కొరత ఉందని, తక్షణమే నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. డివిజన్‌లోని పలు కాలనీలకు మౌలిక సౌకర్యాలు కల్పించడానికి నిధుల కొరతతో ప్రజల సమస్యలు పరిష్కారించడంలో తీవ్ర జాప్యం జరుగతుందని కమిషనర్‌కు తెలిపారు.

## పేదలకు అండ సిఎం సహాయనిధి

కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఉంటుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆర్‌కెపురం డివిజన్ ఎన్‌టిఆర్‌నగర్‌కు చెందిన ఆలుకొండ అంజలి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. ఆమె సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా శుక్రవారం ఉపేందర్‌రెడ్డి తన నివాసంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సౌజన్యంతో టిపిసిసి ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్ పగడాల శ్రీశైలం, పెద్దవూర సైదులు, రేణుక, లింగస్వామిగౌడ్, జయశ్రీ, పగడాల ఎల్లన్న, పగిళ్ళ అంజి, సంతోష, శ్వేత, ప్రశాంత్, పసుదేవుల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాం నగర్ కాలనీ రిజిస్ట్రేషన్‌కు ఫారెస్టు అధికారుల ఎన్‌ఒసి జారీ



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ కలాన్ సర్వే నెంబర్ 201/1లో రిజిస్ట్రేషన్ సమస్యను త్వరగా పరిష్కారం చూపాలని ఫారెస్టు అధికారులను కోరాడంతో ఫారెస్టు అధికారులు శ్రీరాం నగర్ కాలనీ వాసులకు ఎన్‌ఓసి అందించినట్లు కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. శుక్రవారం శ్రీరాంనగర్ కాలనీ వాసులతో కలిసి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ డాక్టర్, శ్రీనివాస్‌రెడ్డిని వారి కార్యాలయంలో కాలనీ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీ వాసులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, కాలనీలో ఉండే వారికి ఇబ్బందులు కలగకుండా యధావిధంగా రిజిస్ట్రేషన్ జరుగుతుందని తెలిపారు. కాలనీ వాసులకు ఎన్‌ఓసి సర్టిఫికెట్ జారి చేయడం జరిగిందని కార్పొరేటర్ లచ్చిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, బిఎన్‌రెడ్డి నగర్ దేవి పోచమ్మ ఆలయ చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## గిరిజనులు విద్య, ఉద్యోగాల్లో రాణించేందుకు సహకారం

గిరిజన ఆదివాసీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనునాయక్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గిరిజనులు విద్య, ఉద్యోగాల్లో రాణించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకారం అందింస్తుందని రంగారెడ్డి జిల్లా గిరిజన ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనునాయక్ వివరించారు. శుక్రవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోరి వికరాబాద్ జిల్లాలోరి అనంతగిరి హరిత రిసార్ట్స్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి ఆదివాసీ కాంగ్రెస్ బునియాది కార్యకర్తల సమ్మేళనం ముగింపు కార్యక్రమారికి తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్, తాండురు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం కల్పించిన రాజ్యాంగ పరమైన రిజర్వేషన్లు కారణమని అన్నారు. శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ తాను ఉన్నతమైన పదవిలో ఉన్నానంటే అందుకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కారణమని, దళిత గిరిజన వర్గాలకు కల్పించిన రిజర్వేషన్లు మాత్రమేనని అన్నారు. దేశంలో ప్రకృతి సంపద మొదటి హక్కు గిరిజనులదేనన్న విషయం ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైకా చైర్మెన్ బెల్లయ్య నాయక్, ఆదివాసి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు విక్రాంత్ బురియా, ఆదివాసి కాంగ్రెస్ కన్వీనర్ రాహుల్బల్, డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, వికరాబాద్ పట్టణ అధ్యక్షుడు అర్థ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం



**ప్రజాపక్షం/నందిగామ:** భక్త జనుల శరణుఘోషతో అయ్యప్ప స్వామి క్షేత్రం మారుమోగిపోయిందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం నందిగామ మండల కేంద్రానికి సమీపంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయం విగ్రహ పున:ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ధ్వజస్తంభ ప్రతిష్టలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ కేరళలోని అయ్యప్ప స్వామి దేవాలయం తరహాలో నందిగామ మండల కేంద్రం సమీపంలో నూతనంగా నిర్మించడం సంతోషించ దగ్గ విషయమని పేర్కొన్నారు. ధ్వజస్తంభ దాత గాంధీనగర్ కాలనీకి చెందిన మాజీ వార్డు సభ్యులు వేణుగోపాల్ కావడం అభినందించ దగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో గురుస్వామి లక్ష్మయ్య, ఆలయ కమిటీ చైర్మెన్ బాల్‌రెడ్డి, ఈట గణేష్, వెంకట్‌రెడ్డి, పట్వారీ శ్రావణ్‌కుమార్, హరి జీవన్ స్వామి, సుదర్శన్ గౌడ్‌తోపాటు అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు టెండరుపై 'స్టేటస్‌కో'

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రావిర్యాల ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఆమనల్ రీజినల్ రింగ్ రోడ్డు దాకా మొదటి ఫేజ్‌లో ఏర్పాటు చేయదలచిన గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి చెందిన టెండరు నోటీసుపై స్టేటస్ కో కొనసాగించాలంటూ ఇటీవల హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. భూసేకరణ ప్రక్రియ పూర్తికాకుండానే గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణం నిమిత్తం ఈ ఏడాది ఫిబ్రవరి 24న జారీ చేసిన టెండరు నోటీసును సవాలు చేస్తూ ఎన్.రవీందర్ మరో 9 మంది దాఖలు చేసిన పిటిషన్‌పై ఇటీవల జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. హెచ్‌ఎండీయే, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ రంగారెడ్డి కలెక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. తొలుత పిటిషనర్ లాయర్ వాదిస్తూ, రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు భూసేకరణ ప్రక్రియ పూర్తికాకుండానే గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి హెచ్‌ఎండీయే, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్‌లు ఈనెల 24న టెండరు నోటిఫికేషన్ జారీ చేశాయన్నారు. రోడ్డు నిర్మాణం కోసం గత ఏడాది అక్టోబరు 28న భూసేకరణ చట్టం కింద ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. భూసేకరణ ప్రక్రియ కనీసం అభ్యంతరాల స్వీకరణ దాకా కూడా రాలేదన్నారు. సెక్షన్ 15 కింద భూయజమానుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించి సెక్షన్ 15 కింద ఎలాంటి నోటిఫికేషన్ జారీ కాలేదన్నారు. ఇది అయిన తరువాత సెక్షన్ 19 కింద డిక్లరేషన్ జారీ చేయాల్సి ఉందన్నారు. ఇవేవీ లేకుండానే, భూసేకరణ ప్రక్రియ



పూర్తికాకుండా టెండరు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఒకసారి టెండరు ఖరారు అయితే తమతోపాటు ఇతర రైతులు వ్యక్తం చేసే అభ్యంతరాలకు విలువ ఉండదన్నారు. మొక్కుబడిగా అభ్యంతరాలను స్వీకరించి వాటిని తిరస్కరిస్తారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి భూసేకరణ ప్రక్రియ ప్రాథమిక దశలోనే ఉన్నందున గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి చెందిన టెండరుపై యథాతథస్థితిని కొనసాగించాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేశారు.

## నిరసనల నిషేధంపై వివరణ ఇవ్వండి

ఒయుకు హైకోర్టు ఆదేశం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనల నిషేధంపై ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు, ఉన్నత విద్యాశాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నిరసనలను నిషేధిస్తూ ఈనెల 13న జారీ చేసిన సర్క్యులర్‌పై పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను ఏప్రిల్ 9వ తేదీకి వాయిదా వేసింది. ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో నినాదాలు, నిరసనలు వ్యక్తం చేయరాదంటూ ఈనెల 13న జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ న్యాయ విద్యార్థి పి.రఫి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అక్రమచొరబాటు, ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేయడం, నినాదాలు చేయడం, పరిపాలనా వ్యవహారాలను అడ్డుకోవడం, అధికారులు, సిబ్బందికి వ్యతిరేకంగా దూషణలు, అసభ్య పదజాలం వాడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ సర్క్యులర్ జారీ అయిందన్నారు. ఈ సర్క్యులర్ భావప్రకటనా స్వేచ్ఛకు విరుద్ధమన్నారు. నిరసన ప్రాథమిక హక్కు అంటూ సుప్రీం కోర్టు తెలియజేసిందన్నారు. అస్పష్టంగా ఉన్న సర్క్యులర్‌ను కొట్టివేయాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఉస్మానియా యూనివర్సిటీకి, ఉన్నత విద్యాశాఖకు నోటీసులు జారీ చేశారు.

## బిఆర్‌ఎస్ దురాగతాలను మరువరు

టిపిసిసి ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలోని దురాగతాలను ప్రజలు మరువరని టిపిసిసి ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. శుక్రవారం కోట నీలిమ మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తామని ప్రకటించిన కెటిఆర్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజాభిమానం కోల్పోయి, అధికారానికి దూరమైన బిఆర్‌ఎస్ పార్టీ మనుగడ కోసం అడుగులు వేస్తున్నదని విమర్శించారు. కెటిఆర్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కెసిఆర్ లేకపోతే తెలంగాణ లేదనడం కెటిఆర్ అహంకారానికి నిదర్శమన్నారు. బిజెపికి బిఆర్‌ఎస్ దగ్గరవుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేయకుండా బిజెపికి బిఆర్‌ఎస్ మద్దతు ఇచ్చిన విషయం మరిచిపోలేదన్నారు. బడ్జెట్‌పై ప్రతిపక్షాలకు విమర్శలు తప్ప, ప్రజా సంక్షేమం పట్టకపోవడం బాధాకరమని ఆమె పేర్కొన్నారు.

# ఎల్‌ఆర్‌ఎస్ అమలులో నూరు శాతం పురోగతి

రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌ఆర్‌ఎస్ (లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి సారించి, ఈ నెల 31వ తేదీలోగా ఎల్‌ఆర్‌ఎస్ అమలులో నూరు శాతం పురోగతి సాధించాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. సచివాలయంలో దాన కిషోర్ ఎల్‌ఆర్‌ఎస్‌పై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. తప్పిదాలకు తావు లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. దరఖాస్తుదారులు భవన నిర్మాణ అనుమతులు తీసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు సంబంధించి ప్రొసీడింగ్ జనరేట్ చేసి అందజేయాలన్నారు. ఇప్పటికీ ఫీజు చెల్లించని దరఖాస్తుదారులు రెండో దఫా ఫోన్ చేసి మార్చి 31లోగా ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్‌లు సంబంధిత మున్సిపల్ కమిషనర్‌లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించాలాన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ వల్ల కలిగే ప్రయోజనాలను దరఖాస్తుదారులకు తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌లకు సూచించారు. ఈనెల 24న మరోసారి ఎల్‌ఆర్‌ఎస్‌పై కలెక్టర్‌లు, కమిషనర్‌లతో సమీక్ష నిర్వహిస్తానని దాన కిషోర్ తెలిపారు.

# పరీక్షల నిర్వహణలో అప్రమత్తత

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** పదవ తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం రాజేందర్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ సరళిని పరిశీలించారు. వేసవి కాలం అయినందున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షా కేంద్రాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, చిత్తుకాగితాలో లేకుండా చూడాలన్నారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణలో పరీక్షలు రాసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏడాదిపాటు చదివిన విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసేందుకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలన్నారు. మెయిన్ గేట్ వద్ద విద్యార్థులను విద్యార్థినిలను వేరువేరుగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. పరీక్షా కేందాలలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని చీఫ్ సూపర్డెంట్‌లను కలెక్టర్ ఆదేశించారు. తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

## 23న జై సంవిధాన్ అభియాన్ జిల్లా సన్నాహక సమావేశం : చల్లా



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకవెళ్లేందుకు పల్లె పల్లెలో పాదయాత్ర నిర్వహించేందుకు చేపట్టే జిల్లా స్థాయి సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని టియుఎఫ్ఐడిసి చైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం డిసిసి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్‌గాంధీ జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ నినాదానికి పిలుపునిచ్చారని తెలిపారు. జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ ఆశయాలకు తగ్గట్టుగానే రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విధానాలను రూపొందిస్తుందని డిసిసి అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగానే బిసి కుల గణన చెప్పట్టి, రిజర్వేషన్ బిల్లుతో పాటు ఎస్‌సి వర్గీకరణ బిల్లులను అసెంబ్లీలో ఆమోదింపచేయడం జరిగిందన్నారు. సిడబ్ల్యూసి, టిపిసిసి పిలుపుమేరకు మార్చి 23 ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని ఆరంఘర్‌లోని గ్రాండ్ ఫంక్షన్ హాల్ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు చల్లా నరసింహారెడ్డి తెలిపారు. పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని చల్లా నరసింహారెడ్డి కోరారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** సిఎం సహాయనిధిపేదలకు గొప్ప వరం అని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్‌కు గణేష్‌పురి కాలనీ చెందిన గౌరవ్‌గౌడ్ (24)కొంతకాలంగా వెన్నెముక సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో వారి కుటుంబసభ్యులు ఎమ్మెల్యేను ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సిఎం సహాయనిధి రూ.2లక్షల మంజూరు చేయించి అట్టి సహాయాన్ని శుక్రవారం బాధితుల కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులకు న్యాయం చేయాలి' : రాంబాబు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థలోని ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులకు ప్రమోషన్ విషయంలో న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్‌ను కోరినట్టు తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫౌండర్ అజ్మీరా రాందాస్ తెలిపారు. ఏపిలో రిటైర్ అయిన ఆర్‌సి కుమార్ ప్రభుత్వ ఆమోదం లేకుండానే ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నెలకు రూ.2.50లక్షల జీతం తీసుకొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ జీవో ప్రకా రం ఆయనకు గౌరవ వేతనం రూ.50వేలు లేదా రూ.35వేలు ఉండాలని, కానీ, రూ.2.50లక్షల జీతం తీసుకోవడమేమిటని ప్రశ్నించారు. ఆర్‌సికుమార్ స్థానంలో 30ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగికి జిఎంగా పదోన్నతివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులకు న్యాయం చేయకపోతే ఉద్యమిస్తామని ఒక ప్రకటనలో ఆయన హెచ్చరించారు.

## భార్యను దారుణంగా హత్యచేసిన భర్త

**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వలేదనే కోపంతో భర్త భార్యను గొడ్డలితో దారుణంగా గొంతు నరికి హత్య చేసిన సంఘటన ఫరూక్‌నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. షాద్‌నగర్ సిఐ విజయ్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి...అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల పరుశురాములు తన భార్య జమునను గురువారం రాత్రి గొంతుపై నరికి చంపినట్లు తెలిపారు. సంసార భాధ్యతలు పట్టించుకోకుండా జులాయిగా తిరుగుతూ మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసే వాడని తెలిపారు. అందులో భాగంగానే గురువారం ఇరువురి మధ్య డబ్బుల విషయంలో ఘర్షణ చోటు చేసుకుందని, దాంతోనే భర్త పనుశురాములు భార్య జమునను గొడ్డలితో నరికి చంపినట్లు వివరించారు. జమున మృతదేశాన్ని పోస్టుమార్టం నిమిత్తం శంషాబాద్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనకు పాల్పడిన భర్త పరుశురాములును పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు సిఐ విజయ్‌కుమార్ తెలిపారు.

# తక్షణమే 'ఉపాధి' పెండింగ్ బిల్లులు

-బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లిందుకు కృషి చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనుల వద్దకు వెళ్ళి పరిశీలించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ సంగెం గ్రామంలో గత పది వారాలుగా 60మంది కూలీలు పనులు చేస్తున్నారని, వారికి నేటికి కూలీ డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో కూలీ డబ్బులు రాకుంటే ఎలా పని చేస్తారని, ఇందుకు అధికారులు సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపిలకు, ఎమ్మెల్యేలకు నెలనెల జీతాలు ఇస్తారు..కానీకూలీలను మాత్రం నెలలు గడిచినా కూలీ డబ్బులు రావడం లేదని మండిపడ్డారు. కూలీలతోపాటు ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలల నుండి జీతాలు రావడం లేదని, ఇదెక్కడి న్యాయమని మండిపడ్డారు. ఆఫీసుల్లో ఉన్న మీకే నెలనెల జీతాలు వస్తుంటే ఎండల్లో కూలీ పనులు చేస్తున్న వారికి ఎందుకు ఇవ్వడం లేదని వాపోయారు. భూమి లేని ఉపాధి కూలీలందరికి ఏడాదికి రూ.12వేలు వేస్తామని చెప్పి కొంతమందికి మాత్రమే రూ.6వేల చొప్పున వేశారని, మిగతా వారి పరిస్థితి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవాలని, పేదలను విస్మరిస్తే రాజకీయ పార్టీలకు భవిష్యత్ ఉండదని హెచ్చరించారు. ఉపాధి కూలీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేసి వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలు తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కె.మహేష్, ఉపాధి కూలీ సంఘం నాయకులు ఎండి సాధిక్, మంగమ్మ, శ్రీను, నవనీత, డి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతో సమస్యలు పరిష్కారం

మున్సిపల్ సంఘం (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/గండిపేట్ :** పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం (ఎఐటియుసి అనుబంధం) ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ చౌరస్తాలో మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్న మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచి సమస్యలు పరిష్కరించకపోవడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి మున్సిపల్ శాఖను తన ఆధీనంలోనే పెట్టుకుని మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా అసెంబ్లీ సమావేశంలో మున్సిపల్ అన్నిరంగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు జరుగుతాయని ఆశతో ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికుల సమస్యల మీద కనీస వేతనాల మీద మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని జైపాల్‌రెడ్డి విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ మున్సిపల్ కార్యాలయం ముందు సోమవారం నిర్వహించే ధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్, నరసింహ, రమేష్, ఇందిరమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు.



# ఫోకస్ సైన్స్



## దూసుకొస్తున్న గ్రహశకలం..

తాజ్‌మహల్‌కు సుమారు రెండు రెట్లు పెద్ద పరిమాణంలో ఉన్న గ్రహశకలం '2014 టిఎన్17' దూసుకొస్తున్నది. గంటకు 77,282 కిలోమీటర్ల వేగంతో పయనిస్తున్న ఈ గ్రహశకలం ఈనెల 26వ తేదీ బుధవారం, భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5.04 గంటలకు, భూమికి సుమారు ఐదు మిలియన్ కిలోమీటర్ల దూరం నుంచి వెళుతుంది. భూమికి, చంద్రుడికి మధ్య ఉన్న దూరానికి ఇది 13 రెట్లు అధికం. అందువల్ల ఈ గ్రహశకలం వల్ల భూమికి వచ్చే ప్రమాదం ఏమీ లేదని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' ప్రకటించింది. అయితే, అంతరిక్షంలో హఠాత్ పరిణామాలు సహజమని, కాబట్టి, అనుక్షణం '2014 టిఎన్17' గమనాన్ని పరిశీలిస్తున్నామని వివరించింది. సంభావ్యత చాలా తక్కువగా ఉన్నప్పటికీ, ఒకవేళ ఆ గ్రహశకలం తన దిశ మార్చుకొని, భూమిని ఢీకొంటే, దాని ప్రభావం కొన్ని వందల అణు బాంబులకు సమానంగా ఉంటుందని నాసా తెలిపింది. ఆ ప్రాంతం భస్మీపటలమవుతుందని, అగ్నిపర్వతాల మాదిరి భూమి పైపొరలు విస్ఫోటనం చెందుతాయని హెచ్చరించింది. కానీ, ఇప్పటి వరకూ ఈ గ్రహశకలం భూమిని ఢీకొనే ప్రమాద సూచకలు ఏవీ కనిపించడం లేదని తెలిపింది.

## 'యురోపా'పై నీటి కోసం వేట!



మన సౌర కుటుంబంలోని గ్రహం బృహస్పతి (జూపిటర్)కు చంద్రుడు 'యురోపా'పై నీటి ఆనవాళ్లు ఉన్నట్టు అనుమానం. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' ప్రయోగించిన 'యురోపా క్లిప్పర్' మరో ఐదేళ్లలో జూపిటర్ కక్షలోకి చేరుకొని, కీలక సమాచారాన్ని అందిస్తుంది. నాసా ఇప్పటి వరకూ ఒక గ్రహ మిషన్ కోసం అభివృద్ధి చేసిన అతిపెద్ద అంతరిక్ష నౌక 'యురోపా క్లిప్పర్'. 2024 అక్టోబర్ 14న ప్రయోగించిన ఈ అంతరిక్ష నౌక ఎత్తు దాదాపు 16 అడుగుల (5 మీటర్లు). ఇది 100 అడుగుల (30.5 మీటర్లు) కంటే ఎక్కువ విస్తరించి 7,145 పౌండ్ల (3,241 కిలోలు) ద్రవ్యరాశిని కలిగి ఉంది. యురోపా చంద్రుడిపై భూమి కంటే కనీసం రెండు రెట్లు పెద్దదైన సముద్రం ఉన్నట్టు శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. దాదాపు బాస్కెట్ బాల్ కోర్టు అంత పొడవుగల యురోపా క్లిప్పర్ ప్రోబ్ ఈ సందేహాన్ని నివృత్తి చేస్తుంది. నీటి ఆనవాళ్లపై స్పష్టతనిస్తుంది. 2030 ఏప్రిల్ నాటికి ఇది జూపిటర్ చంద్రుడు యురోపాపై లోతైన అధ్యయనం చేస్తుంది. 1998లో చేపట్టిన గెలీలియో మిషన్ ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఈ ప్రాజెక్టు లక్ష్యాలను సిద్ధం చేశారు. యురోపాపై ప్రకృతి అస్తవ్యస్తంగా ఉండడాన్ని శాస్త్రవేత్తలు ఇది వరకే గుర్తించారు. దాని మంచు క్రస్ట్ కింద సముద్రం వంటి ప్రదేశాన్ని కనిపెట్టారు. అయితే, ఇది నీటితో ఏర్పడినదా లేక మరొకటా అన్నది తేలాల్సి ఉంది. యురోపాలో 'కొనమారా' అని పిలిచే ప్రాంతంలో ఉప్పునీరు పగుళ్లతోపాటు ఉపరితలంపైకి వచ్చినప్పుడు ఇలాంటి ఆనవాళ్లు కనిపిస్తాయని అంటున్నారు. అయితే, యురోపా నేలపై ఎర్రటి రంగులు ఏ విధంగా ఏర్పడ్డాయనే ప్రశ్నకు సరైన సమాధానం లేదు. యురోపా నేల పొరలపై నుంచి బయటకు వచ్చిన ఉప్పునీరే ఈ రంగులను వదలివేస్తుందన్న అభిప్రాయం శాస్త్రవేత్తల్లో ఉంది. అయితే, శాస్త్రబద్ధంగా ఇది రుజువుకావాల్సి ఉంది. ఈ ప్రశ్నకు యురోపా క్లిప్పర్ సమాధానం వెతుకుతుంది. బృహస్పతికిగల మంచు చంద్రుడు యురోపా ఉపరితలం క్రింద జీవానికి మద్దతు ఇచ్చే ప్రదేశాలు ఉన్నాయో లేదో నిర్ధారించడానికి అవసరమైన సమాచారాన్ని చేరవేస్తుంది. యురోపాకు అత్యంత దగ్గరగా చేరుకొని, దాని గురించి పరిశోధించడానికి వివరణాత్మక కొలతలను సేకరిస్తుంది. బృహస్పతి చుట్టూ ఉన్న కక్ష్యలో ఉన్న ఈ అంతరిక్ష నౌక, ఉపరితలం నుండి 16 మైళ్ళు (25 కిలోమీటర్లు) కంటే తక్కువ ఎత్తులో యురోపాకు దాదాపు 50 సార్లు ప్రయాణించి, ప్రతి ఫ్లైబై సమయంలో వేరే ప్రదేశంలో ఎగురుతూ దాదాపు మొత్తం చంద్రుడిని స్కాన్ చేస్తుంది. విస్తృత సమాచారాన్ని అందిస్తుంది. యురోపాపై సముద్ర ఆనవాళ్లు ఉన్నాయా? లేక అది కేవలం భ్రాంతి మాత్రమేనా అనే ప్రశ్నకు సమాధానం లభించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

## మెరుపు నుంచి విద్యుత్ సాధ్యమా?

మెరుపులు... ఉరుములు అనేవి మేఘాల మధ్య జరిగే విద్యుత్ పరిణామం. రెండు వేర్వేరు ధ్రువత్వంగల విద్యుదావేశాలతో ఏర్పడే పరిణామం. ఒక మేఘానికి మరో మేఘం దగ్గరలో లేనప్పుడు, మెరుపుగా పేర్కొనే విద్యుదావేశం అనేది ధ్రువత్వంతో సంబంధం లేకుండా, స్థిర విద్యుత్తును భూమివైపు ప్రసరింప



చేస్తుంది. కొన్ని లక్షల ఓట్ల శక్తిగల విద్యుత్తు భూమిపై చెట్లు లేదా భవనాలు సాయంతో భూమిలోకి చొచ్చుకుపోతుంది. దీనినే పిడుగు అంటారు. మెరుపులు, పిడుగులు లక్షలాది ఓట్ల శక్తిని ప్రసరింప చేయడం నిజం. అయితే, అది క్షణకాలం కూడా ఉండదు. రెప్పపాటులో జరిగే ఈ ప్రక్రియను ఉపోయోగించుకొని, అంతకంటే వేగంగా వాటి నుంచి విద్యుత్‌ను సంగ్రహించి, నిలువ చేసుకునే సామర్థ్యంగల సాధనాలు ప్రస్తుతానికి లేవు. భవిష్యత్తులో వస్తాయేమో చూడాలి.

## 'బెర్నార్డ్'కు నాలుగు గ్రహాలు



మన సౌర కుటుంబం వెలుపల, భూమికి సమీపంలో ఉన్న 'బెర్నార్డ్' నక్షత్రానికి నాలుగు చిన్నగ్రహాలు ఉన్నాయి. ఆస్ట్రోఫిజికల్ జర్నల్ తాజా సంచికలో ప్రచురించిన అధ్యయన పత్రాన్ని అనుసరించి, హవాయ్‌లో ఉన్న జెమినీ నార్త్ టెలిస్కోప్‌లోని మరూన్ఎక్స్ (MAROONX) స్పెక్ట్రోగ్రాఫ్‌ను ఉపయోగించి ఈ నక్షత్రాన్ని శాస్త్రవేత్తలు గత కొంతకాలంగా పరిశీలిస్తున్నారు. 2021–2023 మధ్యకాలంలో బెర్నార్డ్ నక్షత్రాన్ని 112 సార్లు పరిశీలించినట్టు చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన ఖగోళ శాస్త్రవేత్త రిత్విక్ బసంత్ ప్రకటించారు. కాగా, గత అక్టోబర్‌లో చిలీలోని టెలిస్కోప్ ద్వారా ఎస్‌ప్రెస్సో (ESPRESSO) స్పెక్ట్రోగ్రాఫ్‌ను ఉదయోగించి, ఈ నక్షత్రం చుట్టూ ఒక గ్రహం తిరుగుతున్నట్టు ఆధారాలు సేకరించారు. భూమి నుంచి ఆరు కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఈ నక్షత్రం, సూర్యుడి తర్వాత మనకు దగ్గరగా ఉన్న నక్షత్రం కావడం గమనార్హం. కాగా, బెర్నార్డ్ చుట్టూ నాలుగు చిన్న గ్రహాలు తిరుగుతున్నాయని తాజా అధ్యయనం స్పష్టం చేస్తున్నది. ఇవి ఎర్రటి రాతితో కూడుకొని ఉంటాయని భావిస్తున్నారు. ఈ నక్షత్రం చుట్టూ అంగారక గ్రహం కంటే రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువ ద్రవ్యరాశిని కలిగిన నాలుగు ఉపగ్రహాలు తిరుగుతున్న వైనాన్ని గుర్తించారు. తొలుత గుర్తించిన గ్రహానికి 'బి' అని పేరు ఖాయం చేయగా, తాజాగా కనుగొన్న మిగతా మూడింటికి వరుసగా 'సి', 'డి', 'ఇ' అని నామకరణం చేశారు. సూర్యుని ద్రవ్యరాశిలో ఏడవ వంతు ఉన్న బర్నార్డ్ నక్షత్రానికి ఈ గ్రహాలు చాలా దగ్గరగా ఉన్నాయి. అవి ఒక వారం కంటే తక్కువ సమయంలో దాని చుట్టూ తిరుగుతాయి. అంటే అవి నివాసయోగ్యంగా ఉండదని శాస్త్రవేత్తలు అంటున్నారు. వేగంగా తిరడం వల్ల అవి చాలా వేడిగా ఉంటాయని, జీవరాశి ఉనికికి ప్రమాదకరమని స్పష్టం చేస్తున్నారు. మారూన్ఎక్స్, ఎస్ప్రెసో అధ్యయనాలు రెండూ రేడియల్ వెలాసిటీ పద్ధతిని ఉపయోగించాయి. ఇది బర్నార్డ్ నక్షత్రం నుండి వచ్చే కాంతిలో కక్ష్యలో ఉన్న గ్రహాల గురుత్వాకర్షణ శక్తి వల్ల కలిగే మార్పులను గుర్తిస్తుంది. ఈ సాంకేతికత 1995లో మొట్టమొదటిగా తెలిసిన ఎక్సోప్లానెట్‌ను కనుగొనడంలో సాయపడింది. అప్పటి నుండి వందలాది గ్రహాలను ఈ సాంకేతికత ఆధారంగానే గుర్తించారు.

## నిత్యనూతనం..

శనిగ్రహాన్ని నిత్యనూతనమైనదిగా పేర్కోవచ్చు. ఎందుకంటే ఈ గ్రహానికి అనేక చంద్రులు ఉన్నాయి. కనీసం 145 ఉంటాయన్నది ఒక అంచనా. ప్రతి చంద్రుడికీ దాని సొంత ప్రత్యేక లక్షణాలు, రహస్యాలు ఉన్నాయి. సౌర వ్యవస్థలోనే రెండో అతిపెద్ద చంద్రుడైన టైటాన్‌ను ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. దాని చుట్టొ దట్టమైన వాతావరణం ఆవరించి ఉంటుంది. ఉపరితలం ఎప్పటికప్పుడు మారుతున్న క్రమంలో, ఈ చంద్రుడు ఎప్పుడు, ఏ విధంగా ఉంటాడన్నది ఎవరూ చెప్పలేని పరిస్థితి. ఒకసారి చూస్తే ఒక రకంగానూ, మరోసారి మరో కోణంలోనూ దర్శనమిస్తాడు. ఈ టైటాన్ అత్యంత శక్తివంతమైన రేడియో తరంగాలను ప్రసరిస్తుంది. ప్రత్యేకించి దాని ధ్రువాల వద్ద ఉన్న అద్భుతమైన ఆరోరాస్ వద్ద ఈ



తరంగాలు ఎక్కువ. గురుత్వాకర్షణ బృహస్మతి కంటే కొంత బలహీనంగా ఉన్నప్పటికీ, భూమితో పోలిస్తే చాలా ఎక్కువ. శని అయస్కాంత వాతావరణంతో టైటాన్ సంక్లిష్టమైన చర్యలకు లోనవుతూ ఉంటుంది. ఈ చంద్రుడిపై జీవం ఉండవచ్చన్న అభిప్రాయం కూడా శాస్త్రవేత్తల్లో బలంగా వినిపిస్తున్నది. అయితే, టైటాన్ చంద్రుడు మంచితో నిండివున్న కారంంగా, జీవితానికి అనువైన వాతావరణం కష్టమన్న అభిప్రాయం కూడా లేకపోలేదు. టైటాన్‌కు సంబంధించి కీలకమైన కర్బన సమ్మేళనాలను, బలమైన శక్తి వనరులను శాస్త్రవేత్తలు గురించారు. ఇది చంద్రుని జీవితానికి మద్దతునిచ్చే సామర్థ్యాన్ని సూచిస్తుంది. 'ఎన్సెలాడస్' నివాస స్థలం కోసం ప్రాథమిక అవసరాలను తీర్చడమేగాక, అక్కడ సంక్లిష్టమైన జీవ అంవులు ఎలా ఏర్పడతాయన్నది ప్రశ్న. అయితే, హార్వర్డ్ యూనివర్శిటీకి చెందిన పరిశోధనా విద్యార్థి జోనా పీటర్ అభిప్రాయం ప్రకారం, అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్త నాసా సేకరించిన సమాచారం జీవ ఉనికిపై సానుకూల ఆలోచనలకు తావిస్తున్నది. ఏది ఏమైనా శని గ్రహం.. దాని చంద్రులు నిత్యనూతనంగానూ, సరికొత్తగానూ కనిపిస్తూ శాస్త్రవేత్తలకు సవాళ్లు విసురుతునే ఉంటాయి.

## ప్రజా పోరాటాలతోనే పార్టీ సజీవం

### వనపర్తి సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రజా పోరాటాలతో సిపిఐ వందేళ్లయినా సజీవంగా నిలిచిందని పార్టీ వనపర్తి జిల్లా కార్యదర్శి కె.విజయరాములు అన్నారు. శుక్రవారం వీపనగండ్ల మండలం బొల్లారం సిపిఐ జెండా కట్ట వద్ద సిపిఐ శత జయంతి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. దేశంలో సిపిఐ పార్టీ ఆవిర్భవించి వందో సంవత్సరంలోకి అడుగుపెట్టిందన్నారు. దేశంలో, రాష్ట్రంలో సిపిఐ అధికారంలోకి రాకపోయినా కార్మికులు కర్షకులు పీడిత తాడిత బడుగు బలహీన వర్గాల ప్రజలు తలెత్తుకు జీవించేందుకు, హక్కులు పొందేందుకు సిపిఐ పోరాటం చేస్తూ వస్తోందన్నారు. దున్నే వాడికి భూమి, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, రుణమాఫీ, ఆసరా పించన్లు, కార్మికులకు కనీస వేతనాలు పార్టీ చేస్తున్న ప్రజా పోరాటాలతోనే ప్రజలకు అందుతున్నాయన్నారు. అధికారంలో లేకపోయినా సిపిఐ ప్రజల గుండెల్లో ఉందన్నారు. దేశంలో సిపిఐ ఆవిర్భావం తర్వాత పుట్టిన అనేక పార్టీలు, అధికారం కోల్పోగానే కనుమరుగయ్యాయన్నారు. పేదలకు సిపిఐ ఇచ్చే ధైర్యమే వేరన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, వీపనగండ్ల మండల కార్యదర్శి వంక గోపాల్, స్థానిక నాయకులు ఎం.కురుమయ్య, వేమన్న కృష్ణయ్య, కావలి తిరుపతయ్య, డి.శివ, వినోద్ , కేశవులు, ఆలీ బాబు, నాగేష్, బొక్కలయ్య, డి.కురుమయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థి, యువజన సమస్యలపై ఉద్యమాలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** భగత్‌సింగ్ ఆదర్శంగా విద్యార్థి, యువజన సమస్యలపై ఉద్యమాలు చేయాలని ఎఐఎస్ఎఫ్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జలగం ప్రవీణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశంలో శ్రావణ్, ప్రవీణ్‌లు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రోద్యమంలో అతి పిన్నవయసులోనే ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ ఉరికొయ్యలు ముద్దాడి ప్రాణాలను పణంగా పెట్టిన భగత్ సింగ్ వర్ధంతిని విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థులు, యువజనులు వారి సమస్యలపై భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. యువకులకు భగత్‌సింగ్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని, రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ యువ వికాస్ పథకంలో రేషన్‌కార్డులో పేరు నమోదు కాకుండా పెండింగ్‌లో ఉన్నవారికి సైతం అవకాశం కల్పించాలని, రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో విద్యార్థి, యువజన నాయకులు మేక వెంకటేష తండా శ్రీనాథ్, చిలువేరు వికాస్, జూలకంటి వేణు, సాయి, చెక్కల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగ వ్యతిరేక చర్యలు ఖండించండి

### రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు
### ఖమ్మంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం




**ప్రజాపక్షం/ఖమ్మం :** రైతాంగ వ్యతిరేక చర్యలను అవలంభిస్తూ న్యాయమైన డిమాండ్ల సాధనకు శాంతియుత మార్గంలో ఆందోళనలు నిర్వహిస్తున్న ఆందోళన శిబిరాలను ధ్వంసం చేయడం, రైతులను అరెస్టు చేయడాన్ని ఖండించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు కోరారు. రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని, మోడీ ప్రభుత్వానికి కూడా పతనం తప్పదని ఆయన హెచ్చరించారు. జగత్‌జిత్ సింగ్ దలైవాల్ నిరాహార దీక్ష శిబిరాన్ని బలవంతంగా తొలగించి ఆయనను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం తెలంగాణ రైతు సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అంతకు ముందు బైపాస్ రోడ్డులో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ జగత్‌సింగ్ దలైవాల్ శాంతియుతంగా 56 రోజులు నిరాహార దీక్ష చేస్తే ప్రభుత్వం సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి దీక్షను విరమింపజేసిందని గుర్తు చేశారు. శంభూ కలౌరీ ప్రాంతంలో పంజాబ్, హర్యానా ప్రభుత్వాలు హింసాత్మక చర్యలకు పాల్పడి బుల్‌డోజర్లతో దీక్షా శిబిరాలను ధ్వంసం చేశాయని హేమంతరావు తెలిపారు. నల్లచట్టాల రద్దు హామీ నాడే మద్దతు ధరపై కూడా హామీ ఇచ్చారని ఇప్పటికీ ఆరుసార్లు చర్చలు జరిపినా మద్దతు ధరపై ప్రభుత్వం తెల్చలేదన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంభించడంలో అన్ని ప్రభుత్వాలది ఒకటే దారి అని శంభూ కలౌరి ఘటన రుజువు చేసిందన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ పరం చేసే క్రమంలోనే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. రైతాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడిన గత ప్రభుత్వాలు ఏమయ్యాయో ఇప్పటి పాలకులు గుర్తుకు తెచ్చుకోవాలని బాగం హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, పోటు కళావతి, మిడికంటి వెంకటరెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, కూచిపూడి రవి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బానోత్ రాంకోటి, ఏలూరి భాస్కర్‌రావు, బానోత్ రవి, పగిడిపల్లి ఏసు, తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి, మద్దోజు శ్రావణ్, పదిమిల వెంకట నర్సయ్య, పోటు పూర్ణచందర్‌రావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మతతత్వశక్తులకు వ్యతిరేకంగా పోరాడుదాం : ఎఐవైఎఫ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ స్ఫూర్తితో మతతత్వశక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని ఎఐవైఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆరెపల్లి మానస్, మార్కపురి సూర్య పిలుపునిచ్చారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఎఐవైఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామంలో ఉరితాడును ముద్దాడిన యోధుడు సర్దార్ భగత్ సింగ్ జీవితం ఎంతోమంది యువకులకు ఆదర్శమన్నారు. బిటిష్ పాలకుల క్షమాభిక్షను నిరాకరించి ఉరితాడును ముద్దాడిన భగత్ సింగ్‌ను పక్కనబెట్టి బ్రిటిష్ పాలకుల క్షమాభిక్షపై బయటికి వచ్చి వారి అడుగులకు మడుగులొత్తిన సావర్కర్ జీవిత చరిత్రను ఈరోజు పాఠ్యపుస్తకాలో చేర్చడం దుర్మార్గ చర్య అన్నారు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా యువతకు భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసి ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్‌ను స్వాతంత్ర సమరయోధుడుగా గుర్తించి ఆయన జయంతి, వర్ధంతిలను ప్రభుత్వాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి, యువత భగత్‌సింగ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మత చాందసవాద రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాస్ పథకంలో రేషన్‌కార్డులో పేరు నమోదు కాకుండా పెండింగ్‌లో ఉన్నవారికి అవకాశం కల్పించాలని, రాష్ట్ర బడ్జెట్‌లో యువజన రంగానికి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు మాచర్ల అంజి, తాళ్లపల్లి సురేందర్, చంద్రగిరి ఉదయ్, నవీన్ పాల్గొన్నారు.




## నాలుగో తరగతి ఉద్యోగులుగా సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు






### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు డిమాండ్

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** సివిల్ సప్లై కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కాగజ్‌నగర్ మార్కెట్‌యార్డ్‌లో సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా 4వ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాసభల సందర్భంగా ఎఐటియుసి జెండాను బాలరాజు ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బోగే ఉపేందర్ అధ్యక్షతన జరిగిన మహాసభలో బాలరాజు ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను విడదీసి, కార్పొరేట్లకు అనుకూలంగా 4 కొత్త కార్మిక కోడ్‌లు రూపొందించారని, దీని వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్మిక వ్యతిరేకంగా ఉన్న ఈ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో హమాలీలు, స్వీపర్లు, దినసరి కూలీల కంటే తీవ్ర ఒత్తిడిలో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడా వ్యాపారులకు వందల కోట్ల రాయితీలు ఇచ్చే ప్రభుత్వం, పేద ప్రజలకు అన్నం సరఫరా చేసే సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌ను సేవా దృక్పథంతో కాకుండా వ్యాపార కోణంలో చూడటం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కు రావాల్సిన బకాయిలను బహిర్గతం చేయాలని, మిల్లర్ల నుండి వసూలు చేయాల్సిన రూ.11వేల కోట్లను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హమాలీ రేట్లను పెంచాలని, ఎఫ్‌సిఐ తరహాలో వారికి నాలుగవ తరగతి ఉద్యోగుల గుర్తింపు కల్పించాలని కోరారు. ఇఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, బోనస్‌ను 10,000 రూపాయలకు పెంచాలని, రిటైర్డ్ హమాలీలకు ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, గోడౌన్లలో కార్మికుల అవసరాన్ని బట్టి కొత్త ఉద్యోగాలు సృష్టించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26,000 రూపాయలు ఉండాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని బాలరాజు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, నాయకులు సుధాకర్, బుదాజి, దత్తు, సత్యనారాయణ, శంకర్, కొమురక్క, అమృత, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# స్థానికం REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్

## ఆస్తి పన్నులను వెంటనే వసూలు చేయాలి



ప్రజాపక్షం/కల్వకుర్తి: ఆస్తి పన్నులనువెంటనే వసూలుచేయాలని అదనపు కలెక్టర్ దేవస హాయం అధికారులను ఆదేశించారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణకేంద్రంలో గల మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్నులబకాయిలను మార్చి31లోపు వందశాతం వసూలుచేయాలని, కమర్షియల్ వ్యాపారస్తులకు ట్రేడ్‌లైసెన్సులు అందజేయాలని ఆఫీసర్లకు సూచించారు. పట్టణపరిధిలో ఎవరైనా ఆస్తిపన్ను చెల్లించకుండా బకాయిపడితే, కమర్షియల్ వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోకపోతే వారిపై తెలంగాణపురపాలకచట్టం 2019ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారికి తెలియజేయాలన్నారు. పట్టణపరిధిలో బకాయిలు ఉన్న ఆస్తిపన్నువెంటనే చెల్లించాలని, వ్యాపారస్తులు ట్రేడ్‌లైసెన్స్ పొందాలని ప్రజలనుకోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ మహ్మద్‌షేక్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## చెక్ డ్యాం నిర్మాణ పనుల ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/ బిజినేపల్లి: గంగారం ఫారెస్ట్ బీట్ లో ఆటవీ జంతువుల దాహార్తి తీర్చేందుకు మరి గట్టు సమీపంలో నిర్మిస్తున్న చెక్ డ్యామ్ ను నాగర్ కర్నూల్ ఎఫ్ఆర్వో దేవరాజు శుక్రవారం ఉదయం ఆకస్మీక తనిఖీ చేశారు. చెక్ డ్యాం నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ నాణ్యతగా ఉండాలని ఆదేశించారు. అలాగే నిర్మాణం పనులు పూర్తై తే వాటర్ క్యూరింగ్ పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సకాలంలో పనులు పూర్తి చేయించాలని గంగారం ఫారెస్ట్ సెక్షన్ అఫీసర్ చంటిని ఆదేశించారు. చెక్ డ్యామ్ పూర్తయితే వేసవిలో ఈ ప్రాంతంలోని వన్యమృగాల దహార్తిని తీర్చేందుకు పూర్తిస్థాయిలో ఈ చెక్ డాం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎఫ్ఆర్వో దేవరాజు చెప్పారు. అటవీ ప్రాంతంలో ఇప్పటికే సోలార్ పంపుసెట్లతోపాటు, పలుచోట్ల చెక్ డ్యామ్ నిర్మాణాలు చేపట్టి వేసవిలో వన్యమృగాల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేకమైన ఏర్పాటు చేసినట్లు ఎఫ్ ఆర్వో వివరించారు.

## తిలక్‌నగర్‌లో చోరీ



ప్రజాపక్షం/కల్వకుర్తి: పట్టణంలోని తిలక్ నగర్‌లోని శ్రీనుఅనే వ్యక్తి గురువారం తన ఇంటికితాళంవేసి పెళ్లికి బంధువుల ఇంటికి వెళ్లడంతో గుర్తు తెలియని దొంగలు ఇంట్లో బీరువాతాళాలుపగులకొట్టి మూడుతులాల బంగారం, 40తులాల వెండి ఆభరణాలతో పాటు కొంత నగదును దొంగలు తీసుకువెళ్లారని శ్రీను ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి క్లూస్‌టీం సహాయంతో దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

## ఆ ఘనత మందకృష్ణదే



ప్రజాపక్షం/ అడ్డాకుల: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు, ఏకగ్రీవంగా ఆమోదం పొందడం మాదిగ ఉపకులాలకు శుభదినం అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డిఎస్. మహేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిఎస్.మహేష్ మాట్లాడుతూ,ఇది పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో, సాధించుకున్న విజయమని కోనియాడారు. మాదిగ అమరుల త్యాగాలు, మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగా అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిందని తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, మాదిగ అమరవీరుల కుటుంబాలకు, సుధీర్ఘంగా 30 ఏళ్ల పాటు ఉద్యమం చేసిన ఎంఆర్‌పిఎస్ ఉద్యమకారులకు, మంద కృష్ణ మాదిగలకు అన్ని పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ అంటేనే సామాజిక న్యాయం. కాంగ్రెస్ అంటేనే పేద ప్రజల సంక్షేమ, సీఎం రేవంత్ రెడ్డి అంటేనే ప్రజా పాలన. తెలంగాణ రాష్ట్రంలో 23 శాతం ఉన్న, బీసీ రిజర్వేషన్లు, నేడు 42% చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని, గత 30 సంవత్సరాల నుండి, ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో పోరాటాలు జరిగాయి, వారి కళలను సాకారం చేసింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి , నాగర్ కర్నూల్ ఎం.పి. డాక్టర్।। మల్లురవి కి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి కి, ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, బడుగు, బలహీన వర్గాల, దళిత వర్గాల ప్రజలు ప్రజా పాలన ప్రభుత్వాన్ని మరె పదేళ్లు దీవించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డిఎస్.మహేష్ అన్నారు.

## బస్సు ప్రమాదంలో రేషన్ డీలర్ మృతి



ప్రజాపక్షం/పెబ్బేరు: పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ కాలనీ సమీపంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు ఢీ కొనడంతో చెలిమేళ్ల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ హన్మంతు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన జరిగిన వెంటనే స్థానిక పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని ఉదయాన్నే మార్చురీ కోసం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

## సిఎం సహాయ నిధి పేదలకు కొండంత ధైర్యం

ప్రజాపక్షం/పెబ్బేరు: పెబ్బేరు మండల పట్టణ కేంద్రానికి చెందిన 16 మందికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి ఆదేశాల మేరకు పెబ్బేరు పట్టణ కేంద్రంలో బాధితులకు నేరుగా వారి చేతులకు రూ. 400500 రూపాయల విలువ గల చెక్కును లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ , మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి మాట్లాడుతూ ఆపదలో అనారోగ్యంలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ భారీ ఉపశమనాన్ని కలిగిస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు మన్యం , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంపురం సహదేవుడు, జనంపల్లి మహేశ్వర్ రెడ్డి, తోమాలపల్లి కృపాకర్ రెడ్డి, అయ్యవారిపల్లి ఆనంద్ సాగర్ , సూగురు మాజీ సర్పంచ్ రాజశేఖర్ గౌడ్ , గుమ్మడం హరి కుమార్ రెడ్డి, వల్లపురెడ్డి , రణధీర్ , రెడ్డి, చంద్రశేఖర్ , తిప్పాయిపల్లి , ఎల్ల స్వామినాయుడు, నవీన్ గౌడ్ , బొట్టు శ్రీను, కురుమన్న, ఆనంద్ సాగర్ , రాములు, పరమేశు , రాజునాయక్ , సురేష్ , బాధితులు పాల్గొన్నారు.

## మత్స్య కారుల ముందస్తు అరెస్టు

ప్రజాపక్షం/బిజినేపలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో మత్స్యకారుల సంక్షేమం కోసం నిధులు కేటాయించకపోవడంపై మత్స్యకారులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా బిజినపల్లి మండల మత్స్యకారులను బిజినపల్లి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన మత్స్యకార సంఘం ముఖ్య నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు మాట్లాడుతూ సంఘం నాయకులు తుమ్మలల్లోజి డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం జిల్లా డైరెక్టర్ ముస్కారి బంగారయ్య వివిధ గ్రామాల మత్స్యకార నాయకులు తదితరులున్నారు.

# టన్నెల్‌లో నీటి తొలగింపునకు టిబిఎం భాగాలు కత్తిరింపు





ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి: ఎస్ఎల్‌బిసి టన్నెల్ ఆఫీసువద్ద సహాయకబృందాల ఉన్నతాధికారులతో టన్నెల్ ప్రమాదప్రదేశంలో డి1,డి2 ప్రదేశాలలో సహాయక బృందాలు కొనసాగిస్తున్న సహాయక చర్యలపై శుక్రవారం జిల్లా కలెక్టర్‌బదావత్‌సంతోష్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. టన్నెల్‌లో చిక్కుకున్నవారిని గుర్తించేందుకు కొనసాగుతున్న సహాయక చర్యల పురోగతిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. సహాయకబృందాల సహాయక చర్యలు ప్రధానంగా టన్నెల్‌బోరింగ్‌మెషిన్ భాగాలను కత్తిరించడం, అవి తొలగించడం, టన్నెల్‌లో చేరిననీటిని బయటకుపంపించే విధానంపై కేంద్రీకృతమై ఉన్నట్లు తెలిపారు. సహాయకబృందాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. టిబిఎంలోని కీలకభాగాలను ప్రత్యేకంగా కత్తిరించి వాటిని తొలగించేందుకు ఆధునాతన యంత్రాలు ఉపయోగిస్తున్నామని, నిరంతరాయంగా ఈప్రక్రియ కొనసాగిస్తున్నామని తెలిపారు. టన్నెల్‌లో నిల్వ ఉన్న నీటితో వాటర్‌జెట్‌ద్వారా బురదను తొలగించే ప్రక్రియ, ఎస్కావేటర్లద్వారా మట్టిని కన్వేయర్‌బెల్టుపై తరలించే ప్రక్రియపై వివరంగా చర్చించారు. సహాయకబృందాలకు అవసరమైన ఆక్సిజన్ సిలిండర్లను నిరంతరాయంగా సరఫరా చేస్తున్నట్లు, అల్ట్రాథర్మల్ కట్టర్లతో టన్నెల్ బోరింగ్‌మెషిన్ భాగాలను తొలగిస్తున్నట్లు తెలిపారు. సహాయకచర్యలపై ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తూ కొనసాగించాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఉన్నతాధికారులు సహాయక బృందాల సేవలను నిరంతరం పర్యవేక్షిస్తూ సహాయక చర్యల వేగాన్ని పెంచినట్లు వివరించారు. ఈసమీక్ష సమావేశంలో ఆర్మీ అధికారులు కల్నల్ పరిక్షిత్ మెహర, వికాస్‌సింగ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ అధికారులు, డాక్టర్ హరిష్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, దక్షిణ మధ్యరైల్వే అధికారులు, ర్యాట్ హోల్‌మైనర్స్, అన్వి రోబోటిక్స్, కేరళ రెస్క్యూ బృందం, జేపి కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి: కలెక్టర్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి: జిల్లావ్యాప్తంగా పదోతరగతి విద్యార్థులకు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్నిరకాల సౌకర్యాలను కల్పించినట్లు, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా, నిర్భయంగా పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం పదోతరగతి పరీక్షల సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం దోమలపెంట ప్రభుత్వ ప్రాజెక్టు ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పరీక్షా కేంద్రంలోని సదుపాయాలను పరిశీలిస్తూ పరీక్షా కేంద్రంలోని అన్ని తరగతి గదులను పర్యవేక్షించిన కలెక్టర్ పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను, తాగునీటి వసతిని, విద్యార్థులు పరీక్షలురాసే గదుల్లో గాలి, వెలుతురు విస్తారంగా అందేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



## అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరు



ప్రజాపక్షం/వీపనగండ్ల : రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించి ఉద్యమాలను అణచివేయలేరని సిఐటియూ మండల నాయకులు ఆశన్న ఆరోపించారు. శుక్రవారం బిల్డింగ్ వర్కర్స్ సమస్యపైన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని వెళ్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకొని అక్రమంగా అరెస్టు చేయడం సబబు కాదని ఆశన్న అన్నారు. 60 సంవత్సరాలు నిండిన బిల్డింగ్ కార్మికునికి పెన్షన్ 10వేలు ఇవ్వాలని, వారి కుటుంబంలో విద్యార్థులకు స్కాలర్షిప్ లు వర్తింపజేయాలని పెండింగ్ లో ఉన్న 11 లక్షల లేబర్ ఇన్సూరెన్స్ కార్డులను వెంటనే విడుదల చేయాలని కోరారు. హైదరాబాద్ లో కమిషన్ ఆఫీస్ దగ్గరికి వెళ్తుండగా పోలీసులు బిల్డింగ్ వర్కర్స్ ను అడ్డుకోవడం జరిగిందని ఆయన ఆరోపించారు. అరెస్టు అయిన వారిలో సిఐటియూ నాయకులు వెంకటేష్ గౌడ్ , రామన్ గౌడ్ , లక్ష్మణ్ , రాముడు, రఘు ఉన్నారు.

## అనుమతులను నిర్దేశిత గడువులోగా మంజూరు చేయాలి

కలెక్టర్ విజయేందిర బోయి



ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి: జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ టి.జి ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వివిధ శాఖల నుండి మంజూరు చేయవలసిన అనుమతులను నిబంధనల మేరకు నిర్దేశిత గడువులోగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి హాజరై ఆమె మాట్లాడారు. టి ఫ్రైడ్ ద్వారా షెడ్యూల్డ్ కులాల వారికి ఒకరికి ట్రాన్స్‌పోర్ట్ సెక్టర్ కింద ఒక కార్,షెడ్యూల్డ్ తెగల వారికి ఇద్దరికి కార్, ట్రాక్టర్ అండ్ ట్రైలర్స్ వాహనాలకు, పెట్టుబడి సబ్సిడీ మంజూరు కు కమిటీ లో ఆమోదం తెలిపారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ లలో కనీస సదుపాయాలు సంబంధించి చిన్నచిన్న పనులు ఉంటే చేయాలని టిజిఐఐసి జోనల్ మేనేజర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ పి.ప్రతాప్ రెడ్డి, ఎల్‌డియం భార్కస్, భూగర్భజల వనరుల శాఖ డి.డి. రమాదేవి, టిజిఐఐసి జోనల్ మేనేజర్ శ్రావణ్ కుమార్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

పదవ తరగతి పరీక్షలను ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వం ఉన్నత పాఠశాల, మహాత్మా గాంధీ రోడ్, క్రీస్తు జ్యోతి విద్యాలయం, భూత్పూర్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పరీక్ష కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షల నిర్వహణ తీరును శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు.

జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి తొలి రోజు పరీక్షలకు మొత్తం 12785 మంది విద్యార్థులు నమోదు కాగా వీరిలో 12744 మంది హాజరై 99.68 హాజరు శాతం నమోదయ్యిందని 41 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్క దివ్యాంగుడికీ ఒక ప్రత్యేకమైన గుర్తింపు కార్డు

ప్రజాపక్షం/వనపర్తి: జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో యూనిక్ డిజేబుల్ ఐడి అంశంపై ఎంపీడీఓలు, మీ సేవ ఆపరేటర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క దివ్యాంగుడికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు కార్డు ఉండాలని ప్రభుత్వం యూడిఐడిని అమల్లోకి తీసుకొచ్చిందని చెప్పారు. రానున్న రోజుల్లో యూడిఐడి పోర్టల్ ద్వారానే దివ్యాంగులకు ధృవపత్రాలు జారీ చేయడం జరుగుతుందని చెప్పారు. యూడిఐడి కార్డు కోసం దివ్యాంగులు ఆన్‌లైన్ ద్వారా అప్లై చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ లో అప్లై చేసి లాగిన్ చేసుకున్న తర్వాత స్లాట్ బుక్ చేసుకోవడం ద్వారా, వైద్యులు, అసిస్మెంట్ చేయడానికి తేదీ నిర్ధారించడం జరుగుతుందన్నారు. వైద్యుల అసిస్మెంట్ పూర్తయిన తర్వాత దివ్యాంగులకు యూడిఐడి కార్డు పోస్టు ద్వారా ఇంటికి వస్తుందని చెప్పారు. దివ్యాంగులకు యూడిఐడి అప్లై చేసే విషయంలో మీ సేవ ఆపరేటర్లది కీలక పాత్రని, ఆన్‌లైన్ లో అప్లై చేసే సమయంలో దివ్యాంగుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని చెప్పారు. ఫోన్ నంబర్ ఇంటి అడ్రస్ సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఈ విషయంలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు మీ సేవ ఆపరేటర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, డిఆర్డీఓ ఉమాదేవి, డిఎంహెచ్ఓ శ్రీనివాసులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



ప్రజాపక్షం/నారాయణపేట: ఓటరు జాబితా రూపకల్పన, నవీకరణకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఓటరు జాబితా పరిశుద్ధత చాలా ముఖ్యమైనదని, అర్హులైన ప్రతి ఒకరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిది అని ఆమె తెలిపారు. గత సంవత్సరం నవంబర్ నుండి ఈ నెల 20వ తేదీ వరకు నూతన ఓటరు నమోదుకు నారాయణపేట నియోజకవర్గంలో ఫారం 6 ద్వారా 1294 దరఖాస్తులు రాగా 1068 విచారణ పూర్తి చేశారని, 48 పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ఫారం 7కు 169 రాగా , 141 విచారణ జరిగిందని, 8 పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. చిరునామా మార్పుకు 1529 దరఖాస్తులు వచ్చాయని వాటిలో 1359 విచారణ పూర్తి కాగా 71 పెండింగ్ ఉన్నాయన్నారు. మిగతావి తిరస్కరణకు గురయ్యాయని, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షా లోమ్ తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలో ఫారం 6 ద్వారా 1690 దరఖాస్తులు వచ్చాయని వాటిలో ఇప్పటి వరకు 1269 విచారణ పూర్తి కాగా 147 పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. ఫారం 7 ద్వారా 332 దరఖాస్తులు రాగా, 233 విచారణ పూర్తి కాగా , 26 పెండింగ్ లో ఉన్నాయని, చిరునామా మార్పు కోసం 1908 దరఖాస్తులు రాగా, 1625 విచారణ పూర్తికాగా , 156 పెండింగ్ లో ఉన్నాయని, మిగతావి తిరస్కరణకు గురయ్యాయని ఆయన వివరించారు. ఫారం 7 ద్వారా నోటీస్ జారీ తదుపరి మాత్రమే ఓటు హక్కు తొలగించాలని, సుమోటో గా తొలగించడానికి అవకాశం లేదని తెలిపారు. అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడం, రెండు ఓట్లున్న ఓటర్లను తొలగించే ప్రక్రియలో రాజకీయ పార్టీలు తమ కార్యకర్తల ద్వారా సరైన ఓటరు వివరాలను అందించేందుకు ముందుకు రావాలని, ఈ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా సహకరించాలని ఆయనకోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామచంద్రనాయక్ , డిటి బాల్ రాజ్ , ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అఖిల ప్రసన్న, రాణిదేవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సుదర్శన్ రెడ్డి, సోషల్ వినోద్ , సలీం, వెంకట్రాంరెడ్డి, ఆశోక్ , అజయ్ , వెంకటేష్ , తాహీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## పిఎం విశ్వకర్మ దరఖాస్తులను పరిష్కరించండి




ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి: వనపర్తి జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాల్టీల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పీఎం విశ్వకర్మ పథకానికి సంబంధించిన దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వివిధ కులవృత్తులకు సంబంధించిన పీఎం విశ్వకర్మ కింద ఎంపికై శిక్షణ తీసుకున్న లబ్ధిదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం వారికి ధృవపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ పథకాన్ని వృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఎం విశ్వకర్మ పథకం కింద చేతివృత్తుల వారికి శిక్షణ ఇచ్చిన సింక్రోస్ సర్వ్ ఏజెన్సీకి కలెక్టర్ అభినందనలు తెలిపారు. శిక్షణ తీసుకున్న వారంతా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాల్లో మున్సిపాల్టీల్లో , పెండింగ్ లో ఉన్న పీఎం విశ్వకర్మ అప్లికేషన్లను వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. ధృవపత్రాలు అందుకున్న వారిలో 37 మంది కుమ్మరి చేతి వృత్తుల వారు, 33 మంది శిల్పి శిక్షణ పొందిన వారు , మరికొందరు ఇతర చేతివృత్తుల్లో శిక్షణ పొందిన వారు ఉన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఎంఎస్ఎంఈ ఏడి శివరాం ప్రసాద్ , పరిశ్రమల శాఖ జీఎం జ్యోతి, బిజీ సంక్షేమ అధికారి ఇందిరా, పరిశ్రమల శాఖ అధికారి నాగేష్ , ఎల్‌డిఎం కౌశల్ , కిషోర్ పాండే, అసిస్టెంట్ ఎల్‌డిఎం సాయి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అధికారికి ఇంకా అందలం ఎందుకు?

ఒకరిని సస్పెండ్ చేసినా.. ఇంకొకరిని ఎందుకు కాపాడుతున్నారు ..?

బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



ప్రజాపక్షం/వనపర్తిటౌన్: సివిల్ సప్లయ్ శాఖలో ధాన్యం పేరుతో కోట్లాది రూపాయలు దండుకున్న వినీతి అధికారి కాశీ విశ్వనాథ్ ను ఇంకా ఎన్ని రోజులు అందలం ఎక్కిస్తారని బీసీ పోలిటికల్ జేఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాశీ విశ్వనాథ్ వనపర్తి డిఎస్ఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, జిల్లాలో దాదాపు 40 మిల్లులకు అర్హత ఉన్నా తప్పుడు సమాచారంతో పక్క జిల్లాలకు ధాన్యం కేటాయించారన్నారు. సస్పెండైన పాత డీఎం ఇర్ఫాన్ , డిఎస్ఓ కాశీ విశ్వనాథ్ తోడు దొంగల్లా దోపిడి చేసి ఫిజికల్ వెరిఫికేషన్ పేరుతో వసూళ్లకు పాల్పడి ఆపై వాటాలేసుకున్నారని మండిపడ్డారు. సస్పెండ్ వరకు వెళ్లి డిఎస్వో ఎంత ముడుపులు ఇస్తే ఇక్కడ కొనసాగించేందుకు ఉన్నతాధికారులు ఒప్పుకున్నారని ప్రశ్నించారు. డీ ఫాల్టర్ల మీద కేసులు నమోదు చేశామని చెబుతున్న అధికారులు ధాన్యం రికవరీపై దృష్టి ఎందుకు పెట్టడం లేదో చెప్పాలన్నారు. ఈ విషయంపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్ , పట్టణ అధ్యక్షులు దేవర శివ, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్ , పెద్దమందడి మండల అధ్యక్షుడు రమేష్ సాగర్ , శేఖర్ గౌడ్ , రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పటిష్ట బందోబస్తు మధ్య టెన్త్ పరీక్షలు

ప్రజాపక్షం/వనపర్తి టౌన్: వనపర్తి జిల్లాలో మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే పదవ తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఉన్న పదవ తరగతి వార్షిక పరీక్ష కేంద్రాలు సరస్వతి శిశు మందిర్ స్కూల్ , హరిజనవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రం పరీక్షలు జరుగుతున్న సరళిని పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు సిబ్బందికి పటిష్టమైన బందోబస్తు గురించి తగు సూచనలు , సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ 163 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. జిల్లాలోని 36 పరీక్ష కేంద్రాలలో 6853 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారని తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు జరిగే సమయంలో సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సిఐ కృష్ణ, వనపర్తి పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ , పోలీస్ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

## బిసి బిల్లు దేశానికే మార్గదర్శకం

ప్రజాపక్షం/కల్వకుర్తి: బిసిబిల్లు దేశానికే మార్గదర్శకమని మాజీమంత్రి చిత్తరంజన్‌దాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీమంత్రి కేటిఆర్ కులగణన శాస్త్రీయంగా చేయలేదని తప్పుడు ప్రచారంచేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ప్రతిపాదిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం చారిత్రాత్మకమని రాష్ట్ర అసెంబ్లీలో 42శాతం బిసిలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టబద్దతచేసిన కాంగ్రెస్‌పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఇదిచరిత్రలో సువర్ణ అక్షరాలతో లెక్కించేరోజని బిసిలు రాజకీయంగా,విద్య, ఉద్యోగాలతోపాటు ఆర్థిక, సామాజికంగాలబ్ధి పొందుతారని అన్నారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లుపాసైనందున చాలా సంవత్సరాల కల నెరవేరిందన్నారు. ధైర్యంగా బిసిబిల్లు, ఎస్‌సి వర్గీకరణ బిల్లులను ధైర్యంగా చట్టసభలలో ఆమోదింపచేసిందని ఇదిప్రజలు గమనించాలని కోరారు. బహుజన హృదయాలలో చెరగనిముద్ర వేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. ఈ సమావేశంలో మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, మాజీ జడ్పిటిసి హరిదాస్, పెద్దయ్యయాదవ్, గోపాల్, సైదులుయాదవ్, శేఖర్, లక్ష్మయ్య ఉన్నారు.

## అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చొరవ చూపాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన నేరేడుచర్ల సిపిఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల వేతనాలు పెంపు, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్, విఆర్ఎస్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లాంటి అనేక సమస్యలతో నానా అవస్థలకు గురవుతున్నారని, తెలంగాణలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని , కేంద్ర ప్రభుత్వం అడుగుజాడల్లోనే రాష్ట్రప్రభుత్వం నడవడం బాధకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారితో చర్చలు జరిపి, పరిష్కారానికి ఐఎఎస్ అధికారులతో కమిటి వేసి ఆ ప్రతిపాదన ఆధారంగా చర్యలు తీసుకుంటామని ప్రకటించినప్పటికీ ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని కోరారు. ఆయన వెంట ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీను, ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటి సభ్యుడు లింగనాయక్ పాల్గొన్నారు.

## రంజాన్ మాసం ఎంతో పవిత్రం

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ముస్లింలు ఎంతో నిష్టతో నెలంతా దీక్షలు చేస్తారని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి లు అన్నారరు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్ మదీన మసీదులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యువజన అధ్యక్షులు కరీముల్లా జావిద్‌బేగ్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను జరుపుకోవాలని సూచించారు. సమాజంలో అందరు కలిసి మెలసి జీవించినప్పుడే తమ సామరస్యం వెల్లివిరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు అభి మౌలానా, జహీర్, పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, తంగేళ్ల కరుణాకర్‌రెడ్డి, గోదాల రంగారెడ్డి, సంజయ్, చెంచల నిఖిల్‌నాయుడు, రాపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



**ప్రజా పక్షం/ నల్లగొండ :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కె.వి.కృష్ణవేణి అన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవో భవన్ స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. మహిళలు కష్టపడి పని చేస్తే అన్ని రంగాలలో రాణించవచ్చని, అందుకు ప్రభుత్వం ఎన్నో విధాలుగా కృషి చేస్తుందని అన్నారు. ప్రతి ఇంట్లో మహిళ చదువుకుంటే ఆ ఇల్లు విద్యాలయంగా పెంపొందుతుందని అన్నారు. నాటి నుంచి నేటి వరకు మహిళ చేస్తున్న కృషి ఎనలేనిగాని అన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను, అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి చరిత, ఉద్యాన శాఖ అధికారి శ్వేత, ఏపీ డి నారద, జి సి డి ఓ సరిత, ప్రాజెక్టుల సిడిపిఓలు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

## దొంతిరి జోగిరెడ్డి మరణం బాధాకరం



**ప్రజాపక్షం/మోటకొండూరు :** దొంతిరి జోగిరెడ్డి మరణం బాదాకరం అని, ఆయన లేని లోటు సిపిఐకి, అతని కుటుంబ సభ్యులకు తీరని లోటని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. ఆయన శుక్రవారం మోటకొండూర్ మండలంలోని తేర్యాలలో సిపిఐ సీనియర్ నాయకులు దొంతిరి జోగిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలిసి అతని దశ దిన కర్మలో పాల్గొని జోగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ జోగిరెడ్డి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో నిబద్ధత కల నాయకుడని తేర్యాలలో మూడు పర్యాయములు సిపిఐ అభ్యర్థులను సర్పంచ్‌గా గెలిపించిన నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శనిగల భాగ్యమ్మ అధ్యక్షత వహించగా సిపిఐ మండల కార్యదర్శి గాధగాని మాణిక్యం, ఎండి శంషుద్దీన్, జైపాల్ రెడ్డి, దొంతి కమలాకర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, పల్లపాటి వంశీ, శంకరయ్య, శీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకై బోలర్స్, బ్లింకర్స్ ఏర్పాటు : ఏసిపి రమేష్‌కుమార్

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని భువనగిరి గజ్వేల్ ప్రధాన రహదారి ముల్కలపల్లి శివారు,జేథీరాం తండా వద్ద కెనాల్ వద్ద ప్రమాదకరమైన మూలమలుపు వద్ద నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో తుర్కపల్లి పోలీసులు ఏర్పాటు చేసిన బోలరడ్స్, బ్లింకర్స్, భారికేడ్స్ యాదాద్రి డివిజన్ ఎసిపి రమేష్ కుమార్ శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలను అరికట్టేందుకు బోలరడ్స్ బ్లింకర్స్ ఏర్పాటు చేశామన్నారు. వీటివల్ల ప్రమాదాలను కొంతవరకు నివారించేందుకు ఆస్కారం ఉంటదని తెలిపారు. ప్రయాణికులు వేగ నియంత్రణతో ప్రయాణాలు కొనసాగించాలని, ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ ఎలిగొండ కృష్ణ, యాదగిరిగుట్ట రూరల్ సిఐ కొండల్ రావు, తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్, ట్రాఫిక్ ఆర్ఎస్సై రాజు, కానిస్టేబుల్ రోడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ సమ్మయ్య, క్రాంతి కుమార్, సలీం, నర్సింహ, శివ, రవి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# పోచంపల్లి మండలంలో 'బర్డ్ ఫ్లూ'

ఆ పౌల్ట్రీ పరిసర ప్రాంతంలో నిషేధాజ్ఞలు

నమూనాలతో బర్డ్ ఫ్లూ ఎఫెక్టెడ్ పౌల్ట్రీగా దోతి గూడెం శ్రీనివాస పౌల్ట్రీ నిర్ధారణ. డిస్ట్రాయింగ్ ప్రాసెసింగ్‌కు ప్రభుత్వం వెటర్నరీ ఉన్నతాధికారులు ఆదేశం

కోళ్లను పెంచకుండా మూడు నెలల వరకు పౌల్ట్రీ సీజ్

పౌల్ట్రీ మొత్తం క్లీన్ చేయాలని హైదరాబాద్ విబిఆర్ఐ డాక్టర్ సునీత ఆదేశం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతి గూడెం గ్రామంలోని శ్రీనివాస పౌల్ట్రీలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లు అధికారులు నమూనాల ద్వారా నిర్ధారించిన దరిమిల ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వెటర్నరీ వైద్యుల బృందం పౌల్ట్రీ కల్లింగ్ ప్రాసెసింగ్ మొదలుపెట్టి ఆ పరిసర ప్రాంతాలలో ప్రజలు తిరగకుండా నిషేధాజ్ఞలు జారీ చేశారు. దీంతో జిల్లా మండల వ్యాప్తంగా బర్డ్ ఫ్లూ జోనుగా ప్రజల్లో కలకలం మొదలైంది. డివిఏహెచ్‌ఓ డా పి.జానయ్య వెటర్నరీ వైద్యుల బృందం నేతృత్వంలో 32 రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లతో పౌల్ట్రీ మొత్తం ఎలాంటి ఫ్లూ ఆనవాళ్లు లేకుండా డిజైన్ఫక్ట్ చేసేందుకు రంగంలోకి దిగారు. అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం దాదాపు 40 వేల కోళ్లను కల్లింగ్ చేసి నులిమి చంపి పెద్ద పెద్ద గోతులు తవ్వి రసాయనాలు కలిపి గ్రుడ్లతో సహా పూడ్చారు. పౌల్ట్రీ ఫామ్ అన్నింటిని రసాయనాలతో సానిటైజ్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. 17 వేల కోళ్ల గ్రుడ్లె కాకుండా ఫీడ్స్ ఇతరత్రా కోళ్లకు సంబంధించిన అన్ని వస్తువులను గోతిలో పూడ్చారు. కోళ్ల ఫారాల షెడ్లు రసాయనాలతో శానిటైజ్ చేసిన అనంతరం ఎలాంటి బ్యాక్టీరియాలు వైరస్ ఆనవాళ్లు లేకుండా బర్నింగ్ ప్రాసెసింగ్ కూడా చేస్తామని అధికారులు తెలిపారు. పౌల్ట్రీ పరిసర ప్రాంతాలను పూర్తిగా ఫార్మలిన్ సోడియం హైపోక్లోరైడ్ రసాయనాలతో సానిటైజ్ శుభ్రం చేసిన తర్వాత మూడు నెలల వరకు పౌల్ట్రీని నిర్వహించకుండా సీజ్ చేసినట్లు, కిలోమీటర్ రేడియస్ మేరకు పరిసర ప్రాంతాలను బార్లు బర్డ్ ఫ్లూ ఎఫెక్టడ్ నిషేధిత ప్రాంతంగా ప్రకటన బోర్డులను కూడా ఏర్పాటు చేసినట్లు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పౌల్ట్రీ కి సంబంధించిన కోళ్ల మాంసాన్ని గుడ్లను ఎట్టి పరిస్థితుల్లో అమ్మకాలు కొనుగోల్లు చేయకూడదని హెచ్చరించారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో ఆందోళన చెందవలసిన పనిలేదని బర్డ్ ఫ్లూ మనుషులకు సోకే వైరస్ కాదని ఒకవేళ చిన్నచిన్న ఇతర ప్రభావాలు చూపుతాయి కాబట్టి నిషేధిత ప్రాంతాలకు ఎట్టి పరిస్థితుల్లో వెళ్ళకూడదని ప్రజలను కోరారు.

**బర్డ్ కల్లింగ్, శానిటైజ్ చేశాక మూడు నెలల వరకు పౌల్ట్రీ సీజ్ :** విబిఆర్ఐ జాయింట్ డైరెక్టర్ డా సునీత పౌల్ట్రీలో బర్డ్ కల్లింగ్ ప్రాసెస్ పూర్తి చేసి పౌల్ట్రీ ఫామ్ పూర్తిగా శానిటైజ్ చేశాక ఫ్లూ రహిత ప్రాంతంగా చేసిన మూడు నెలల వరకు పౌల్ట్రీ నడపకుండా సీజ్ చేశామని, అధికారులు వెటర్నరీ వైద్య బృందం కల్లింగ్ ప్రాసెస్ ను ఏ మేరకు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారో తనిఖీ కోసం సందర్శించినట్లు హైదరాబాద్ విబిఆర్ఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీత తెలిపారు. మూడు నెలల వరకు నిషేధిత ప్రాంతంగా బోర్డులు నాటాలని అధికారులను ఆదేశించారు. ఎలా కల్ చేయాలి? ఫీడ్స్, లిఫ్టర్ ఇతరత్రా వస్తువులన్నింటిని ఎలా పూడ్చాలి? ఎలా సానిటైజ్ చేయాలి వంటి విషయాలను అధికారులకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు.

**బర్డ్ ఫ్లూతో ఆందోళన చెందవద్దు.. సమర్థవంతంగా కల్లింగ్ ప్రక్రియ : డివిఏహెచ్‌ఓ డా. పి జానయ్య**

యాదాద్రి జిల్లాలో మొదట నేలపట్లలో బర్డ్ ఫ్లూ ఎఫెకట్డ్ పౌల్ట్రీగా రెండవది దోతిగూడెం గ్రామంలోని శ్రీనివాస పౌల్ట్రీ కంపెనీ నిర్ధారణ అయిందని దాన్ని సమూలంగా డిస్ట్రాయ్ చేసేందుకు తమ వైద్య బృందం చర్యలు చేపట్టామని డివిఏహెచ్‌ఓ డాక్టర్ పి జానయ్య స్పష్టం చేశారు. బర్డ్ ఫ్లూ సోకిందని సమాచారంతో ఈ నెల 12న 500కోళ్ళు చనిపోయినట్లు తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందించి పౌల్ట్రీ ఫార్మ్ ను విసిట్ చేసి చనిపోయిన కోళ్లను పరీక్షించి, అందులో ఒక నాలుగు కోళ్లను వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ కి తదుపరి వ్యాధి నిర్ధారణ కొరకు పంపడం జరిగింది. స్టేట్ లెవల్ ఇన్స్టిట్యూట్ వాళ్లు నేషనల్ లెవెల్ హై సెక్యూరిటీ అనిమల్ డిసీస్ భూపాల్ మధ్యప్రదేశ్ స్టేట్ కి ఈ చనిపోయిన కోళ్ల శాంపుల్స్ ని తదుపరి వ్యాధి నిర్ధారణ కోసం మధ్యప్రదేశ్ భోపాల్ పంపడం జరిగింది. డైరెక్టర్ నుంచి వచ్చిన రిపోర్ట్ ప్రకారం కలెక్టర్ మెజిస్ట్రేట్ యాదాద్రి భువనగిరికి చూ పించి వారి నోటిఫికేషన్ తమ బృందం పౌల్ట్రీ ఫార్మ్ ని సందర్శించి కల్లింగ్ ఆపరేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. శ్రీనివాస పౌల్ట్రీ నీ నడుపుతున్న సుదర్శన్ రెడ్డి యజ మాని కోళ్ల ఫామ్‌లో దాదాపు 40 వేల కోళ్లను కల్లింగ్ చేసి ఆయన సొంత భూమిలో పూడ్చినట్లు తెలిపారు. ప్రతి బర్డ్‌కు ప్రభుత్వం రు.140 నష్టపరిహారం చెల్లిస్తుం దని వివరాలు చెప్పారు. జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డా. శ్రీనివాస్ డా. గోపిరెడ్డి డా.ఇందిరా, డా మోతి లాల్, జిల్లా పశు వైద్యాధికారులు, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకటరెడ్డి, విఏఎస్ డా.శ్రీనివాస్, ఏఎస్సై ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





# ఓపి పేషెంట్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేసిన నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ నాంపల్లి:** మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఆకాష్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ద్వారా అందుతున్న వైద్య సేవలను పీహెచ్సి వైద్యాధికారిణి డాక్టర్ భవాని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపి రిజిస్టర్, ఈడిడి, ఏఎన్సి తో పాటు అన్ని రిజిస్టర్ లను తనిఖీ చేశారు. పీహెచ్సిలో ఏడు మంది ఇన్ పేషెంట్లు ఉండడం చూసి జిల్లా కలెక్టర్ ఆసుపత్రికి వచ్చిన ఇన్ పేషెంట్లతో మాట్లాడారు.గ్రామాలలో అవగాహన కల్పించే ఓపి పేషెంట్లను అత్యధికంగా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా ఆమె ఎలాంటి రోగులు ఆసుపత్రికి వస్తున్నారని అడిగారు. బాలికల హాస్టల్ కు రెగ్యులర్ గా వెళ్తున్నారా అని అక్కడ సమస్యలు ఏంటని ప్రశ్నించగా విద్యార్థినిలు చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారని డాక్టర్ భవాని సాగర్ జిల్లా కలెక్టర్ తెలుపగా, బాలికలు రక్తహీనతతో బాధపడకుండా వారికి హెల్త్ ఎడ్యుకేషన్ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఆస్పత్రి పరిధిలో ఇప్పటివరకు జరిగిన శిశు మరణాల సంఖ్యను అడిగగా గత సంవత్సరం డిసెంబర్ వరకు 6 కేసులు నమోదు కాగా, అనంతరం ఈ మూడు నెలల్లో ఎలాంటి శిశు మరణాలు లేవని డాక్టర్ తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వంటగది, డైనింగ్ ,తరగతి గదులు, భోజనం అన్నిటిని పరిశీలించారు. వంటగదితోపాటు, డ్రైనింగు, పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ,ప్రత్యేకించి గ్యాస్ స్టవ్ ను రోజు శుభ్రం చేయాలని సూచించారు. 5వ, 10 వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థినిలు ప్రత్యేకంగా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని బాగా చదవాలని, క్రమ పద్ధతిలో లక్ష్యసాధనకు కృషి చేయాలని అన్నారు. విద్యార్తినిలకు పలు ప్రశ్నలు వేయడం ద్వారా జవాబులు రాబట్టి వారి విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఆమె వెంట తహసిల్దార్ జి .దేవా సింగ్, ఎంపీడీవో రామకృష్ణ శర్మ, ఎంపీఓ ఝాన్సీ, తదితరులు ఉన్నారు.

**ఐటిఐ కళాశాల నిర్మాణం కోసం స్థలం పరిశీలన**

**ప్రజాపక్షం/చండూర్:** చండూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేట రెవిన్యూలోని 361 సర్వేనెంబర్‌లో గల 2 ఎకరముల స్థలంలో నూతనంగా నిర్మించుటకు ప్రతిపాదిత స్థలాన్ని శుక్రవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆర్డీవోతో శ్రీదేవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐటిఐ కళాశాల నిర్మాణానికి అనువుగా ఉన్నందున ప్రతిపాదించిన స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీదేవి ,చండూరు తహసీల్దార్ దశరథ పాల్గొన్నారు.

## గ్రామాలలో తాగునీటి పనులకు రూ.5 కోట్ల విడుదల

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకుగాను, తాగునీటి బోర్లు, చేతిపంపులు, పైపులైన్లు, తాగునీటి ట్యాంకుల మరమ్మతు కు గాను జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో 827 తాగునీటి పనులు చేపట్టేందుకు డిఎంఎఫ్ టి నిధుల నుండి 5 కోట్ల 10 లక్షల రూపాయలను విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో గ్రామాలలో తాగునీటి చేతిపంపులతో పాటు, బోర్లను రిపేర్ చేయించాలని, అదేవిధంగా పైపులైన్ల మరమ్మత్తు చేయించడం, సింగిల్ ఫేస్ ,త్రి ఫేస్ మోటార్ల మరమ్మత్తు , ఓహెచ్ఎస్ ఆర్ ల ను మరమ్మతు చేయించాలని ఆమె ఆదేశించారు .ఈ పనులన్నింటిని సంబంధిత ఎంపీడీవోలు పర్యవేక్షించాలని, పనులు చేపట్టే ముందు పూర్తి అంచనాలు తయారుచేసి ముందస్తు అనుమతి తీసుకొని పనులు ప్రారంభించాలని ఆదేశించారు . పనులు పూర్తయిన తర్వాత ఫోటోలతో సహా బిల్లులు సమర్పించాలని ,గతంలో చేపట్టిన పనులు తిరిగి చేపట్టకూడదని, వేరే పథకాలలో చేపట్టిన పనులు డిఎంఎఫ్ టి నిధుల కింద చేపట్టకూడదని ఆమె స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేశారు .వేసవి లో తాగునీటి ఎద్దడి ఏర్పడకూడదన్న ఉద్దేశంతో జిల్లా ఇన్చార్జి మంత్రి అనుమతితో డిఎంఎఫ్టి ద్వారా నిధులు విడుదల చేయడం జరిగిందని, అందువలన ఎక్కడ తాగునీటికి సమస్య రాకుండా చూడాలని ఆమె అధికారులను ఆదేశించారు.

## టెన్త్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలను పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిఒల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. శుక్రవారం గద్వాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర పాఠశాల పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కల్టెకర్ పరీక్షల నిర్వహణ విధాన, విద్యార్థుల హాజరు వివరాలను అధికారుల నుండి తెలుసుకున్నారు. ప్రశ్నపత్రాల రికార్డులను పరిశీలించడంతో పాటు, పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా హాలులో నిరంతరం విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి తొలిరోజు పరీక్షలకు మొత్తం 7597 మంది విద్యార్థులు నమోదు కాగా వీరిలో 7565 మంది హాజరై 99.58 శాతం హాజరు శాతం నమోదయ్యిందని, 32 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

**పది పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్‌పి**

పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న సందర్భంగా జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస్ రావు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పరీక్షలు జరుగుతున్న విశ్వేశ్వరయ్య మెమోరియల్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రాలను సందర్శించి పరీక్షా సరళిని పరిశీలించారు. పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా ఏలాంటి లోపాలు ఉండకుండా పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఎస్పి వెంట డి.ఎస్పి మొగిలయ్య, పట్టణ ఎస్సై మధవకం , కళ్యాణ్ కుమార్ అన్నారు.

# సోషల్ మీడియాపై పోలీస్ ప్రత్యేక నిఘా

సోషల్ మీడియాను వినియోగం పట్ల జాగ్రత్తలు : జిల్లా ఎస్పీ కె.నర్సింహ్మా



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సాంకేతిక పరిజ్ఞానం బాగా అభివృద్ధి చెందిన నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరు సెల్‌ఫోన్ కలిగి ఇంటర్నెట్ అందుబాటులో ఉన్నందున, జీవనశైలీ సోషల్ మీడియా ప్రభావం పెరిగిపోయిందని, సమాచారాన్ని చేరవేసుకోవడానికి సామాజిక మాధ్యమాలు, వాట్సప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎల్స్ ఇలా చాల వేదుకలు అందుబాటులో ఉన్నాయని, వీటి వల్ల లాభాలు, నష్టాలు ఉన్నాయని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నర్సింహా అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీకార్యాలయంలో వివిధ విభాగాలను తనిఖీ చేశారు. సైబర్ సెక్యూరిటీ సెల్, ఐటి సెల్, కమాండర్ కంట్రోల్ సెంటర్, సోషల్ మీడియా మానిటరింగ్ యూనిట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సామాజిక మాధ్యమాలపై జిల్లా పోలీస్ శాఖ నిఘా పటిష్టం చేశామని అన్నారు. దీని కోసం పరిజ్ఞానం ఉన్న సిబ్బందిని కేటాయించామని తెలిపారు. ఫోన్, ఇంటర్నెట్ ఉన్నది కదా అని చాల మంది యువత, ప్రజలు అసభ్యకర పోస్టులు, ఇతరులను కించపరిచేలా సమాచారం పంపిస్తున్నారు. ఇది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం ప్రకారం నేరం, చాల మందికి జైలుకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. తప్పుడు సమాచారం ఇతరులపై అసభ్యకర, అసత్యసమాచారం ప్రచారం చేయకూడదన్నారు. ఇలాంటి వాటికి పాల్పడితే భారతీయ కొత్త న్యాయం చట్టాల ప్రకారం సమాచార సాంకేతికత చట్టం కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కేసు నేరం రుజువైనట్లయితే జైలుశిక్ష, జరిమాన విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఇలాంటి కేసుల్లో ఇరుక్కుంటే చదువులు, ఉద్యోగాల నిమిత్తం, విదేశాలకు వెళ్లేవారు పోలీసుల నుంచి నిరభ్యంతర ధృవపత్రాన్ని పొందలేరని, ఉద్యోగాలు పొందడంలో సమస్యలు వస్తాయన్నారు. ఎఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, ఆర్ఐ నర్సింహ, ఆర్ఎస్ఐ రాజశేఖర్, సాయిరాం సిబ్బంది ఉన్నారు.

## టెన్త్ పరీక్షకు 2732 మంది హాజరు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలో గల 12 పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగాయి. ఆయా పరీక్షా కేంద్రాలో సుమారు 2737 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 2732 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. విద్యార్థులను ఆయా కేంద్రాల వద్ద ఇన్విజిలేటర్లు తనిఖీలు చేసి కేంద్రంలోకి అనుమతించారు. పట్టణంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పారిశుద్ధ్య పనులు మున్సిపల్ అధికారులు చేపట్టారు. బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

**పరీక్షా కేంద్రాల పరిశీలన...** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ సందర్శించి పరిశీలించారు. పరీక్షా కేంద్రంలోని ఆయా తరగతి గదులను పరిశీలించారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాథమిక చికిత్స శిబిరంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు, ఎంఈవో బాలునాయక్, ప్రధానోపాధ్యాయులు ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

**పదవ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్**



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కేంద్రంలోని జడ్పి ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో 11915 మంది విద్యార్థులకు గానూ 11890 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 25 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. శుక్రవారం పరీక్షకు ఎటువంటి మాల్ ప్రాక్టిస్ చేయబడలేదని, పరీక్షలు ప్రశాంతంగా సజావుగా జరిగినట్లు అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

**పరీక్షలు బాగా రాయండి : జిల్లా కలెక్టర్**

**ప్రజాపక్షం/యాదాద్రి :** పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అయిన నేపథ్యంలో శుక్రవారం భువనగిరి పట్టణంలోని గంజ్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సందర్శించారు. పదవ తరగతి పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. అన్ని గదులను కలెక్టర్ కలియ తిరిగి ఎలక్ట్రిసిటీ, తాగునీరు తదితర మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పైన చీఫ్ సూపరింటెండెంట్‌కి పలు సూచనలు ఇచ్చి సజావుగా అన్ని పరీక్షలు జరిగేలా మానిటరింగ్ చేయాలన్నారు.



